PRAJASAKTI Regd.No. 15795/68

సిటీ◆

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 45 సంచిక : 137 | విజయవాడ, ఆదివారం 21 డిసెంబర్ 2025 | 8 + 8 పేజీలు +స్నేహ వెల : 7.00

Vol No | Vijayawada, Sunday 21 December 2025 | Rs

పసిడి డిమాండ్‌కు అధిక ధరల దెబ్బ

- ఈ ఏడాది వినిమయం 12 శాతం పతనం
- వరల్డ్ గోల్డ్ కౌన్సిల్ వెల్లడి

3



టైటిల్ కొట్టేదెవరో..?

- నేడు భారత్, పాకిస్తాన్ జట్ల మధ్య ఆసియాకప్ అండర్-19 క్రికెట్ ఫైనల్

8



తాళ్లపాలెంలోని సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ పాఠశాల విద్యార్థులతో సంభాషిస్తున్న చంద్రబాబు

జనవరి 26 నాటికి రోడ్డుపై చెత్త కనిపించకూడదు

- జూన్ 2026 నాటికి ప్లాస్టిక్ రహిత రాష్ట్రం
- 'స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర' ప్రజల భాగస్వామ్యంతోనే విజయవంతం
- ఉత్తరాంధ్ర ఇరిగేషన్ ప్రాజెక్టులన్నింటినీ రెండు మూడేళ్లలో పూర్తి చేస్తాం
- త్వరలో అనకాపల్లికి పోలవరం నీరు : సిఎం చంద్రబాబు

ప్రజాశక్తి- అనకాపల్లి

వచ్చే జనవరి 26 నాటికి రాష్ట్రంలో రోడ్డుపై చెత్త కనిపించకూడదని, ఈ మేరకు లక్ష్యంగా పెట్టుకున్నామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. వచ్చే ఏడాది జూన్ నాటికి రాష్ట్రాన్ని ప్లాస్టిక్ రహిత రాష్ట్రంగా చేస్తామని ప్రకటించారు. ఉత్తరాంధ్ర ఇరిగేషన్ ప్రాజెక్టులను రెండు మూడేళ్లలో పూర్తి చేస్తామన్నారు. అనకాపల్లి జిల్లా కశింకోట మండలం తాళ్లపాలెంలో శనివారం స్వచ్ఛాంధ్ర - స్వర్ణాంధ్ర కార్యక్రమంలో పాల్గొన్న ఆయన ప్రజా వేదిక నుంచి ప్రజలనుద్దేశించి మాట్లాడారు. దేశం మొత్తానికి స్ఫూర్తినిచ్చేలా స్వచ్ఛ భారత్ కార్యక్రమం నడుస్తోందన్నారు. ఇది ప్రజల భాగస్వామ్యంతోనే మరింత విజయవంతమవుతుందని పేర్కొన్నారు. స్వచ్ఛ ఉద్యమంలో ముందుండి నడిపించేది పారిశుధ్య కార్మికులేనని పేర్కొంటూ వారికి కృతజ్ఞతలు తెలిపారు. సర్క్యులర్ ఎకానమీ పాలసీ తెచ్చి రీ సైక్లింగ్ చేపట్టామన్నారు. కార్మికులు ఇళ్ల వద్దకు వెళ్లి చెత్తను సేకరిస్తున్నారని, తడి, పొడి చెత్తను వేరు చేస్తున్నారని, ఇది బలవంత కార్యక్రమంగా కాకుండా భావితరాల కోసం చేసే కార్యక్రమంగా భావించి అందరూ భాగస్వాములు మిగతా 7లో

'ఉపాధి హామీ' కోసం


దేశవ్యాప్త ఉద్యమం

సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బి.వి.రాఘవులు

కొత్త ఉపాధి పథకానికి వ్యతిరేకంగా ముఖ్యమంత్రి కేంద్రానికి లేఖ రాయాలి : వి.శ్రీనివాసరావు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

కొత్తగా తీసుకొచ్చిన జీరాంజీ బిల్లు వల్ల పేదలకు ఎటువంటి ఉపయోగమూ లేదని, మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని కొనసాగించాలని, దీనికోసం దేశవ్యాప్త ఆందోళన చేపడతామని సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బి.వి.రాఘవులు అన్నారు. శనివారం విజయవాడలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావుతో కలిసి ఆయన మాట్లాడారు. గతంలో ఉన్న ఉపాధిహామీ చట్టాన్ని రద్దుచేసి కొత్తగా జీరాంజీ పథకాన్ని తీసుకొచ్చారని, దీనిలో కార్మికులకుగానీ, రాష్ట్రాలకుగానీ ఎటువంటి హక్కులూ లేవని, ఉన్నవి కూడా పాక్షికంగానే ఉన్నాయని తెలిపారు. గతంలో కనీసం 100 రోజులు పని పేరుతో 50 రోజులన్నా కార్మికులకు ఉపాధి లభించేదని, ఇప్పుడు కేంద్రం దయాదాక్షిణ్యాలపై ఉండేలా చేశారని తెలిపారు. ఉపాధి హామీ పథకం వ్యవసాయ పనులకు ఆటంకమని చెబుతున్నారని, అలాంటిదేమీ లేదని అనేక నివేదికలు, పరిశోధనలు బయటపెట్టాయని తెలిపారు. కూలీరేట్లు పెరిగాయని చెబుతున్నారని, ఆచరణలో కూలీరేట్లు, వేతనాలు తగ్గాయని పేర్కొన్నారు. గ్రామీణ పేదలు, వ్యవసాయ కార్మికుల శ్రమను కార్పొరేట్లు దోచుకునేందుకు ఈ పథకం ఉపయోగపడుతుందని విమర్శించారు. పథకంలో నిధులు గతంలో కేంద్రానికి 90 శాతం రాష్ట్రానికి 10 శాతం వాటా ఉండేదని, ప్రస్తుతం 60:40గా మార్చారని తెలిపారు. ఆకలిచావులు, వలసలు నివారించేందుకు ఉపయోగపడిన ఈ చట్టాన్ని రద్దు చేయడం వల్ల మరలా ఆకలిచావులు పెరిగే ప్రమాదం ఉందని పేర్కొన్నారు. పైగా దీనికి నిధుల కేటాయింపు డిమాండును బట్టి కాకుండా రాజకీయ అవసరాలకు తగిన విధంగా కేటాయించేలా నిబంధనలు రూపొందించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. గతంలో కేంద్రం ముందుగానే నిధులు ఇచ్చేదని, ఇప్పుడు పనిచేసిన తరువాత ఇచ్చేలా పథకాన్ని రూపొందించారని తెలిపారు. ఉపాధి కల్పనలో ఆలస్యమయితే గతంలో కేంద్రమే పెనాల్టీ చెల్లించేదని, ఇప్పుడు ఆ బాధ్యతను రాష్ట్రం మీదకు నెట్టేశారని పేర్కొన్నారు. దీనిపై రాష్ట్రంలో అధికారంలో ఉన్న టిడిపి మాట్లాడటం లేదని, ప్రతిపక్షంలో ఉన్న వైసిపి కూడా గట్టిగా ప్రశ్నించడం లేదని అన్నారు. సెలక్టు కమిటీకి పంపించాలని చెప్పి వైసిపి చేతులు ముడుచుకు కూర్చుందన్నారు. రెండు పార్టీలూ మోడీని చూసి భయపడుతున్నాయని విమర్శించారు. రాష్ట్రంలో ఉన్న మూడు పార్టీలు మోడీతో అనుసరిస్తున్న తీరువల్ల రాష్ట్రానికి తీవ్రనష్టం వాటిల్లుతుందని అన్నారు.



మార్క్సిస్టు సిద్ధాంత కర్త మాకినేని బసవపున్నయ్య జయంతి సందర్భంగా 'ఆంధ్రప్రదేశ్‌లో పారిశ్రామికీకరణ తీరుతెన్నులు - రాష్ట్ర ప్రభుత్వ విధానాలు' అనే అంశంపై స్మారక ఉపన్యాసం చేస్తున్న బివి రాఘవులు (వార్త 2వ పేజీలో)

రాయలసీమకు వీలుగా పారిశ్రామిక పాలసీ మార్చాలి

రాయలసీమ ప్రాంతంలో గ్రీన్‌ఫీల్డ్ ఇండస్ట్రియల్-ఎలక్ట్రానిక్స్ సిటీ నిర్మించాలని, అక్కడ పరిశ్రమలకు అనువైన వాతావరణం కూడా ఉందని తెలిపారు. బెంగుళూరులో ఐటి అభివృద్ధి చెందింది కూడా అందువల్లేనని తెలిపారు. రాయలసీమను హార్టీకల్చర్ హబ్‌గా తీర్చిదిద్దుతానని, 41వేల కోట్లు అవసరమని ముఖ్యమంత్రి చెబుతున్నారని, ఢిల్లీలో నిధుల కోసం అడుగుతున్న ముఖ్యమంత్రి సీమలో పరిశ్రమల ఏర్పాటుపైనా దృష్టి సారించాలని సూచించారు. కావాల్సినంత విండ్, సోలార్ ఎనర్జీ ప్లాంటు ఉన్నాయని, ఇక్కడ విద్యుత్‌ను ఎక్కడికో తరలించే బదులు పరిశ్రమలు ఇక్కడే ఏర్పాటు చేస్తే వాటికి ఉపయోగించుకోవచ్చని అన్నారు. రాష్ట్రాన్ని అభివృద్ధి చేయాలంటే అవసరం ఉన్న చోట పరిశ్రమలు పెట్టాలని, కానీ ప్రభుత్వం కార్పొరేట్లు కోరినచోట భూములు ఇస్తోందని అన్నారు. ఇప్పటి వరకూ ఉన్న హార్టీకల్చర్‌ను కూడా రైతులే అభివృద్ధి చేశారనే విషయాన్ని గుర్తుపెట్టుకోవాలన్నారు. రాయలసీమలో పరిశ్రమలు మిగతా 7లో

గంజాయికి వ్యతిరేకంగా రాష్ట్రవ్యాప్త ఉద్యమం

రాష్ట్రంలో గంజాయి వాడకం విచ్చలవిడిగా పెరిగిందని, దీనికి వ్యతిరేకంగా సిపిఎం ఆధ్వర్యాన రాష్ట్ర వ్యాప్త ఆందోళన చేపడతామని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు తెలిపారు. గంజాయికి వ్యతిరేకంగా ప్రచారం చేస్తున్న ప్రభుత్వం దాన్ని ఆచరణలో పెట్టడం లేదని తెలిపారు. పైగా ఎవరైనా ఫిర్యాదులు చేస్తే గంజాయివాళ్లతో మీకెందుకంటూ బెదిరించే విధంగా పోలీసులు వ్యవహరిస్తున్నారని పేర్కొన్నారు. నెల్లూరులో పెంచలయ్య హత్య గంజాయి వ్యాపారానికి పరాకాష్టని అన్నారు. రాష్ట్రానికి యువత వనరని చంద్రబాబు పదేపదే చెబుతున్నారని, అటువంటి యువతను గంజాయి కబళిస్తోందని, అయినా నివారణకు చర్యలు తీసుకోవడం లేదని పేర్కొన్నారు. ఈ విషయంలో ప్రభుత్వాలకు నిజాయితీ కనిపించడం లేదన్నారు. ఈ నేపథ్యంలో సిపిఎం ఆధ్వర్యాన రాష్ట్ర వ్యాప్తంగా గంజాయిపై ఆందోళన చేపడతామని అన్నారు. ఆసక్తి ఉన్న, పార్టీలు ఉద్యమంలో కలిసి రావాలని కోరారు.

నేడు రాష్ట్ర వ్యాప్తంగా పల్స్‌పోలియో

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్ర వ్యాప్తంగా పల్స్‌పోలియో కార్యక్రమాన్ని నేడు (ఆదివారం) నిర్వహించనున్నారు. ఈ మేరకు అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ కమిషనరు జి.వీరపాండియన్ పేర్కొన్నారు. ఉండవల్లి క్యాంప్ కార్యాలయంలో సిఎం చంద్రబాబునాయుడు , కాకినాడ పట్టణ ఆరోగ్య కేంద్రంలో రాష్ట్ర వైద్యారోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ ఈ కార్యక్రమాన్ని ప్రారంభిస్తారని ఆయన తెలిపారు. ఈమేరకు శనివారం విడుదలచేసిన ప్రకటనలోరాష్ట్ర వ్యాప్తంగా 54,07,663 మంది ఐదేళ్ళలోపు పిల్లలకు 38,267 బూత్‌ల్లో పోలియో చుక్కలు వేయనున్నట్లు చెప్పారు, ఈ లక్ష్మానికి అనుగుణంగా 98,99,300డోస్‌లను ఇప్పటికే అన్ని జిల్లాలకు పంపించామన్నారు.ఈ కార్యక్రమాన్ని పర్యవేక్షించేందుకు అన్ని జిల్లాలకు నోడల్ ఆఫీసర్లను నియమించామన్నారు. ఈ కార్యక్రమంలో పోలియో చుక్కలు వేసుకోని చిన్నారుల కోసం ఇంటింటికి వెళ్లి వేయడానికి వీలుగా మొబైల్ బృందాలను కూడా ఏర్పాటు చేశారు. ఈ నెల 22,23 తేదీలలో వీరు ఇళ్లవద్దకు వెడతారు.

శ్రీహరి కోట నుంచి అమెరికా భారీ శాటిలైట్

24న బ్లూ బర్డ్ బ్లాక్ 2 ప్రయోగం



ప్రజాశక్తి- సూళ్లూరుపేట (తిరుపతి జిల్లా)

శ్రీహరికోట నుంచి అమెరికా భారీ శాటిలైట్ ప్రయోగం ఈ నెల 24న ఉదయం 8.54 గంటలకు జరగనుంది. దేశ శాస్త్రీయ సామర్థ్యాన్ని ప్రపంచానికి ఘనంగా చాటే ఈ చారిత్రక అంతర్జాతీయ ప్రయోగంతో శ్రీహరికోట సతీష్ ధావన్ అంతరిక్ష కేంద్రం (షార్) మరోసారి ప్రపంచ దృష్టిని ఆకర్షించింది. భారత ప్రభుత్వ రంగ సంస్థ న్యూ స్పేస్ ఇండియా లిమిటెడ్ నిర్వహిస్తున్న ఈ మిషన్ ద్వారా అమెరికాకు చెందిన భారీ వాణిజ్య శాటిలైట్ బ్లూ బర్డ్ బ్లాక్ 2ను భూమి చుట్టూ నిరంతరం పరిభ్రమించే కక్ష్యలోకి విజయవంతంగా ప్రవేశపెట్టనున్నారు. మనదేశంలో అత్యంత శక్తివంతమైన గగన్‌యాన్ శ్రేణికి చెందిన ఎల్‌బిఎం-3 రాకెట్ ద్వారా నిర్వహించనున్న ఈ ప్రయోగాన్ని ఎల్‌విఎం-3 ఎం 6 మిషన్‌గా పిలుస్తున్నారు. రెండో ప్రయోగ వేదిక నుంచి చేపట్టనున్న ఈ మిషన్‌లో ప్రయోగించబడే శాటిలైట్ బరువు సుమారు 6,500 కిలోలు. ప్రపంచ వ్యాప్తంగా సాధారణ స్మార్ట్‌ఫోన్లకు నేరుగా హైస్పీడ్ సెల్యూలర్ బ్రాడ్ బ్యాండ్ సేవలు అందించాలనే లక్ష్యంతో ఈ శాటిలైట్‌ను రూపొందించారు. దాదాపు 2,400 చదరపు అడుగుల విస్తీర్ణంగల అత్యాధునిక కమ్యూనికేషన్ అరేలు ఇందులో ఉన్నాయి. ఎర్త్ ఆర్బిట్‌లో ఇప్పటివరకు ప్రయోగించిన వాణిజ్య శాటిలైట్లలో ఇదే అతి పెద్ద ప్రయోగంగా నిలవనుంది. ప్రతి కవరేజ్ ప్రాంతంలో గరిష్టంగా 120 వేగం అందించే సామర్థ్యం ఈ శాటిలైట్‌కు ఉంది. ఒకప్పుడు ఇతర దేశాల సహకారంపై ఆధారపడిన భారత అంతరిక్ష కార్యక్రమం నేడు అమెరికా వంటి అగ్రశ్రేణి దేశాల శాటిలైట్లను స్వదేశీ రాకెట్ ద్వారా ప్రయోగించే స్థాయికి ఎదగడం దేశ శాస్త్రీయశక్తికి నిదర్శనంగా నిలుస్తోంది. ఈ మిషన్ ద్వారా అంతర్జాతీయ వాణిజ్య అంతరిక్ష రంగంలో భారత్ విశ్వసనీయత మరింత పెరిగి ప్రపంచంలో భారత స్థానం మరింత బలపడనుంది.

పాక్ మాజీ ప్రధాని ఇమ్రాన్ ఖాన్‌కు 17 ఏళ్ల జైలు

ఇస్లామాబాద్ : పాకిస్తాన్ మాజీ ప్రధాన మంత్రి ఇమ్రాన్ ఖాన్‌తో పాటు ఆయన సతీమణి బుష్రా బీబీకి శనివారం తోషాఖానా కేసులో ప్రత్యేక న్యాయస్థానం 17 ఏళ్ల జైలుశిక్ష విధించింది. రావల్పిండిలోని అదియాల జైలులో స్పెషల్ జడ్జి సెంట్రల్ షహరుఖ్ అర్జుమంద్ ఈ తీర్పు వెల్లడించారు. 2021లో సౌదీ అరేబియా అందించిన బంగారు ఆభరణాలను ఇమ్రాన్ ఖాన్ చాలా తక్కువ ధరకు కొనుగోలు చేశారనే ఆరోపణలపై కేసు నమోదు చేశారు. సుమారు రూ.8 కోట్ల విలువైన నగలను కేవలం రూ.29 లక్షలకే ఇమ్రాన్ ఖాన్ స్వాధీనం చేసుకున్నారని న్యాయ స్థానం ఇమ్రాన్ ఖాన్‌కు పదేళ్ల కఠిన శిక్ష, అవినీతి నివారణ చట్టం ప్రకారం ఏడేళ్ల శిక్ష విధించింది. ఆయన సతీమణికి కూడా అదే నిబంధనల కింద 17 ఏళ్ల జైలు శిక్ష విధించారు. దీంతో పాటు రూ.1.64 కోట్ల జరిమానా విధించారు. ఇమ్రాన్ ఖాన్ పార్టీ (పిటిఐ) ఈ తీర్పును ఇది 'కల్పిత, నకిలీ, నిరాధారమైనది' అని పేర్కొంది. న్యాయవాదులను సంప్రదించి తదుపరి చర్యలను తీసుకుంటామని ఆ పార్టీ నాయకులు ప్రకటించారు. అయితే, 2023 ఆగస్టు నుంచి అవినీతి కేసులో ఇమ్రాన్ ఖాన్ జైలు శిక్ష అనుభవిస్తున్నారు.

మత ఛాందసవాద శక్తులను నియంత్రించాలి

బంగ్లాదేశ్ పరిణామాలపై సిపిఎం ఆందోళన

న్యూఢిల్లీ : బంగ్లాదేశ్‌లో ఇటీవల నెలకొన్న పరిణామాలపై సిపిఎం తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. మీడియా సంస్థలపై, మైనారిటీలపై జరుగుతున్న దాడులపై తక్షణమే చర్యలు తీసుకోవాలని, ప్రజల హక్కులను కాపాడే చర్యలు చేపట్టాలని బంగ్లాదేశ్ తాత్కాలిక ప్రభుత్వాన్ని కోరింది. ఈ మేరకు పొలిట్‌బ్యూరో ఒక ప్రకటన విడుదల చేసింది. పేరొందిన రెండు సాంస్కృతిక సంస్థలు ఛాయనత్, ఉడిచిలపై దారుణంగా దాడి జరిగింది. మతం పేరుతో మైనారిటీలపై, తమకు అనుకూలంగా లేని మీడియా సంస్థలపై దాడుల ద్వారా సమాజాన్ని చీల్చడానికి ప్రయత్నిస్తూ బంగ్లాదేశ్‌లో మత ఛాందసవాద శక్తులు తమ ప్రభావాన్ని విస్తరించడానికి ప్రయత్నిస్తున్నట్లు కనిపిస్తోందని పొలిట్‌బ్యూరో పేర్కొంది. మత ఛాందసవాద శక్తులు పెరగడం వల్ల కేవలం బంగ్లాదేశ్‌పైనే కాకుండా మొత్తంగా ఈ ప్రాంతమంతటిపై తీవ్రమైన ప్రభావం వుంటుందని ఆందోళన వ్యక్తం చేసింది. సరిహద్దుకు ఇరువైపులా గల మతోన్మాద శక్తులు పరస్పరం రెచ్చగొట్టుకుంటూ విద్వేషాన్ని మరింత రెచ్చగొట్టేందుకు ఈ పరిస్థితులను అవకాశంగా తీసుకోవచ్చని పొలిట్‌బ్యూరో పేర్కొంది.

సామాజిక సామరస్యతను, ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించడం ప్రస్తుతం అవసరమని స్పష్టం చేసింది.

ఈ పరీక్షా సమయంలో బంగ్లాదేశ్ ప్రజలు సమైక్యంగా వుండి, 1971 నాటి విముక్తి పోరాట విలువలను పరిరక్షించగలరని సిపిఎం బలంగా విశ్వసిస్తోంది.

మతోన్మాద శక్తులను నియంత్రించేందుకు, హింసకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకునేందుకు అవసరమైన కార్యాచరణను తక్షణమే తాత్కాలిక ప్రభుత్వం చేపట్టాలని పొలిట్‌బ్యూరో కోరింది. అలాగే ఎలాంటి భయం లేకుండా ప్రజలు తమ భావాలను వెల్లడించేందుకు అనుమతిస్తూ, స్వేచ్ఛా, పారదర్శక వాతావరణంలో ఎన్నికలు జరిగేలా చూడాలని కోరింది.

రాజధాని ఎక్స్‌ప్రెస్ ఢీకొని ఏడు ఏనుగులు మృతి

- పట్టాలు తప్పిన ఐదు బోగీలు

గువాహటి : అస్సాంలోని హొజాయ్ జిల్లాలో శనివారం తెల్లవారు జామున దారుణం చోటుచేసుకుంది. మిజోరాంలోని సైరాంగ్ నుండి ఢిల్లీకి బయల్దేరిన రాజధాని ఎక్స్‌ప్రెస్ గజరాజుల గుంపును ఢీకొట్టడంతో ఏడు ఏనుగులు అక్కడికక్కడే మతి చెందగా, మరొకటి తీవ్రంగా గాయపడింది. తొలుత ఎనిమిది ఏనుగులు చనిపోయాయని భావించారు, ఆ తర్వాత వాటిలో ఒకటి గాయపడినట్లు గుర్తించి, వెటర్నరీ డాక్టర్ చికిత్స చేశారు. తెల్లవారు జామున 2.17గంటలకు ఈ ప్రమాదం చోటు చేసుకుందని అధికారులు తెలిపారు. ఈ ఘటనపై రైల్వే అధికారులు దర్యాప్తు చేపట్టారు.

ప్రమాదం ధాటికి ఇంజనుతో సహా ఐదు బోగీలు పట్టాలు తప్పాయి. ప్రయాణికులెవరికీ ఎలాంటి ప్రమాదం జరగలేదని నార్త్‌ఈస్ట్ ఫ్రాంటియర్ రైల్వే తెలిపింది. రైల్వే, అటవీశాఖ అధికారులు ఘటనా స్థలంలో సహాయక చర్యలు చేపట్టారు. ఈ ప్రమాదం కారణంగా ఈ మార్గంలోని రైళ్ల రాకపోకలకు అంతరాయం కలిగింది. తొమ్మిది రైళ్లను దారిమళ్లించగా, 13 రైళ్లను క్రమబద్ధీకరించారు. రెండు రైళ్లను కుదించినట్లు అధికారులు వెల్లడించారు. సంఘటనా ప్రాంతానికి ఉన్నతాధికారులు చేరుకున్నారు.



ఎలిఫెంట్ కారిడార్‌లో ప్రమాదం

పొగమంచు దట్టంగా వుండడంతో ఈ ప్రమాదం జరిగిందని భావిస్తున్నట్లు నాగావ్ డివిజన్ అటవీ అధికారి సుహాస్ కదమ్ తెలిపారు. ఏనుగుల కారిడార్‌గా ప్రకటించిన లుమ్‌డింగ్ డివిజన్ పరిధిలోని జమునాముఖ్ - కంపూర్ సెక్షన్‌లో ప్రమాదం జరిగిందని ఎన్‌ఎఫ్‌ఆర్ ముఖ్య ప్రతినిధి కపింజల్ శర్మ తెలిపారు.

రైలు డ్రైవర్ ఎమర్జెన్సీ బ్రేక్‌లు వేశాడని, అయినా ట్రైన్ ఏనుగులను ఢీకొందని చెప్పారు. ఏడు ఏనుగులకు పోస్టుమార్టం నిర్వహించేందుకు చర్యలు తీసుకున్నామని, ఇక్కడికి దగ్గరగానే వాటికి అంత్యక్రియలు చేస్తామని తెలిపారు.

గ్రామీణ ఉపాధి హామీతో కూలీల కొరత వచ్చిందా?

అవాస్తవాలంటున్న గణాంకాలు!



కర్ణాటకలోని దేవంగిరి గ్రామంలో ఉపాధి హామీ చట్టం కింద కాలువ పనులు చేస్తున్న కూలీలు (ఫైల్)

న్యూఢిల్లీ : వ్యవసాయ పనులు ఉధృతంగా వున్న సమయంలో కూలీల కొరత వచ్చిందనడానికి ఎటువంటి ఆధారాలు లేవని తాజాగా వెలుగు చూసిన గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. వరినాట్లు వేసే, పంట కోసే సమయాల్లో గ్రామీణ ఉపాధి పనులను నియంత్రించేందుకు మోడీ ప్రభుత్వం కొత్తగా తీసుకొచ్చిన 'విబి-జి ఆర్‌ఎఎం జి' బిల్లులో నిబంధనలు పొందుపరిచారు. వ్యవసాయ కార్యకలాపాలు ముమ్మరంగా వుండే సమయాల్లో కూలీలు తగినంతమంది అందుబాటులో వుండేలా చూసేందుకు గానూ ఒక ఆర్థిక సంవత్సరంలో 60 రోజుల పాటు గ్రామీణ ఉపాధి పనులను ప్రారంభించడం లేదా అమలు చేయడంపై నిషేధం విధించాలని, ఈ విషయాన్ని రాష్ట్ర ప్రభుత్వాలు ముందుగానే తెలియజేయాలని ఆ బిల్లులో ప్రతిపాదించారు. వాస్తవాలు అందుకు భిన్నంగా ఉన్నా, కొందరు పెత్తందారుల వాదనల మేరకు ఈ ప్రతిపాదనలు చేయడం గమనార్హం.

పదేళ్ల కాలానికి గ్రామీణ పనుల్లో, వ్యవసాయ పనుల్లో కూలి వృద్ధి, ద్రవ్యోల్బణ వివరాలు

సంవత్సరం	గ్రామీణ	వ్యవసాయ	ద్రవ్యోల్బణం
2015-16	4.79	3.71	5.53
2016-17	5.59	6.55	5.02
2017-18	5.17	5.31	3.61
2018-19	3.65	3.84	2.99
2019-20	3.55	3.43	4.25
2020-21	6.4	6.73	5.97
2021-22	3.88	4.82	5.38
2022-23	5.43	5.78	6.87
2023-24	6.25	7.09	5.56
2024-25	5.85	6.18	5.04

మహాత్మా గాంధీ గ్రామీణ ఉపాధి హామీ చట్టం అమలు చేయడం వల్ల గ్రామీణ లేబర్ మార్కెట్‌లో వ్యవసాయ, వ్యవసాయేతర కూలీల బేరసారాలు పెరిగాయని కొందరు వాదిస్తున్నారు. వాస్తవానికి వారి ద్రవ్యోల్బణంతో పోల్చితే, వారి వేతనాల్లో పెద్దగా పెరుగుదల కనిపించడం లేదు.

పైన గల పట్టికను పరిశీలించినట్లైతే, 2024-25 (ఏప్రిల్-మార్చి)తో ముగిసిన పదేళ్ల కాలానికి గ్రామీణ వేతనాల్లో వృద్ధి కనబడుతోంది. 25 వృత్తులకు రోజువారీ వేతనాల రేటు డేటా ప్రాతిపదికన లేబర్ బ్యూరో ఈ పట్టికను రూపొందించింది. దేశంలోని 20రాష్ట్రాల వ్యాప్తంగా 600 నమూనా గ్రామాల నుండి సేకరించిన డేటా ఇది.

టేబుల్‌ను నిశితంగా పరిశీలిస్తే గ్రామీణ వేతనాల్లో ఏ ఏడాదికి ఆ ఏడు పెరిగినట్లు చూడవచ్చు, అఖిల భారత స్థాయిలో అన్ని వృత్తులకు సంబంధించి పురుష కార్మికుల సగటు తీసుకుంటే ఆ పెరుగుదల 3.6 శాతం, 6.4శాతం మధ్య వుంది.

పదేళ్ల కాలంలో నాలుగేళ్ళు (2015-16, 2019-20, 2021-22, 2022-23) కాలాన్ని తీసుకుంటే గ్రామీణ వేతనాల్లో నామమాత్రపు పెరుగుదల అనేది ఆనాటి వినిమయ ధరల ద్రవ్యోల్బణం కన్నా బాగా వెనుకబడే వుంది. అంటే వాస్తవ గణాంకాలను బట్టి చూస్తే ఈ వేతనాలు పెరగడం కన్నా క్షీణించాయనే చెప్పాలి.

ఇక మిగిలిన సంవత్సరాల్లో, వాస్తవిక వేతన పెరుగుదల (నామమాత్రపు మైనస్ ద్రవ్యోల్బణం) 2017-18 సంవత్సరంలో మాత్రమే ఒక శాతం పెరిగింది.

ఆసక్తికరమైన అంశమేమంటే, మొత్తంగా గ్రామీణ వేతనాలతో పోల్చుకుంటే వ్యవసాయ పనులకు ఇచ్చే వేతనాల్లో పెరుగుదల పదేళ్లలో ఎనిమిదేళ్ల పాటు అధికంగా వుంది. కేవలం రెండేళ్ళు (2015-16, 2019-20) మాత్రమే వ్యవసాయ వేతనాల కన్నా గ్రామీణ వేతనాలు వేగంగా పెరిగాయి. వ్యవసాయం కింద 12 వృత్తులను లేబర్ బ్యూరో వర్గీకరించింది. అవి - దున్నడం, నాట్లు వేయడం, నీరు పెట్టడం, పంట మొక్కల రక్షణ, కోతలు / నూర్పిళ్ళు, వాణిజ్య పంటల కోతలు, ఉద్యానవన పనులు, పశు పోషణ పనులు, పంట ఉత్పత్తి ప్యాకేజింగ్, కట్టెలు కొట్టడం, లోతట్టు ప్రాంతాల్లో చేపలు పట్టడం, మిగతా 7లో

హైకోర్టుకు సమాచార మాజీ కమిషనరు

ప్రజాశక్తి-అమరావతి

కోర్టు ధిక్కరణ కేసులో సమాచార మాజీ కమిషనరు శ్యాముయ్యేల్ జొనాథన్ హైకోర్టుకు హాజరయ్యారు. గతంలో హైకోర్టు బెయిలబుల్ వారెంట్ జారీ చేయడంతో శనివారం ఆయన స్వయంగా కోర్టు విచారణకు హాజరయ్యారు. పిటిషనరు కోరిన సమాచారాన్ని అందజేయాలని సంబంధిత అధికారులను ఆదేశించడం ద్వారా కోర్టు ఆదేశాల్ని కమిషనరు అమలు చేశారని న్యాయవాది చెప్పారు. ఈ వివరాలను జస్టిస్ సుబ్బారెడ్డి నమోదు చేసుకున్నారు. బెయిలబుల్ వారెంట్‌ను రీకాల్ చేయాలంటూ శ్యాముయ్యేల్ వేసిన అనుబంధ పిటిషన్‌ను అనుమతించారు. కదిరికి చెందిన నూరుల్లా సమాచార హక్కు చట్టం కింద కదిరి మున్సిపాల్టీ నుంచి సమాచారాన్ని కోరితే ఇవ్వలేదు. దీంతో సమాచార హక్కు కమిషనరు వద్ద అప్పీల్ వేశారు. నిర్దిష్ట గడువులోగా అప్పీల్‌ను పరిష్కరించలేదంటూ హైకోర్టులో పిటిషన్ వేశారు. పిటిషనర్ వినతిని చట్ట ప్రకారం పరిష్కరించాలనే హైకోర్టు ఆదేశాలను అమలు చేయలేదంటూ నూరుల్లా అప్పటి సమాచార కమిషనరు శ్యాముయ్యేల్ జొనాథన్‌పై కోర్టు ధిక్కరణ వ్యాజ్యం వేశారు. ఈ కేసులో హైకోర్టు గతంలో వారెంట్ జారీ చేయడంతో స్వయంగా కోర్టుకు వచ్చి వివరణ ఇచ్చారు.

మహిళా షూటర్‌పై అత్యాచారం

- నిందితుడితో సహా ముగ్గురి అరెస్ట్

ఫరీదాబాద్: షూటింగ్ పోటీల్లో పాల్గొనడానికి వెళ్లి అత్యాచారానికి గురైన సంఘటన ఫరీదాబాద్‌లో చోటు చేసుకుంది. హోటల్‌లో బసచేసిన 23 ఏళ్ల మహిళా షూటర్‌పై సత్యేంద్ర అత్యాచారం చేసినట్లు ఆమె పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా.. షూటర్ స్నేహితురాలితో సహా ముగ్గురిని అరెస్ట్ చేసినట్లు పోలీస్ అధికారులు తెలిపారు. బుధవారం రాత్రి చోటు చేసుకున్న ఈ సంఘటనలో బాధితురాలు ఆ నిందితుడిని హోటల్‌లో బంధించి పోలీసులకు సమాచారం అందించగా.. సారై ఖవాజా పోలీస్ స్టేషన్‌లో ఈ కేసు నమోదైంది. నిందితుడు సతేంద్ర, గౌరవ్‌తో పాటు షూటింగ్ పోటీల్లో పాల్గొనేందుకు వచ్చిన మరో మహిళా షూటర్‌ను అరెస్ట్ చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. 23 ఏళ్ల యువ మహిళా షూటర్ తన స్నేహితురాలితో కలిసి షూటింగ్ పోటీల్లో పాల్గొనేందుకు ఫరీదాబాద్ రాగా.. బుధవారం సాయంత్రం పోటీలు ముగిసిన తర్వాత ఆమె స్నేహితురాలు ఫరీదాబాద్‌లో నివసిస్తున్న గౌరవ్‌కు ఫోన్ చేసి, ఆమెను మెట్రో స్టేషన్‌లో దింపమని కోరగా.. గౌరవ్ అతని స్నేహితుడు సత్యేంద్రతో కలిసి హోటల్‌కు వచ్చారు. హోటల్‌లోనే రాత్రికి బసచేసి మరుసటిరోజు బయలుదేరాలని నిర్ణయించుకున్న తర్వాత రెండు గదులను బుక్ చేసుకోగా.. ఒక గదిలో అందరూ కలిసి పార్టీ చేసుకున్నారు. రాత్రి 9గంటల సమయంలో స్నేహితురాలు, గౌరవ్ కలిసి కిందికి వెళ్లినప్పుడు గదిలో ఉన్న సత్యేంద్ర మహిళా షూటర్‌పై అత్యాచారం చేశాడు. ఈ సంఘటన గురించి వారు తిరిగి వచ్చినప్పుడు ఆమె తెలుపగా.. వారంతా కలిసి నిందితుడిని గదిలోకి బంధించినట్లు ఆమె ఫిర్యాదులో పేర్కొంది.

ప్రజాశక్తిపై స్పందన ఫోన్ : 9490099006

ప్రజల పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. ప్రజాశక్తిలో మీకు నచ్చిన నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తీసుకువస్తే మరింత పదును పెట్టుకోవడానికి వీలవుతుంది.

94900 99006 ఫోన్ నెంబర్‌కు ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయింత్రం 6 గంటల మధ్య మీ అభిప్రాయాలు తెలియజేయవచ్చు. మీరు చెప్పేది క్లుప్తంగా సూటిగా పద్ధతిగా వుండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగపడుతున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు.
అభిప్రాయాలు పంపదలిస్తే..

స్పందన, ప్రజాశక్తి తెలుగు డైలీ,
ప్రజాశక్తి భవనం-అమరరెడ్డి కాలనీ,
అరవింద హైస్కూల్ దగ్గర, తాడేపల్లి,
గుంటూరు జిల్లా - 522 501కు కానీ
editorprajasakthi@gmail.comకు
పంపవచ్చు.

పారిశ్రామికాభివృద్ధిలో రాష్ట్రం వెనుకబాటు

ఎంబి స్మారకోపన్యాసంలో బివి రాఘవులు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

పారిశ్రామిక అభివృద్ధిలో రాష్ట్రం వెనుకబడి ఉందని సుందరయ్య విజ్ఞాన కేంద్రం(ఎస్‌వికె) చైర్మన్, సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బివి రాఘవులు అన్నారు. సిపిఎం అగ్రనేత, మాకినేని బసవపున్నయ్య జయంతి సందర్భంగా 'ఆంధ్రప్రదేశ్‌లో పారిశ్రామికీకరణ తీరుతెన్నులు-రాష్ట్రప్రభుత్వ విధానాలు' అనే అంశంపై శనివారం రాత్రి విజయవాడలోని ఎంబి విజ్ఞాన కేంద్రంలో సదస్సు జరిగింది. ఎంబివికె చైర్మన్ పి మధు అధ్యక్షతన శనివారం జరిగిన ఈ కార్యక్రమంలో రాఘవులు స్మారకోపన్యాసం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాలకులు భూస్వామ్య మనస్థత్వంతో పారిశ్రామిక అవకాశాన్ని వినియోగించుకోకపోవడమే రాష్ట్ర వెనుకబాటుకు కారణమని చెప్పారు. సమాన అభివృద్ధి జరగాలంటే పెట్టుబడిదారిడిని శాసించి, నియంత్రించి రాష్ట్ర అభివృద్ధికి అనుగుణంగా వారిచేత చేయించుకోవాలని చెప్పారు. రాష్ట్రంలోని పాలకులు స్వతంత్ర శక్తి లేకపోవడంతో పెట్టుబడిదారుల చుట్టూ తిరుగుతున్నారని, పైకి మాత్రం తామే వారిని నడిపిస్తున్నామని చెబుతున్నారని అన్నారు. సిఐఐ పేరుతో టిడిపి, వైసిపి ప్రభుత్వంలో నిర్వహించిన సదస్సుల్లో లక్షల కోట్లు పెట్టుబడులు వస్తున్నాయని ఆర్భాటంగా చెప్పుకుంటున్నారు

తప్పితే ఆచరణలో రావడం లేదన్నారు. భూములు తీసుకుంటున్నారు కానీ, పరిశ్రమలు రావడం లేదని చెప్పారు. లేపాక్షి పేరుతో 8వేల ఎకరాలు, కాకినాడలో 8వేల ఎకరాలు, అనిల్ అంబానీకి కృష్ణపట్నం ఓడరేవు దగ్గర వేల ఎకారలు ఇచ్చారని అప్పగించారని, కానీ ఒక్క పరిశ్రమ రాలేదన్నారు. పెట్టుబడుల ఆకర్షణలో చివరి స్థానంలో రాష్ట్రం ఉందన్నారు. అవసరమైన స్కిల్ పవర్, మ్యాన్ పవర్ సాధించకుండా పారిశ్రామిక అభివృద్ధి జరగదన్నారు. దేశంలో ధరలు పడిపోవడంతో పరిశ్రమలు వచ్చేందుకు అవకాశం తక్కువగా ఉందని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా నివేదిక విడుదల చేసిందన్నారు. వెనుకబడ్డ ప్రాంతాలను ప్రభుత్వ రంగ పరిశ్రమల ద్వారా అభివృద్ధి చేయాలనే దృష్టితో పాలకులు ఇప్పటికీ ప్రయత్నించడం లేదన్నారు. రాష్ట్రాలను సమానంగా అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో కేంద్రప్రభుత్వం 1980వ దశకంలో పంచవర్ష ప్రణాళిక పేరుతో కొంత ప్రయత్నం చేసిందని రాఘవులు చెప్పారు. అప్పుడు కూడా రాష్ట్రంలో ఆ దిశగా ప్రయత్నాలు జరగలేదన్నారు. పెట్టుబడిదారుల ప్రభావంతో ఓడరేవులు ఉన్న చోటే కొన్ని ప్రభుత్వ రంగ సంస్థలు నెలకొల్పారని అన్నారు. ఆ సమయంలో కూడా రాయలసీమ, తెలంగాణ ప్రాంతాల్లో అభివృద్ధి జరగలేదన్నారు. 1997లో ప్రపంచ వాణిజ్య సంస్థ(డబ్ల్యూటివో) ప్రారంభమైన తరువాత 2శాతంగా ఉన్న ప్రపంచ వ్యాపారం దాదాపు 12శాతానికి పైగా పెరిగిందన్నారు. ఎగుమతులకు అవసరమైన ఉత్పత్తులు చేసి, ఓడరేవులను అభివృద్ధి చేసుకున్న రాష్ట్రాల ఆర్థిక వ్యవస్థ ముందుకు వెళ్ళిందని చెప్పారు. రాష్ట్రంలో ఓడరేవుల అభివృద్ధి పేరుతో హడావుడి చేసి వేల ఎకరాలు సేకరించారని వివరించారు.ఆ సమయంలోనే ఓడరేవుల అభివృద్ధి దృష్టిసారించాలని సిపిఎం డిమాండ్ చేసిందన్నారు. చంద్రబాబు మాత్రం ప్రపంచ బ్యాంకు నుంచి రూ.10వేల కోట్లు అప్పు తీసుకొచ్చి రోడ్ల అభివృద్ధి చేశారని, ఆ తరువాత వైఎస్ రాజశేఖర్ రెడ్డి జలయజ్ఞం పేరుతో పట్టించుకోలేదని చెప్పారు. రాష్ట్ర విభజన జరిగిన తరువాత అధికారంలోకి వచ్చిన చంద్రబాబు నాయుడు ప్రభుత్వం సింగపూర్ నమూనా పేరుతో అమరావతి పేరుతో హడావుడి చేశారని తెలిపారు. శాశ్వత అసెంబ్లీ, సచివాలయం నిర్మాణాలు కూడా చేయలేదన్నారు. ఆ తరువాత అధికారంలోకి వచ్చిన వైఎస్ జగన్ విశాఖపట్నం అంటూ అమరావతిని పట్టించుకోలేదన్నారు. రాజధాని ఇలా అవ్వడానికి చంద్రబాబు, జగనే కారణం అని చెప్పారు. ఇప్పుడు చంద్రబాబు మరోసారి రాజధాని కోసం 20వేల ఎకరాలు తీసుకునేందుకు ప్రయత్నిస్తున్నారని తెలిపారు. గతంలో సిఇవో అని తగిలించుకున్న చంద్రబాబు ఇప్పుడు బెస్ట్ బిజినెస్ రీఫార్మర్ అని తగిలించుకుంటున్నారని తెలిపారు. డేటా సెంటర్లు నీటి బుడగలు వంటివని విశాఖపట్నంలో ఏర్పాటు చేస్తున్న గూగుల్ డేటా సెంటర్ వెనుక అదానీ ఉన్నారని చెప్పారు. ఇది వస్తుందా? లేదో చెప్పలేమన్నారు. డేటా సెంటర్ గతంలో జరిగిన డాట్‌కమ్ బూమ్ వంటిదని, కాబట్టి ఇది కూడా అలానే పేలే అవకాశం ఉందన్నారు. ఎంబివికె వార్షిక నివేదికను కార్యదర్శి పి మురళీకృష్ణ ప్రవేశపెట్టిన ఈ కార్యక్రమంలో ఎంబివికె ట్రస్ట్ కార్యదర్శి వై వెంకటేశ్వరరావు, ఇన్‌చార్జ్ తులసీరావు, సభ్యులు స్వరూపరాణి పాల్గొన్నారు.



మాకినేని బసవపున్నయ్యకు నివాళులర్పిస్తున్న బివి రాఘవులు, పెనుమల్లి మధు, పి మురళీకృష్ణ, వై వెంకటేశ్వరరావు, తులసీరావు, స్వరూపరాణి

లారీలకు విఎల్‌టిడి అమరిక

- ఎపి లారీ ఓనర్స్ అసోసియేషన్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

కేంద్ర ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా లారీల్లో వాహన స్థానం (విఎల్‌టిడి) గుర్తింపు పరికరం అమరిక, యాక్టివేషన్ ప్రక్రియను పూర్తి చేయాలని యజమానులకు ఆంధ్రప్రదేశ్ లారీ ఓనర్స్ అసోసియేషన్ విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు అసోసియేషన్ శనివారం ఒక ప్రకటన విడుదల చేసింది. పబ్లిక్ సర్వీస్ వాహనాలు, నేషనల్ పర్మిట్ లారీలకు విఎల్‌టిడి అమరిక, యాక్టివేషన్ తప్పనిసరి చేస్తూ కేంద్ర ప్రభుత్వం మోర్త్ ఈ నెల 19న అధికారికంగా ఉత్తర్వులు జారీ చేసిందని తెలిపారు. ప్రస్తుతం దేశ వ్యాప్తంగా అనేక లారీల్లో విఎల్‌టిడి ఉన్నప్పటికీ అవి యాక్టీవ్‌గా లేకపోవడంతో కేంద్ర ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకునే అవకాశం ఉందన్నారు. వాహనాల రిజిస్ట్రేషన్/రెన్యువల్/యాజమాన్యం మార్పు 2026 జనవరి నుంచి విఎల్‌టిడి అమర్చకుండా యాక్టివ్ చేయకుండా కొత్త రిజిస్ట్రేషన్, రిజిస్ట్రేషన్ పునరుద్ధరణ, యాజమాన్యం మార్పు వాహన పోర్టల్‌లో ఆమోదం ఉండదని పేర్కొన్నారు. నేషనల్ పర్మిట్ రూల్ 90 ప్రకారం నేషనల్ పర్మిట్ కోసం విఎల్‌టిడి తప్పనిసరి అని, వాహన్ చెక్ ద్వారా కఠినంగా అమలు జరుగుతాయన్నారు. ఫిట్‌నెస్, పర్మిట్, రిజిస్ట్రేషన్ సమయంలో సమస్యలు రాకుండా ముందుగానే చర్యలు తీసుకోవాలని లారీ యజమానులకు వారు సూచించారు.

ఎన్నికల్లో ధన ప్రవాహంపై వివరణ ఇవ్వండి

- ఇసికి హైకోర్టు ఆదేశం

ప్రజాశక్తి-అమరావతి

సార్వత్రిక ఎన్నికల్లో ఓటర్లను ప్రభావితం చేసేందుకు రూ.కోట్లు వెచ్చించారంటూ ఎసిబి కోర్టులో సిట్ వేసిన చార్జిషీట్ ఆధారంగా కేంద్ర ఎన్నికల సంఘం విచారణ చేపట్టేలా ఉత్తర్వులు ఇవ్వాలంటూ దాఖలైన పిటిషన్‌ను హైకోర్టు శనివారం విచారించింది. జై భీమ్ రావ్ భారత్ పార్టీ తరపున పోటీ చేసిన విజయవాడకు చెందిన పరసా సురేష్ కుమార్ మరో 20 మంది ఇచ్చిన వినతిపత్రంపై ఏ నిర్ణయం తీసుకున్నదీ చెప్పాలని ఇసిని హైకోర్టు ఆదేశించింది. దీనిపై ఇసి న్యాయవాది జోక్యం చేసుకుని వివరాలు తెలుసుకుని చెప్పేందుకు గడువు కావాలని కోరారు. దీంతో విచారణను 2 వారాలకు వాయిదా వేస్తూ చీఫ్ జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్, జస్టిస్ చల్లా గుణరంజన్‌తో కూడిన ధర్మాసనం ఉత్తర్వులు జారీ చేసింది.

శ్రామిక ఉత్సవ్‌లో భాగంగా పుస్తక మహోత్సవం

- విశాఖలో 27 నుంచి జనవరి 2 వరకు నిర్వహణ

ప్రజాశక్తి - యంత్రాంగం

సిఐటియు 18వ అఖిల భారత మహాసభను జయప్రదం చేయాలంటూ విశాఖపట్నం గాజువాక మెయిన్ రోడ్డులో ప్రచారం నిర్వహించారు. కార్మిక పోరాటాలను, ఉద్యమ ప్రస్థానాన్ని తెలియజేసేలా చినముషిడివాడ, పెందుర్తి, సింహాచలం కూడళ్ల వద్ద ఫొటో ఎగ్జిబిషన్ ఏర్పాటు చేశారు. శ్రామిక ఉత్సవ్‌లో భాగంగా ఈ నెల 27 నుంచి జనవరి రెండు వరకూ తలపెట్టిన విశాఖ పుస్తక మహోత్సవం పోస్టర్‌ను డాబా గార్డెన్స్‌లోని అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రంలో మాజీ ఎమ్మెల్సీ ఎంవిఎస్.శర్మ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... విశాఖ నగరం పుస్తక పఠనానికి ఎప్పటి నుంచో ప్రధాన కేంద్రంగా నిలుస్తోందన్నారు. ఒకేచోట ప్రపంచ స్థాయి పుస్తకాల సమాహారాన్ని అందించే విశాఖ పుస్తక మహోత్సవాన్ని నగర ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. కంప్యూటర్ యుగంలో డిజిటల్ లైబ్రరీ పెట్టవచ్చు.. అయితే అది పుస్తకానికి రీప్లేస్ కానే కాదని అన్నారు. లక్షకు పైగా పుస్తకాలు ఒకే చోట ప్రదర్శన, అమ్మకాలు జరుగుతున్నాయని, వాటిని తిలకించి, అవసరమైన వాటిని ప్రతి ఒక్కరూ కొనుగోలు చేయాలని కోరారు.

విజయవాడ బుక్ ఫెస్టివల్ సొసైటీ కార్యదర్శి కె.లక్ష్మయ్య మాట్లాడుతూ... వందకుపైగా ప్రచురణకర్తల సహకారంతో లక్షకు పైగా పుస్తక శీర్షికలను ఒకేచోట అందుబాటులో ఉంచుతున్నామని తెలిపారు. ఈ ఏడు రోజుల పాటు సాహిత్య కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు వివరించారు. బీచ్ రోడ్డులోని ఎయు కన్వెన్షన్ హాల్ వెనుక ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో ఈ పుస్తక మహోత్సవం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ప్రజాశక్తి విశాఖ ఎడిషన్ మేనేజర్ ఎం.వెంకటేశ్వరరావు, ప్రజాశక్తి బుక్ హౌస్ విశాఖ బాధ్యులు శంకర్, నిర్వాహకులు ఉదయ కిరణ్ పాల్గొన్నారు. పశ్చిమగోదావరి జిల్లా తణుకులోని నరేంద్ర సెంటర్‌లో బెలూన్స్ ఆవిష్కరించారు. సిఐటియు ఆధ్వర్యంలో యలమంచిలిలో విరాళాలు సేకరించారు. నెల్లూరు రూరల్ వేదాయపాళెంలో సిఐటియు మహాసభ వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు.



పుస్తక మహోత్సవం పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎంవిఎస్.శర్మ, లక్ష్మయ్య తదితరులు



ప్రాజెక్టు శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్

తాగునీటి భద్రత ప్రజల హక్కు

- డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్
- తూర్పుగోదావరి జిల్లా పెరవలిలో అమరజీవి జలధార ప్రాజెక్టు పనులకు శంకుస్థాపన

ప్రజాశక్తి- రాజమహేంద్రవరం ప్రతినిధి

తాగునీటి భద్రత అనేది సంక్షేమ పథకం కాదని, అది ప్రజల హక్కని ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ అన్నారు. తూర్పుగోదావరి జిల్లా పెరవలి గ్రామంలో నిర్మించనున్న 'అమరజీవి జలధార' ప్రాజెక్టు పనులకు ఆయన శనివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి కందుల దుర్గేష్ అధ్యక్షతన జరిగిన సభలో పవన్ కల్యాణ్ మాట్లాడారు. వాటర్ గ్రిడ్ ప్రాజెక్టులో భాగంగా 'అమరజీవి జలధార'ను నిర్మిస్తున్నామన్నారు. వాటర్ గ్రిడ్‌లో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా ఐదు జిల్లాల పరిధిలో రూ.7,910 కోట్లు ఖర్చు చేస్తున్నామని తెలిపారు. వచ్చే 35 ఏళ్లలో 1.21 కోట్ల మంది దాహార్తి తీర్చే సంకల్పంతో పనిచేస్తున్నామన్నారు. తెలుగుజాతి ఆత్మగౌరవం కోసం అమరుడైన పొట్టి శ్రీరాములును స్మరించుకోవాలనే ఉద్దేశంతో వాటర్ గ్రిడ్ ప్రాజెక్టుకు 'అమరజీవి జలధార'గా నామకరణం చేశామని తెలిపారు.

అలాంటి వారికి యోగి ఆదిత్యనాథ్ ట్రీట్‌మెంటే కరెక్ట్

'మళ్లీ అధికారంలోకి వస్తాం, అంతు చూస్తాం' అని కొంతమంది వైసిపి నాయకులు బహిరంగంగా బెదిరింపులకు దిగుతున్నారని, పనులు చేస్తే కాంట్రాక్టర్లను జైల్లో పెడతామని అంటున్నారని, అలాంటి వారికి యోగి ఆదిత్యనాథ్ ట్రీట్‌మెంటే కరెక్టని పవన్ కల్యాణ్ అన్నారు. ప్రభుత్వం బలమైన రాజకీయ నిర్ణయం తీసుకుంటే 'మీ పరిస్థితి ఏంటో ఆలోచించుకోండి' అని వైసిపి నేతలను హెచ్చరించారు. మంత్రి దుర్గేష్ మాట్లాడుతూ ఈ ప్రాజెక్టు ద్వారా ఐదు జిల్లాల్లోని 23 నియోజకవర్గాలు, 66 మండలాల్లోని 67.82 లక్షల మంది ప్రజలకు తాగునీరు అందనుందని తెలిపారు.



విట్ యూనివర్సిటీలో నూతన జెన్‌జెడ్ తపాలా కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న మంత్రి పెమ్మసాని

ప్రైవేటు కన్నా మిన్నగా పోస్టల్ వ్యవస్థ

- కేంద్ర మంత్రి పెమ్మసాని

ప్రజాశక్తి - తుళ్లూరు (గుంటూరు జిల్లా)

పార్శిల్, ఎస్ఎంఎస్ తదితర సేవలను ప్రైవేటు సంస్థల కన్నా మిన్నగా పోస్టాఫీసులు పనిచేస్తాయని కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ అన్నారు. రాజధాని అమరావతిలోని విఐటి విశ్వవిద్యాలయంలో శనివారం నూతన జెన్‌జెడ్ తపాలా కార్యాలయాన్ని కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ ప్రారంభించారు. రాష్ట్రంలో ఇది మూడవది. ఈ సందర్భంగా చంద్రశేఖర్ మాట్లాడుతూ యువతను ఆకర్షించేలా ఇటువంటి జెన్‌జడ్ తపాలా కార్యాలయాలను దేశమంతటా పైలెట్ ప్రాజెక్టు కింద 50 నుండి 60 వరకు ఏర్పాటు చేయగా, మన రాష్ట్రంలో ఏర్పాటు చేయడం సంతోషకరమన్నారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ తమీమ్ అన్సారియా, ఎపి చీఫ్ పోస్ట్ మాస్టర్ జనరల్ బిపి శ్రీదేవి పాల్గొన్నారు.

వంశీ ముందస్తు బెయిల్ పిటిషన్‌పై విచారణ వాయిదా

ప్రజాశక్తి-అమరావతి

హత్యాయత్నం కేసులో ముందస్తు బెయిల్ మంజూరు చేయాలంటూ మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీ దాఖలు చేసిన పిటిషన్‌ను విచారించిన హైకోర్టు.. పోలీసులకు నోటీసులు జారీ చేసింది. కౌంటర్ దాఖలు చేయాలని ఆదేశిస్తూ జస్టిస్ వై లక్ష్మణరావు శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. పిటిషనరు తరపున న్యాయవాది దేవి సత్యశ్రీ వాదిస్తూ.. ఘటన జరిగిన 16 నెలలకు పోలీసులు కేసు నమోదు చేశారని, నిజానికి ఈ ఘటనలో వంశీనే బాధితుడని చెప్పారు. దీనికి చెందిన ఫొటోలను, వీడియో ఆధారాలను పరిశీలించాలని కోరారు. నూతక్కి సునీల్ అనే వ్యక్తి చేసిన ఫిర్యాదు మేరకు విజయవాడ మాచవరం పోలీసులు నమోదు చేసిన కేసులో పిటిషనర్‌కు ముందస్తు బెయిల్ మంజూరు చేయాలన్నారు. అత్యవసరంగా విచారణ చేపట్టేందుకు నిరాకరించిన న్యాయమూర్తి విచారణను ఈ నెల 29కి వాయిదా వేశారు. సార్వత్రిక ఎన్నికల ఫలితాల వెల్లడి తర్వాత వంశీ తన అనుచరులతో వచ్చి హత్యాయత్నానికి ప్రయత్నించారని ఫిర్యాదుదారుడు ఆరోపించారు.

ద్విచక్ర వాహనాలతోనే 'ప్రమాదం'

- ప్రమాద మృతుల్లో ఎక్కువ వీళ్లే
- సగానికిపైగా ప్రమాదాలు బైకులు, కార్లతోనే



ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

రోడ్లపై ద్విచక్ర వాహనాలు భయం పుట్టిస్తున్నాయి. జరుగుతున్న ప్రమాదాల్లో ఈ వాహనాలే మృత్యు కుహరాలుగా మారిపోతున్నాయి. పోలీసు అధికారులు చెబుతున్న గణాంకాల్లో అత్యధికంగా ద్విచక్ర వాహనాలే ప్రమాదాలకు కారణమవుతుండగా, రెండో స్థానంలో కార్లు ఉన్నట్లు కనిపిస్తోంది. రాష్ట్ర వ్యాప్తంగా ప్రతి రోజూ సగటున 23 మంది రోడ్డు ప్రమాదాల్లో మరణిస్తున్నట్లు లెక్కలు చెబుతున్నాయి. ఈ ఏడాది నవంబర్ వరకు 6,433 ప్రమాదాల్లో 6,990 మంది మృత్యువాత పడ్డారు. ఇది గతేడాది కన్నా 6.95 శాతం ఎక్కువగా ఉన్నట్లు తేలింది. ఈ మొత్తం ప్రమాదాల్లో ఏకంగా 33 శాతం ప్రమాదాలు కేవలం ద్విచక్ర వాహనాల వల్ల జరిగినవే కావడం విశేషం. ఇక మొత్తం ప్రమాదాల్లో మరణించిన వారిలో సొంతంగా వాహనాలు నడుపుతూ ఉన్న వాహనాల్లో వారే కావడం విశేషం. ప్రమాదాలు జరిగిన ఘటనల్లో దేశంలోనే ఆంధ్రప్రదేశ్ టాప్ 10లో నిలుస్తూ ఎనిమిదో స్థానంలో ఉండడం కూడా ఆందోళన కలిగిస్తోంది.

తిరుపతి టాప్‌లో

రోడ్డు ప్రమాదాల్లో తిరుపతి జిల్లా అగ్రస్థానంలో నిలవడం విశేషం. తరువాత స్థానంలో నెల్లూరు ఉండగా, మిగతా టాప్ ఫైవ్‌లో పల్నాడు, అన్నమయ్య, కృష్ణా జిల్లాలు ఉన్నాయి. విజయనగరం, విశాఖ జిల్లాల్లో ప్రమాదాలు ఇతర జిల్లాలతో పోల్చి చూస్తే తక్కువగా ఉన్నట్లు తేలింది. ఇక వాహనాల వారీగా ప్రమాదాలను పరిశీలిస్తే అక్టోబర్ వరకు ద్విచక్ర వాహనాల వల్లనే 2,275 ప్రమాదాలు సంభవించాయి.ఇది గతేడాది కన్నా కూడా అధికం కావడం విశేషం. ఇక రెండో స్థానంలో తేలికపాటి కార్లు వంటి వాహనాలు ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు.

అతి వేగమే కారణం

జరుగుతున్న ప్రమాదాల్లో ఏకంగా 79 శాతం వరకు అతి వేగం కారణంగా జరిగినవే ఉన్నట్లు గుర్తించారు. ఇక రాంగ్ రూట్ ప్రమాదాలు 3 శాతం ఉండగా, ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్, మద్యం సేవించి డ్రైవింగ్ ప్రమాదాలు కేవలం చెరో ఒక శాతంగా మాత్రమే ఉన్నట్లు గుర్తించారు. ఇతర కారణాలతో మరో 17 శాతం వరకు ప్రమాదాలు జరిగినట్లు తేల్చారు.

ప్రమాదంలో వివిధ వాహనాలద్వారా మరణించిన వారి వివరాలు

వాహనం	ప్రమాదాలు	మరణాలు
ద్విచక్ర వాహనం	2,190	2,275
తేలికపాటివి	1,402	1,528
లారీలు	1,241	1,386
త్రిచక్ర వాహనాలు	497	480
ప్రయివేటు బస్సులు	163	181

స్మశానవాటికకు దారిచూపండి

మృతదేహంతో తహశీల్దార్ కార్యాలయం వద్ద దళితుల ఆందోళన

ఎమ్మెల్యే బాలకృష్ణ హామీతో ఆందోళన విరమణ

ప్రజాశక్తి - చిలమత్తూరు (అనంతపురం జిల్లా)

స్మశానవాటికకు దారి చూపకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోన్న అధికారులపై దళిత కాలనీవాసులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్నిసార్లు చెప్పినా సమస్యను పరిష్కరించకుండా నిర్లక్ష్యం చేయడాన్ని నిరసిస్తూ మృతదేహంతో కార్యాలయం వద్ద ఆందోళన చేశారు. స్థానికుల కథనం ప్రకారం... అనంతపురం జిల్లా చిలమత్తూరు మండలం కొర్లకుంట ఎస్‌సి కాలనీకి చెందిన ఆదినారాయణప్ప భార్య అంజనమ్మ (48) శుక్రవారం రాత్రి అనారోగ్యంతో మృతి చెందారు. స్మశానానికి తీసుకెళ్లేందుకు సరైన దారి లేకపోవడంతో ఏమి చేయాలో తెలియక ఇబ్బంది పడ్డారు. అధికారులే ఈ సమస్యను పరిష్కరించాలని కోరుతూ అంజనమ్మ మృతదేహాన్ని తహశీల్దార్ కార్యాలయం వద్దకు గేటు వద్ద ఉంచి సమస్య పరిష్కరించే వరకు కదిలేది లేదంటూ అక్కడే మధ్యాహ్నం వరకు ఆందోళన చేశారు. వీరికి సిపిఎం, వ్యవసాయ కార్మిక సంఘం, ప్రజాసంఘాల నాయకులు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా సిపిఎం నాయకులు ప్రవీణ్‌కుమార్, సాకే హరి, దళిత కాలనీవాసులు మాట్లాడుతూ కొర్లకుంట గ్రామానికి సంబంధించి స్మశానవాటికకు స్థలం దారి సమస్యను పరిష్కరించాలని అధికారులకు పలుమార్లు విన్నవించినా స్పందన లేదని తెలిపారు. దళితులు ఎవరైనా మృతి చెందితే వారి అంత్యక్రియలకు ప్రతిసారీ ఇబ్బందులు పడాల్సిన దయనీయ పరిస్థితులు ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. విషయం తెలుసుకున్న ఆర్‌డిఒ ఆనంద్‌బాబు, డిఎస్‌పి మహేష్, తహశీల్దార్ వెంకటేష్ బాధితుల వద్దకు వచ్చి వారితో మాట్లాడుతూ సమస్యను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లామని, త్వరలో పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. గతంలో ఇచ్చిన హామీ నెరవేరలేదని, స్పష్టమైన హామీ ఇచ్చే వరకు ఆందోళన విరమించేది లేదని భీష్మించారు. విషయాన్ని స్థానిక కూటమి నాయకులు హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ దృష్టికి తీసుకెళ్లగా ఆయన స్వయంగా ఫోన్‌లో కాలనీ వాసులతో మాట్లాడారు. రెండు రోజుల్లో సమస్యను పరిష్కరిస్తామని, తన సొంత నిధులతో స్మశాన వాటికకు రోడ్డు ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. దీంతో బాధితులు ఆందోళనను విరమించారు. వెంటనే అధికారులు జెసిబి ఏర్పాటు చేసి స్మశానవాటిక వరకు తాత్కాలిక రోడ్డు తీయించి అంజనమ్మ అంత్యక్రియలను పూర్తి చేయించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేషన్ డైరెక్టర్ బేకరీ గంగాధర్, ఎస్‌సి, ఎస్‌టి జెఎసి అధ్యక్షులు సాకే హరి, కొర్లకుంట ఎస్‌సి కాలనీవాసులు పాల్గొన్నారు.



చిలమత్తూరు తహశీల్దార్ కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న కొర్లకుంట దళిత కాలనీవాసులు

ఆదర్శ చీమ



చీమ కనుచూపుకు చిన్నదే
కష్టానికి క్రమశిక్షణకు పెద్దదే
ఐక్యమత్యానికి సంఘ జీవనానికి
శ్రమైక జీవనానికి చిహ్నం!

చీమలు కావు సోమరులు
చీమలు సాంకేతిక నిపుణులు
శిల్పులు నిర్మించలేని అద్భుతమైన
చిత్రమైన మట్టి కోటలు
నిర్మిస్తాయి!

చీమలు పెట్టిన పుట్టలు
పాములకు డూప్లెక్స్ హౌసులు
ఆ పుట్టలలో ఎన్ని హంగులో
ఆధునికతను ప్రతిబింబిస్తాయి!

చీమలు ఎన్ని రకాలు ఉన్నను
పని విభజన సూత్రాన్ని
పాటిస్తాయి
ఆహార అన్వేషణ సేకరణలో
రేపటికి భద్రపరచడంలో దిట్టలు!


చీమకు దంతాలు ఉంటాయి
తమకంటే పదింతల బరువు
మోస్తాయి
చీమల జనాభా మనుషుల కంటే
ఎక్కువే
చీమలు మనిషికి 'క్యూ' పద్ధతి
నేర్పినవి!

చీమలు కలిసి నివసించే నేస్తాలు
చీమలు సాంఘిక సంక్షేమ
జీవనానికి
ప్రశాంత జీవనానికి దారులు
వేస్తాయి
అందుకే చీమలు ఆదర్శ జీవులు!

- పట్లొళ్ళ బక్కారెడ్డి,
97053 15250.

చుక్కలు కలపండి

పిల్లలూ , ఇక్కడ అంకెలు, సంఖ్యల దగ్గర చుక్కలను ఒకదాని తర్వాత ఒకటి కలపండి. ఏ బొమ్మ వచ్చిందో చూడండి.



నేను గీసిన బొమ్మ





బంగారి అక్షర,
6వ తరగతి,
జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల,
లక్ష్మీ పూర్, ఆదిలాబాద్ జిల్లా.

పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

పర్యావరణ పరిరక్షణ దాతృత్వం కాదు; బాధ్యత

'అడవులు, సరస్సులు, నదులు, వన్యప్రాణులతో సహా సహజ పర్యావరణాన్ని రక్షించడం, అభివృద్ధి చేయడం, జీవుల పట్ల కరుణ కలిగివుండడం' ప్రతి పౌరుడి ప్రాథమిక విధి.. అని రాజ్యాంగంలోని 51(ఎ)(జి) ఆర్టికల్‌లో చెప్పారు. ఆ ఆర్టికల్ కిందికి ఇప్పుడు కార్పొరేట్ కంపెనీలని తీసుకువచ్చింది సుప్రీంకోర్టు తాజా తీర్పు. శుక్రవారం వెలువడిన ఈ తీర్పులో 'పర్యావరణం, పర్యావరణ వ్యవస్థలోని ఇతర జీవుల మనుగడని విస్మరిస్తూ కంపెనీలు సామాజిక బాధ్యత వహిస్తాయని చెప్పకోలేవు' అని న్యాయమూర్తి నరసింహ వ్యాఖ్యానించారు. కార్పొరేట్ కంపెనీల బాధ్యతారాహిత్యం వల్ల భారతదేశంలో మనుగడ సాగిస్తున్న అరుదైన పక్షిజాతి 'గ్రేట్ ఇండియన్ బస్టర్డ్' అంతరించేపోయే దశకి చేరుకుందన్న పిటిషన్లపై విచారణ జరుగుతున్న సందర్భంగా కోర్టు పైవిధంగా వ్యాఖ్యానించింది.



'**పా**రిస్ ఒప్పందం' వంటి అనేక పర్యావరణ ఒప్పందాల నుండి అమెరికా వంటి అభివృద్ధి చెందిన దేశాలు తప్పుకుంటున్న వేళ.. మనదేశ అత్యున్నత న్యాయస్థానం ఇచ్చిన ఈ తీర్పు పర్యావరణ పరిరక్షణ బాధ్యత ఆయా దేశాలు, కార్పొరేట్ కంపెనీలదే అని స్పష్టం చేసింది. 'పర్యావరణాన్ని పరిరక్షించే కీలకమైన బాధ్యత కార్పొరేట్ కంపెనీల విధి' అని నొక్కి వక్కాణించింది. ఇంకా 'కార్పొరేట్ సామాజిక బాధ్యత (సిఎస్‌ఆర్)'ని పర్యావరణ బాధ్యతల్లో అంతర్లీనంగా చేర్చింది. 'సమాజంలో కీలకమైన వనరుగా పర్యావరణాన్ని పరిరక్షించడం చట్టపరమైన బాధ్యతగా చూడడం కార్పొరేషన్ ప్రాథమిక విధి' అని కూడా పేర్కొంది.

పర్యావరణ పరిరక్షణలో, జీవరాశి మనుగడలో కార్పొరేట్ కంపెనీల విధివిధానాలపై సుప్రీం ఈ తీర్పులో చేసిన వ్యాఖ్యలు ఇలా ఉన్నాయి. 'కార్పొరేట్ విధి కేవలం షేర్ హోల్డర్స్‌ని రక్షించడమే కాదు. మనమందరం నివసించే పర్యావరణ వ్యవస్థని రక్షించడం వరకు పరిణామం చెందాలి. కార్పొరేట్ కంపెనీలు తరచూ నిర్వచించే 'సామాజిక బాధ్యత'కి అర్థం అంతర్లీనంగా 'పర్యావరణ బాధ్యతగా ఉండాలి' అని న్యాయమూర్తులు పి.ఎస్.నరసింహ, అతుల్ ఎస్. చందూర్కర్‌లతో కూడిన ధర్మాసనం పేర్కొంది.

ఈ తీర్పు వెలువడడానికి దారి తీసిన పరిస్థితులని పరిశీలిస్తే.. ప్రపంచంలోని అత్యంత బరువైన పక్షి జాతుల్లో 'గ్రేట్ ఇండియన్ బస్టర్డ్' ఒకటి. ప్రపంచవ్యాప్తంగా 20కి పైగా ఉన్న ఈ పక్షి జాతుల్లో ప్రధానమైన నాలుగు రకాలు మన దేశంలోనే ఉన్నాయి. రాజస్థాన్, గుజరాత్‌లో ఎక్కువగా ఇవి కనిపిస్తాయి. మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్, కర్నాటక రాష్ట్రాల్లో కూడా ఈ పక్షులు మనుగడ సాగించేవి. అయితే 2008 నుండి వీటి సంఖ్య గణనీయంగా పడిపోయింది.

గడ్డిభూముల్లో ఎక్కువగా నివసించే ఈ పక్షులు రాజస్థాన్ థార్ ఎడారి ప్రాంతంలో దాదాపు అంతరించిపోయే దశకి చేరుకున్నాయి. దీనికి గల కారణాన్ని హైలెట్ చేస్తూ దాఖలైన పిటిషన్ల ఆధారంగా సుప్రీం పై తీర్పుని వెలువరించింది.

కంపెనీల చట్టం 2013 ప్రకారం పర్యావరణ పరిరక్షణ కోసం 'కంపెనీలు 'సిఎస్‌ఆర్' నిధులని కేటాయించడం 'స్వచ్ఛంద దాతృత్వ చర్య'గా చూడలేం. ఇది రాజ్యాంగ బాధ్యతని నెరవేర్చడంగా పరిగణించాలి' అని కూడా కోర్టు స్పష్టంగా పేర్కొంది.

పర్యావరణం అందరిదీ..

'అంతరించిపోతున్న జాతులని రక్షించాల్సిన బాధ్యత చాలా ముఖ్యమైనది. మైనింగ్, విద్యుత్ ఉత్పత్తి, మౌలిక సదుపాయాలు వంటి కార్పొరేట్ కార్యకలాపాలు జాతుల ఆవాసాలకి ముప్పు కలిగించకూడదు. అలాంటిచోట 'కాలుష్య కారక చెల్లింపు' అంటే అర్థం.. జాతుల పునరుద్ధరణ ఖర్చుని కంపెనీలు భరించడం. అంటే జీవరాశులు అంతరించిపోకుండా నిరోధించడానికి ఎక్స్-సిటు, ఇన్-సిటు పరిరక్షణ ప్రయత్నాల వైపు 'సిఎస్‌ఆర్' నిధులని మళ్లించాలని కోర్టు పేర్కొంది.

రాజస్థాన్, గుజరాత్‌లో కార్పొరేట్ కంపెనీలు నిర్మించిన పునరుత్పాదక విద్యుత్ జనరేటర్లు బస్టర్డ్ ఆవాసాలకి దగ్గరగా ఏర్పాటుచేశారు. అంటే ఆ నిర్మాణాలు ఆ పక్షులతో పాటు పర్యావరణాన్ని పంచుకున్నాయి. దీనిపై జస్టిస్ నరసింహ మాట్లాడుతూ 'ఈ నిర్మాణాలు పక్షుల నివాసంలో అతిథులుగా' కార్యకలాపాలు చేపట్టాలే తప్ప వాటి స్థావరాలని ఆక్రమించకూడదని గుర్తుంచుకోవాలి' అని పేర్కొన్నారు. ఈ సందర్భంగా నిపుణుల కమిటీ సిఫార్సు చేసిన కంపెనీల ప్రాధాన్యతా ప్రాంతాలని రాజస్థాన్, గుజరాత్‌లో వరుసగా 14,013 చదరపు కిలోమీటర్లు, 740 చదరపు కిలోమీటర్లకి సవరించడాన్ని కూడా న్యాయమూర్తులు సమర్థించారు.

గ్రేట్ ఇండియన్ బస్టర్డ్ (బట్టమేక పక్షి)



పొడవైన తెల్లటి మెడ.. తెలుపు, నలుపుల ఈకల హారం, బంగారు/గోధుమ వర్ణపు వీపు. తలపై నల్లని టోపీతో విశేషంగా ఆకర్షించే రూపం ఈ పక్షుల సొంతం. విమానం మాదిరి నేలపై పరుగులు తీసి గాల్లోకి లేచి తన విశాలమైన రెక్కలు విదిలిస్తూ గగన విహారం చేయడం వీటి ప్రత్యేకత. 1960లో జాతీయ పక్షిగా పోటీపడిన ఈ పక్షి 1969 నాటికి 1260 సంఖ్యతో భారతదేశంలో మనుగడ సాగించాయి. అయితే ఈ సంఖ్య ఇప్పుడు పదుల్లోకి పడిపోయింది. మన రాష్ట్రంలో నందికొట్కూరు సమీపంలోని రోళ్లపాడులో గతంలో 600 హెక్టార్లలో ఈ పక్షుల కోసం అభయారణ్యాన్ని కూడా ఏర్పాటుచేశారు. అయితే కొన్నేళ్లుగా అక్కడ కూడా ఇవి కనిపించడం లేదు.

ఏప్రిల్ 2018లో, భారతదేశంలోని అగ్ర వన్యప్రాణుల సంస్థ అయిన వైల్డ్‌లైఫ్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇండియా (డబ్ల్యుఐఐ) శాస్త్రవేత్తలు చేసిన సర్వేలో మహారాష్ట్రలో ఎనిమిది మాత్రమే ఉన్నాయని కనుగొన్నారు. ఫిబ్రవరి 2018లో, ఇంటర్నేషనల్ యూనియన్ ఫర్ కన్జర్వేషన్ ఆఫ్ నేచర్ (ఐయుసిఎన్) నివేదిక ప్రకారం గుజరాత్‌లో వాటి సంఖ్య 20గా ఉంది.

రంగవల్లులకు స్వాగతం!

సంక్రాంతి పండుగ హడావిడిలో ముగ్గులది ప్రత్యేక స్థానం. మరి ఇంకెందుకు ఆలస్యం? చకచకా ముగ్గులు వేసేయండి. 'జీవన' పాఠకులతో పంచుకోండి. తెల్ల కాగితంపై పెన్సిల్ లేదా బాల్‌పాయింట్ పెన్నుతో వేసిన ముగ్గులకు రంగులు నింపి పంపండి. అందరికీ అర్థమయ్యేలా నిలువు, అడ్డం చుక్కల వివరాలు కూడా పేర్కొనండి. మీ పేరు, చిరునామా, ఫొటో, ఫోన్ నెంబరు కచ్చితంగా పంపాలి. మెయిల్ ద్వారా పంపేవారు పూర్తి చిరునామా పంపాలి.

మా చిరునామా

రంగవల్లి

ప్రజాశక్తి దినపత్రిక, ప్రజాశక్తి భవనం, అరవింద హై స్కూలు దగ్గర,
అమరారెడ్డి కాలనీ, తాడేపల్లి - 522501, గుంటూరు జిల్లా.
మెయిల్ ఐడి : jeevanapageps@gmail.com, వాట్సాప్ : 83329 25496

పేదల పొట్ట కొట్టడమే కేంద్రం లక్ష్యం

- విబి - జిఆర్ఎఎంజి బిల్లును వ్యతిరేకించాలి : వి. వెంకటేశ్వర్లు
- సిఐటియు, వ్యవసాయ, కార్మిక, రైతు సంఘాల ఆధ్వర్యంలో నిరసనలు
- కలెక్టరేట్ల ఎదుట జిఒ ప్రతులు దహనం



ఏలూరు కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేస్తున్న నేతలు

ప్రజాశక్తి - యంత్రాంగం

మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని యథావిధిగా కొనసాగించాలని, వికసిత్ భారత్-గ్యారెంటీ ఫర్ రోజ్‌గార్ అండ్ ఆజీవిక మిషన్ బిల్లును రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ప్రజా సంఘాల ఆధ్వర్యంలో నిరసనలు, మౌనదీక్షలు చేపట్టారు. జిల్లా కలెక్టరేట్ల ఎదుట 197 జిఒ ప్రతులను దహనం చేశారు. 'చట్టబద్ధమైన హక్కు'ను రద్దు చేసి, స్కీమ్‌గా మార్చొద్దని, పేదలను ఉపాధికి దూరం చేయొద్దని నినాదాలు చేశారు. సిఐటియు, వ్యవసాయ, కార్మిక, రైతు, కౌలు రైతు సంఘాల ఆధ్వర్యంలో శనివారం ఆందోళనలు చేపట్టారు.

ఏలూరు జిల్లా కలెక్టరేట్ వద్ద నిర్వహించిన ధర్నానుద్దేశించి వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. ఉపాధి హామీ చట్టాన్ని నీరుగార్చి పేదల పొట్ట కొట్టడమే కేంద్ర ప్రభుత్వ లక్ష్యమా? అని ప్రశ్నించారు. గ్రామీణ పేదల జీవన విధానాన్ని పూర్తిగా మార్చిన మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేస్తూ కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన వికసిత్ భారత్-గ్యారెంటీ ఫర్ రోజ్‌గార్ అండ్ ఆజీవిక మిషన్ బిల్లును రద్దు చేయాలని డిమాండ్ చేశారు. గతంలో వేతనాలు నూరుశాతం కేంద్రమే భరించేదని, ఇప్పుడు రాష్ట్రాలపై 40 శాతం భారం వేయడం వల్ల రాష్ట్రానికి సుమారు రూ.ఐదు వేల కోట్ల నిధులు తగ్గి, పథకం అటకెక్కే ప్రమాదం ఉందన్నారు. సాంకేతికత పేరుతో వేధింపులు, ఆధార్ అనుసంధానం, ఇకెవైసి వంటి కారణాలతో రాష్ట్రంలో ఇప్పటికే 11 లక్షల మంది కార్మికుల పేర్లను తొలగించడం దారుణమని పేర్కొన్నారు. నెట్‌వర్క్ సమస్య వల్ల వేతనాలు రాక కార్మికులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాబోయే పార్లమెంట్ సమావేశాల్లో ఈ బిల్లును వ్యతిరేకించాలని ఎంపిలను కోరారు. రైతుసంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పి.రామకృష్ణ మాట్లాడుతూ.. పేదల బతుకుదెరువును దెబ్బతీసే కేంద్ర ప్రభుత్వ నియంతృత్వ పోకడలపై పోరాటాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అనంతరం కలెక్టరేట్ వద్ద 197 జిఒ ప్రతులను దహనం చేశారు. అనకాపల్లి జిల్లా రాంబిల్లి మండలంలోని రాంబిల్లి, మూలజంప గ్రామాలలో ఉపాధి కార్మికులు నిరసన తెలిపారు. గాంధీజీ చిత్రపటాలు పట్టుకొని పెద్ద పెట్టున నినాదాలు చేశారు. కె.కోటపాడు మండలం సూరెడ్డిపాలెం గ్రామంలో విబి - జిఆర్ఎఎం జి బిల్లు ప్రతులను దహనం చేశారు. అల్లూరి సీతారామరాజు జిల్లా రాజవొమ్మంగి మండలం చిన్నయ్యపాలెం, అరకులోయ మండలం శరభగుడలో నిరసనలు చేపట్టారు. శ్రీకాకుళం జిల్లా బూర్జ మండలం అడ్దూరుపేట, మసానపుట్టి గిరిజన గ్రామంలో విజి - జిఆర్ఎఎం జి ప్రతులను దహనం చేసి నిరసన తెలిపారు. కొత్తూరు నాలుగు రోడ్ల కూడలిలో, టెక్కలిలో గాంధీ విగ్రహం వద్ద నిరసన తెలిపారు. వజ్రపుకొత్తూరు మండలం గుల్లలపాడులో కార్మికులు మౌనదీక్ష చేపట్టారు. విజయనగరం కలెక్టరేట్ ఆవరణలో గాంధీజీ విగ్రహం వద్ద నిరసన తెలిపారు. శ్రీ సత్యసాయి జిల్లా పెనుకొండ, సోమందేపల్లి మండలాల్లో జిఒ ప్రతులను దహనం చేశారు. కడప, అన్నమయ్య జిల్లాల్లో ఎంపిడిఒ, తహశీల్దార్లకు వినతిపత్రాలు అందజేశారు. చిత్తూరు కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేపట్టారు. అనంతరం డిఆర్‌ఒకు వినతిపత్రం అందజేశారు. కర్నూలు జిల్లాలో తహశీల్దార్ కార్యాలయాల వద్ద నిరసన తెలిపి తహశీల్దార్లకు వినతిపత్రాలు అందజేశారు. నంద్యాలలో ఆత్మకూరు, నందికొట్కూరు, ప్యాపిలిలో నిరసన తెలిపారు.

అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలన తేదీలు ఖరారు

- ఎపిఎస్‌ఆర్‌టిసి జోనల్ సిబ్బంది శిక్షణ కళాశాల ప్రిన్సిపల్ నీలిమ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ఆర్‌టిసిలో అప్రెంటీస్ షిప్ చేసేందుకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న ఐటిఐ అభ్యర్థుల విద్యార్హత ధ్రువ పత్రాల పరిశీలన తేదీలను ఖరారు చేసినట్లు ఎపిఎస్ఆర్‌టిసి జోనల్ సిబ్బంది శిక్షణ కళాశాల ప్రిన్సిపల్ వి నీలిమ తెలిపారు.

ఈ మేరకు శనివారం ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. ట్రేడ్‌ల వారీ అభ్యర్థులు హాజరుకావాలన్నారు. మోటారు మెకానిక్, ఫిట్టర్, డ్రాఫ్ట్‌మెన్ సివిల్, వెల్డర్, పెయింటర్, మిషన్ ట్రేడ్స్ అభ్యర్థులు ఈ నెల 24న, ఎలక్ట్రీషియన్ ట్రేడ్ అభ్యర్థులు 26, 27 తేదీల్లో, డీజిల్ మెకానిక్ ట్రేడ్ అభ్యర్థులు 29, 30 తేదీల్లో ఆయా కేటగిరీల అభ్యర్థులు విజయవాడ విద్యాధరపురం, చెరువు సెంటర్‌లోని జోనల్ సిబ్బంది శిక్షణ కళాశాల వద్దకు ఉదయం 10 గంటలకు వారి ధ్రువ పత్రాలు తీసుకుని హాజరుకావాలన్నారు. సర్టిఫికెట్స్ పరిశీలనకు హాజరయ్యే వారు వారి ఒరిజినల్ సర్టిఫికెట్స్‌తోపాటు రెండు సెట్ల జెరాక్స్ కాపీలు తీసుకుని రావాలన్నారు. తీసుకుని రావాల్సిన డాక్యుమెంట్స్ వివరాలు www.apsrtc.ap.gov.in నందు పేర్కొన్నామన్నారు. అదనపు సమాచారం కావాల్సిన వారు ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు 7382900591, 7382900299, 7989790054, 814218868 నెంబర్లకు సంప్రదించాలని తెలిపారు.

పెంచలయ్య కుటుంబానికి కాంగ్రెస్ రూ.లక్ష ఆర్థిక సాయం

ప్రజాశక్తి- నెల్లూరు


పెంచలయ్య కుటుంబ సభ్యులకు నగదు అందజేస్తున్న కాంగ్రెస్ నాయకులు

ఇటీవల నెల్లూరు నగరంలో గంజాయి మాఫియా చేతిలో దారుణ హత్యకు గురైన ప్రజానాట్యమండలి కళాకారుడు, సిపిఎం నాయకులు కె.పెంచలయ్య కుటుంబానికి కాంగ్రెస్ పార్టీ నగర అధ్యక్షులు నారపురెడ్డి కిరణ్‌కుమార్‌రెడ్డి రూ.లక్ష సాయం అందజేశారు. తన వ్యక్తి గత నిధుల నుంచి ఈ సాయం అందించారు. ఇటీవల నెల్లూరులో నిర్వహించిన పెంచలయ్య సంస్మరణ సభకు నారపురెడ్డి కిరణ్ కుమార్‌రెడ్డి హాజరయ్యారు. పెంచలయ్య కుటుంబానికి తమ వంతు సహాయంగా రూ. లక్ష అందజేస్తానని ఆ సందర్భంగా హామీ ఇచ్చారు. ఈ నేపథ్యంలో తన అనుచరుల ద్వారా లక్ష రూపాయలను పెంచలయ్య కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు మాదాల వెంకటేశ్వర్లు, కాంగ్రెస్ పార్టీ నెల్లూరు నగర ఉపాధ్యక్షులు సంజయ్, ఇర్ఫాన్, ప్రధాన కార్యదర్శి సుధీర్, ధనుంజయ్ తదితరులు పాల్గొన్నారు.

పసిడి డిమాండ్‌కు అధిక ధరల దెబ్బ

- ఈ ఏడాది వినిమయం 12 శాతం పతనం
- వరల్డ్ గోల్డ్ కౌన్సిల్ వెల్లడి



ముంబయి : బంగారం అధిక ధరలు అభరణాల డిమాండ్‌ను దెబ్బతీస్తున్నాయి. పసిడి ధరలు రికార్డ్ స్థాయిలో ఎగిసిపడటంతో కొనుగోళ్లపై ప్రతికూల ప్రభావం పడుతోందని వరల్డ్ గోల్డ్ కౌన్సిల్ (డబ్ల్యుజిసి) ఓ రిపోర్ట్‌లో తెలిపింది. ఈ ఏడాది బంగారం వినియోగం 650-700 టన్నులకు పడిపోవచ్చని అంచనా వేసింది. 2024లో 802.8 టన్నుల వినిమయం చోటు చేసుకుంది. ప్రస్తుత ఏడాది 2025లో జనవరి నుంచి ఇప్పటి వరకు బంగారం ధరలు 65 శాతం కంటే ఎక్కువగా పెరిగాయి. శుక్రవారం 10 గ్రాముల పసిడి ధర దాదాపు రూ.1.34 లక్షలుగా పలికింది. బంగారం ధరలు భారీగా పెరగడంతో 22 క్యారెట్ల కంటే 18, 14, 19 క్యారెట్ల పసిడి కొనుగోళ్లకు వినియోగదారులు మొగ్గు చూపుతున్నారని డబ్ల్యుజిసి ఇండియా సిఇఒ సచిన్ జైన్ తెలిపారు. ప్రస్తుతం మార్కెట్‌లో రెండు భిన్నమైన ధోరణలు కనబడుతున్నాయన్నారు. పెట్టుబడి రూపంలో బంగారానికి ఆదరణ పెరుగుతోందన్నారు. అభరణాల విభాగం డిమాండ్‌లో బలహీనత కొనసాగుతోందన్నారు. పెళ్లిళ్ల సీజన్‌లో అమ్మకాలు ఎక్కువగా ఉంటాయని.. కానీ ఈ సారి అధిక ధరల వల్ల కొనుగోళ్లు తగ్గాయని సచిన్ జైన్ తెలిపారు. గతేడాదితో పోల్చితే అమ్మకాల పరిమాణం తక్కువగా ఉందన్నారు. శనివారం హైదరాబాద్ మార్కెట్‌లో 24 క్యారెట్ల స్వచ్ఛత కలిగిన 10 గ్రాముల బంగారం ధర రూ.1,34,180గా పలకగా.. 22 క్యారెట్ల ధర రూ.1,23,000గా నమోదయ్యింది. 10 గ్రాముల వెండి ధర రూ.2,260గా, కిలో వెండి ధర రూ.2.26 లక్షలుగా ఉంది.

డబ్ల్యుజిసి రిపోర్ట్ ప్రకారం.. ఈ ఏడాదిలో ఇప్పటి వరకు మొత్తం బంగారం దిగుమతుల విలువ 2 శాతం పెరిగి 55 బిలియన్ డాలర్లకు చేరింది. అయితే పరిమాణం ప్రకారం 20 శాతం తగ్గి 580 టన్నులుగా నమోదయ్యింది. కాగా.. సంపన్న కుటుంబాలు 100 నుండి 400 గ్రాముల బరువున్న బంగారం వస్తువులను ఎక్కువగా కొనుగోలు చేశారు. బంగారం బిస్కెట్లు, నాణేల వంటి పెట్టుబడి ఉత్పత్తులకు డిమాండ్ బలంగా ఉంది. జులై-అక్టోబర్‌లో 340 టన్నుల దిగుమతులు జరిగాయి. నవంబర్‌లో భారత పసిడి దిగుమతుల్లో 73 శాతం తగ్గుదల చోటు చేసుకుందని డబ్ల్యుజిసి తెలిపింది. అమ్మకాలు లేక చిన్న, స్వతంత్ర అభరణాల వర్తకులు తీవ్ర ఒత్తిడిని ఎదుర్కొంటున్నారని.. పెద్ద, మధ్య తరహా అభరణాల విక్రేతలు ఓ మోస్తారు అమ్మకాలను నమోదు చేస్తోన్నారని సచిన్ జైన్ తెలిపారు.

భారత్‌కు ఎడిబి రూ.35 వేల కోట్ల రుణం



న్యూఢిల్లీ : ఆసియన్ డెవలప్‌మెంట్ బ్యాంక్ (ఎడిబి) తాజాగా భారత్‌కు 4.26 బిలియన్ డాలర్ల అప్పు ప్రకటించింది. భారత కరెన్సీలో ఇది దాదాపు రూ.35,000 కోట్లకు సమానం. ప్రస్తుత ఏడాది 2025కి గాను ఈ రుణాన్ని జారీ చేసింది. నైపుణ్యాభివృద్ధి, పునరుత్పాదక ఇంధనం, నగరాల ఆధునీకరణ, ఆరోగ్య సంరక్షణ, స్థిరమైన పర్యాటకం వంటి రంగాల్లోని ప్రాజెక్టులకు గాను ఈ అప్పులను అందించనుంది. సామాజిక అభివృద్ధి, నిరుద్యోగ్యాన్ని తగ్గించడానికి 32 శాతం నిధులను ఉపయోగించాల్సి ఉంటుంది. ఇంధన రంగం 26 శాతం, పట్టణాభివృద్ధి కోసం 18 శాతం చొప్పున కేటాయింపులు చేయాల్సి ఉంటుంది.

స్టార్‌బక్స్ సిటిఒగా ఆనంద్ వరదరాజన్



న్యూఢిల్లీ : కాఫీ రిటైల్ దిగ్గజ సంస్థ స్టార్‌బక్స్ తమ కంపెనీ చీఫ్ టెక్నాలజీ ఆఫీసర్‌గా ఆనంద్ వరదరాజన్‌ను నియమించుకుంది. వినియోగదారులకు సమర్థవంతమైన సేవలు అందించేందుకు స్టార్‌బక్స్‌లో సాంకేతికతను పెంచాలనే సిఇఒ బ్రియాన్ నికోల్ ప్రయత్నాల్లో భాగంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొంది. ఇంతక్రితం సిటిఒగా పని చేసిన లెఫ్రెవ్ పదవీవిరమణ చేయడంతో భారత టెకీ వరదరాజన్ ఆస్థానంలోకి రావడం విశేషం.



మారుతి సుజుకి ఆర్‌సి భార్గవ్‌కు ఐసిఎస్‌ఐ లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్ అవార్డు

న్యూఢిల్లీ : దేశంలోనే అతిపెద్ద కార్ల తయారీ కంపెనీ మారుతి సుజుకి ఛైర్మన్ ఆర్‌సి భార్గవ్‌కు 'ఐసిఎస్‌ఐ లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్' అవార్డు దక్కింది. కార్పొరేట్ గవర్నెన్స్‌లో అత్యుత్తమ ప్రమాణాలను పాటించినందుకు గాను ఐసిఎస్‌ఐ ఈ అవార్డును ప్రదానం చేసింది. "ఈ గౌరవం నాకు దక్కినప్పటికీ మారుతి సుజుకి మేనేజ్‌మెంట్, ఉద్యోగుల భాగస్వామ్యం లేకుండా ఇది సాధ్యమయ్యేది కాదు." అని ఆర్‌సి భార్గవ్ పేర్కొన్నారు.

ఐసిఐసిఐ ప్రుడెన్షియల్ లైఫ్ నుంచి కొత్త ఫండ్

ముంబయి : ఐసిఐసిఐ ప్రుడెన్షియల్ లైఫ్ ఇన్సూరెన్స్ కంపెనీ లిమిటెడ్ కొత్తగా 'ఐసిఐసిఐ ప్రు సెక్టార్ లీడర్స్ ఇండెక్స్ ఫండ్'ను ఆవిష్కరించినట్లు పేర్కొంది. ఇందులోని నిధులను భారత ఆర్థిక వ్యవస్థలోని 20కి పైగా కీలక రంగాలలోని అగ్రగామి కంపెనీలలో పెట్టుబడి పెట్టనున్నట్లు ఆ సంస్థ ప ఏర్కొంది. కనీస పెట్టుబడి మొత్తాన్ని రూ.1,000గా నిర్ణయించింది.

హెచ్‌సిఎల్ చేతికి టెల్కో సొల్యూషన్స్ వ్యాపారం

నోయిడా : టెక్ హ్యూలెట్ ప్యాకర్డ్ ఎంటర్‌ప్రైజ్‌కు చెందిన టెల్కో సొల్యూషన్స్ వ్యాపారాన్ని గ్లోబల్ టెక్నాలజీ దిగ్గజం హెచ్‌సిఎల్ స్వాధీనం చేసుకుంది. టెల్కో సొల్యూషన్స్‌ను కొనుగోలు చేయడానికి ఒప్పందం కుదుర్చుకున్నట్లు ఆ సంస్థ శనివారం ఓ ప్రకటనలో పేర్కొంది. టెలికాం రంగంలో తన మార్కెట్ నాయకత్వాన్ని మరింత సుస్థిరం చేసుకోవడంలో భాగంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు హెచ్‌సిఎల్ టెక్ పేర్కొంది. టెలికాం కంపెనీలు పూర్తిస్థాయి టెక్నాలజీ కంపెనీలు మారడంలో హెచ్‌సిఎల్ కీలక పాత్ర పోషించనుందని హెచ్‌సిఎల్ టెక్ చీఫ్ గ్రోత్ ఆఫీసర్ అనిల్ గంజూ పేర్కొన్నారు. ఈ లావాదేవీ వల్ల వినియోగదారులకు రాబోయే కాలంలో వినూత్నమైన సేవలు అందుతాయని హెచ్‌పిఇ నెట్‌వర్కింగ్ ప్రెసిడెంట్ రామి రహీమ్ తెలిపారు.

35 లక్షల వ్యాగన్‌ఆర్ యూనిట్ల ఉత్పత్తి

న్యూఢిల్లీ: మారుతి సుజుకి ఇండియా లిమిటెడ్ తన ఐకానిక్ మోడల్ వ్యాగన్‌ఆర్‌లో ఇప్పటి వరకు 35 లక్షల యూనిట్ల ఉత్పత్తిని పూర్తి చేసుకున్నట్లు ప్రకటించింది. ఇది ఒక చారిత్రాత్మక మైలురాయని పేర్కొంది. 1999 డిసెంబర్‌లో ప్రారంభమైన వ్యాగన్‌ఆర్ ప్రయాణం కోట్లాది మంది భారతీయ వినియోగదారుల నమ్మకాన్ని, భావోద్వేగ అనుబంధాన్ని ప్రతిబింబిస్తోందని పేర్కొంది. 25 ఏళ్ల ఈ విజయం కేవలం ఉత్పత్తి సంఖ్య మాత్రమే కాదని.. తరతరాలుగా వినియోగదారులు వ్యాగన్‌ఆర్ బ్రాండ్‌పై ఉంచిన అచంచలమైన నమ్మకానికి నిదర్శనమని ఆ కంపెనీ ప్రతినిధి హిషాషి టేకుచి పేర్కొన్నారు.

సంపాదకీయం

చిన్నకథ చిరాయువు

'కథా...కథా...నువ్వెప్పుడు పుట్టావని అడిగితే, అనగనగా అంటూ నీకు కథలు చెప్పిన అవ్వనడుగు' అందిట. ఏతావాతా చూస్తే... కథ మానవుడి తోపాటే పుట్టింది. ఊసులు, మాటలు, చిన్నచిన్న కథలు పుట్టాయి. అనగనగా ఒక ఊరు, ఆ ఊరిలో ఒక ముసలమ్మ, అనగనగా ఒక రాజు... ఆ రాజుకు ఏడుగురు కొడుకులు- చిన్నప్పుడు అవ్వ, తాత పిల్లలకు చెప్పే కథలు ఇలాగే మొదలవుతాయి. కథ నిడివి చిన్నదే కావొచ్చు. కానీ, దాని కాన్వస్ విస్తృతి ప్రపంచాన్ని చుట్టివస్తుంది. ప్రపంచంలోని అన్ని భాషల వాళ్లు కథలు చెబుతారు, రాస్తారు, కథలు చదువుతారు. పసిబిడ్డ నుంచి పండు ముదుసలి వరకూ ఇంత ఇష్టాన్ని, ఆసక్తిని కలిగించే కథ... లిపి పుట్టక ముందు, ఇంకా చెప్పాలంటే భాష పుట్టక ముందే పుట్టింది. 'మానవుని ఊహ ఏనాడు రెక్క విప్పుకొందో... ఆనాడే పుట్టింది కథ' అంటారు పోరంకి దక్షిణామూర్తి. 'కుక్కపిల్ల, అగ్గిపుల్ల, సబ్బుబిళ్ల కాదేది కవితకనర్హం' అని మహాకవి శ్రీశ్రీ అంటే, దానికి బుక్కులు రాసి మరీ చూపించాడు రావిశాస్త్రి. ప్రకృతి వస్తువైంది, ప్రవృత్తి ఇతివృత్తమైంది. ఈ జగత్తు కథగా మారింది. చెట్టు, పుట్ట, గుట్ట, గట్టు, రట్టు, విట్టు, బెట్టు, తిట్టు, పిట్ట, మెట్టు, గిట్టు...అదీ ఇదీ ఏముంది, ప్రియురాలి నుంచి శ్రామికురాలి వరకు, పొలం నుంచి పరిశ్రమ వరకు, అడవి నుంచి కార్ఖానా వరకు, పల్లె నుంచి పట్నం వరకూ పుంఖానుపుంఖాలుగా కథలు పుట్టుకొచ్చాయి.

ప్రకృతిలో తనకు అర్థంకాని ప్రతి విషయాన్ని గురించి మానవుడి మస్తిష్కంలో చెలరేగిన రకరకాల ఊహలకు ఊపిరి పోసిందే... కథ. 'కథంటే మరేమీ కాదు...జీవిత శకలాలను పరిచయం చేయడమే' అంటాడో భాష్యకారుడు. 'జీవితం తలుపు తెరిచి, ఒకసారి తొంగి చూడటమే...కథ' అంటాడు మరో ప్రసిద్ధ రచయిత. సాహిత్య ప్రపంచంలో మారుతున్న కాలానికనుగుణంగా అనేక ప్రక్రియలు చోటుచేసుకున్నాయి. వీటిలో ముఖ్యమైనది చిన్న కథ. కొద్ది పదాల్లోనే జీవితాన్ని, సమాజాన్ని, మనసును పట్టి చూపగల శక్తి ఈ చిన్న కథ ప్రత్యేకత. కథను సామాజిక చైతన్యానికి సాధనంగా చూశారు గురజాడ. ఆయన కథల్లో కల్పన కన్నా జీవన వాస్తవికతకే ప్రాధాన్యత ఎక్కువ. చలం చిన్న కథను 'వ్యక్తిగత స్వేచ్ఛ, మానసిక సంఘర్షణల వ్యక్తీకరణ'గా చూశాడు. ఈయన దృష్టిలో చిన్న కథ అంటే... నిజాన్ని నిర్భయంగా చెప్పే సాధనం. అలాగే- 'చిన్నకథ సమాజానికి అద్దం. చిన్నకథలో కనిపించే మనిషి, మన చుట్టూ తిరిగే మనిషి' అన్నారు కొడవటిగంటి. ప్రపంచ సాహిత్యంలో చెఖోవ్, ఎడ్గర్ అలన్ పో, మొపాసా వంటి వారు చిన్న కథను సంపూర్ణ కళారూపంగా అభివర్ణించారు. 'జీవితం వున్నత కాలం కథలు వుంటాయి' అంటారు గాబ్రియేల్ మార్క్వెజ్. ముఖ్యంగా ఆధునిక కాలంలో 'సమయం కొరత' వున్న పాఠకులకు చిన్నకథ మరింత దగ్గరైంది. డిజిటల్ మీడియా రావడంతో చిన్న కథ కొత్త పాఠకులకు చేరువైంది. యువత పుస్తకాలు చదివే అలవాటుకు దూరమౌతున్న తరుణంలో చిన్న కథలకు ప్రాధాన్యత పెరుగుతోంది.

దేవుళ్లు, రుషులు, రాజులు...వాళ్ల మహిమలు, వైభవాలను కీర్తించడం ఆధునిక కథ లక్ష్యం కాదు. మానవుని విజ్ఞానం, సాహసం, సాఫల్య వైఫల్యాలు, మానవ సంబంధాలు, సామాజికోద్యమాలు నేటి కథానిక వైశిష్ట్యానికి ప్రతీకలుగా వుండాలి. ఈ దృష్ట్యానే జాతీయ చిన్నకథల దినోత్సవాన్ని ప్రతి యేడాది డిసెంబర్ 21న జరుపుకుంటారు. శీతాకాలంలో అతి చిన్నరోజుగా పిలువబడే ఈ రోజునే చిన్నకథల దినోత్సవాన్ని జరుపుకోవడం, చిన్న రోజులో పెద్ద మలుపు. ఈ రోజున కథలు చదవడానికి, చదివించడానికి, రాయడానికి ప్రయత్నించాలి. ఈ ప్రయత్నం చిన్న కథ భవిష్యత్తుపై ఒక నమ్మకాన్ని కలిగిస్తుంది. 'కథ చెబుతాను ఊ కొడతావా', 'కథ చదువుతాను విందువుగాని రా' అంటూ పిల్లలను ప్రోత్సహించాలి. పిల్లలకు కథ చెప్పడం, చదివించడం ద్వారా వారిలో పఠనాసక్తి పెరుగుతుంది. ఊహాశక్తి విస్తృతమౌవుతుంది. సృజనాత్మకతను పెంచుతుంది. టీవీ, మొబైల్స్ వంటి డిజిటల్ మాధ్యమాల నుంచి పిల్లల దృష్టి మళ్లించి, పుస్తకాల పట్ల ప్రేమను, ఆసక్తిని పెంపొందించడానికి చిన్నకథలు దోహదపడతాయి. సమాజంలో అసమానతలు, ప్రశ్నించే తత్వం వున్నంత వరకు, మనుషుల మధ్య సంఘర్షణలు వున్నంత వరకు చిన్న కథ చిరాయువు.

మంచి మాట



ఆలోచనలు తుపాకులు కంటే శక్తిమంతమైనవి.
శత్రువులు మన దగ్గర తుపాకులను వుండనివ్వరు.

- జోసెఫ్ స్టాలిన్

అంతా సంఘ్ మయం...ఆ పరిణామాల పాఠం..


ఈ వారం జరిగిన రెండు పరిణామాలు దేశ రాజకీయాలు ఎంత ఏకపక్షంగా నడుస్తున్నాయో వెల్లడిస్తున్నాయి. ఈ రెండింటికి ప్రత్యక్ష సంబంధం లేదు. వీటిలో ఒకటి రాజకీయంగా బిజెపి అంతర్గత వ్యవహారం కూడా. మరొకటి నేరుగా బయటికి కనిపించని రాజకీయం. వీటిలో ఉమ్మడి అంశం మాత్రం ఒకటే. రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ అనే ఆర్‌ఎస్‌ఎస్ పట్టు ఎంత బలంగా ఉందో అదే సమయంలో రాజకీయ అధికారాన్ని కాపాడుకోవడానికి వ్యూహాత్మకమైన పట్టువిడుపులు కూడా ఎలా ప్రదర్శిస్తుందో ఈ పరిణామాలు చెబుతున్నాయి.





2019లో మోడీ రెండోసారి గెలిచాక అమిత్ షాను హోంమంత్రి చేశారు. మోడీ-షా ల ద్వయం సర్వం శాసిస్తుందని దేశమంతటికీ తెలుసు. అయితే వారు కూడా సంఘపరివార్ ఆదేశాలకు లోబడి మెలగాల్సిందే. సంఘ్ పెద్దలు రకరకాలుగా మాట్లాడుతుంటారు కానీ అంతిమంగా ఆర్‌ఎస్‌ఎస్ కు కావాల్సింది దేశాధిపత్యం, అన్ని రంగాలను శాసించటం మాత్రమే. మతతత్వ భజనతోపాటు విశృంఖలమైన కార్పొరేట్ ప్రైవేటీకరణ దోపిడీని సాగిస్తుంటారు. కనుక విధాన నిర్ణయాలైనా, వ్యక్తుల ఎంపికైనా వీటి విధేయులకే లోబడి జరుగుతుంటాయి. అంతర్గత కలహాలు, వ్యక్తిగత తగాదాలు ఆ పరిధిలోనే సర్దుకుంటూ ఉంటారు.

బిజెపి అధ్యక్షుడు జగత్ ప్రకాష్ నడ్డా పదవీకాలం ముగిసి 13 మాసాలు కావస్తోంది. ఎవరైనా సరే రెండు పర్యాయాలు మొత్తం ఆరేళ్ల కొనసాగవచ్చునని వారి నిబంధనావళి చెబుతుంది. అయినప్పటికీ ఎన్నికల పోరాటం కారణంగా చెబుతూ ఆయనను కొనసాగించారు. నడ్డా స్థానంలో మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రిగా నాలుగు పర్యాయాలు చేసిన శివరాజ్ సింగ్ చౌహాన్, కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్, ఇంకా అనేక పేర్లు వినిపించాయి. మోడీ ప్రధానమంత్రి అయ్యాక అమిత్‌షా ను అధ్యక్షునిగా ఎంపిక చేశారు. అప్పటికి ఆ పదవి చేపట్టిన వారిలో ఆయనే చిన్నవారు. మధ్యలో నడ్డాను కార్యనిర్వాహక అధ్యక్షుడిగా తీసుకొచ్చారు. 2019లో మోడీ రెండోసారి గెలిచాక అమిత్ షాను హోంమంత్రి చేశారు. మోడీ-షా ల ద్వయం సర్వం శాసిస్తుందని దేశమంతటికీ తెలుసు. అయితే వారు కూడా సంఘపరివార్ ఆదేశాలకు లోబడి మెలగాల్సిందే. సంఘ్ పెద్దలు రకరకాలుగా మాట్లాడుతుంటారు కానీ అంతిమంగా ఆర్‌ఎస్‌ఎస్ కు కావాల్సింది దేశాధిపత్యం, అన్ని రంగాలను శాసించటం మాత్రమే. మతతత్వ భజనతోపాటు విశృంఖలమైన కార్పొరేట్ ప్రైవేటీకరణ దోపిడీని సాగిస్తుంటారు. కనుక విధాన నిర్ణయాలైనా, వ్యక్తుల ఎంపికైనా వీటి విధేయులకే లోబడి జరుగుతుంటాయి. అంతర్గత కలహాలు, వ్యక్తిగత తగాదాలు ఆ పరిధిలోనే సర్దుకుంటూ ఉంటారు.



తెలకపల్లి రవి

గతంలోనూ ఉదాహరణలు

మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయి, మాజీ ఉపప్రధాని లాల్‌కృష్ణ అద్వానీల హయాంలోనే విభేదాలు చాలా ఉన్నాయి. మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు వాజపేయిని వికాస్ పురుష్ అని, అద్వానీని లోహపురుష్ అని పొగిడినప్పుడు ఆయన అలగడం కలకలం రేపింది. వాజ్‌పేయిని రాష్ట్రపతిని చేసి, అద్వానీని ప్రధానిగా కూర్చోబెట్టేందుకు పరివార్ ప్రయత్నించిందని ఆయన సలహాదారుడుగా పనిచేసిన అశోక్‌కుమార్ ఇటీవలే తన జ్ఞాపకాల్లో రాశారు. అందుకు ఆయన ఒప్పుకోలేదట. అప్పటి ఎన్డీఏ మనుగడకు వాజ్‌పేయి విగ్రహం అవసరం కనుక ఆర్‌ఎస్‌ఎస్ పట్టు పట్టలేదు. ఆయనను తమ ముసుగు అని వ్యాఖ్యానించింది కూడా. వీరిద్దరికీ మధ్య మురళీ మనోహర్ జోషి, వెంకయ్య నాయుడు, రాజనాథ్ సింగ్, నితిన్ గడ్కరీ, బంగారు లక్ష్మణ్, జానా కృష్ణమూర్తి వంటి తలలు మారిపోయాయి కానీ వారి పట్టు తగ్గలేదు. నరేంద్ర మోడీ గుజరాత్ ముఖ్యమంత్రి కాకముందే ఆర్‌ఎస్‌ఎస్ ప్రచారక్‌గా పనిచేశారు. కార్పొరేట్ ఇండియా తరపున రిలయన్స్ అంబానీలు నేరుగా గుజరాత్ గడ్డ మీదనే ఆయనను ప్రతిపాదించారు. ఎప్పుడూ ఏ ప్రధాని అభ్యర్థికీ జరగని స్థాయిలో మోడీని త్రీడీలో చూపించటం కార్పొరేట్ మద్దతు వల్లనే సాధ్యమైంది. అంతర్జాతీయంగా అమెరికా కూటమి కూడా ఈ పని చేయడం గమనించదగింది. బిజెపి నిర్ణయాలను, దాని నాయకత్వంలోని కేంద్రం విధానాలను అర్థం చేసుకోవాలంటే ఈ రెండు ప్రాథమిక వాస్తవాలు గమనంలో ఉంచుకోవాలి.

ప్రధానమంత్రి నరేంద్ర మోడీకి, ఆర్‌ఎస్‌ఎస్ అధినేత మోహన్ భగవత్‌కు మధ్యలో వ్యక్తిగత విభేదాలు వచ్చాయని, 75 ఏళ్లు దాటిన తర్వాత దిగిపోవడం గురించి మోహన్ భగవత్ బహిరంగంగానే చేసిన వ్యాఖ్యానాలు నిరూపించాయి. అనూహ్యమైన వ్యక్తిని అధ్యక్ష పదవికి ఎంపిక చేసినా ఎవరూ ఆశ్చర్యపోనవసరం లేదని ఆర్‌ఎస్‌ఎస్ ముందే సిద్ధం చేసినట్లు ఢిల్లీ వర్గాలు చెబుతూ వచ్చాయి. ఇప్పుడు అక్షరాలా అదే జరిగింది. కొత్త కార్యనిర్వాహక అధ్యక్షుడిగా బీహార్‌కు చెందిన ఐదు దఫాల శాసనసభ్యుడు, అదే సమయంలో 45 ఏళ్ల పిన్న వయస్కుడు నితిన్ నవీన్ నియమితు లయ్యారు. ఈయన తండ్రి నవీన్ కిషోర్ ప్రసాద్ సిన్హా కూడా చాలా పర్యాయాలు శాసనస భ్యుడిగా పని చేసిన వ్యక్తి కావడం గమనించదగింది. ఆ విధంగా వారి కుటుంబం సంఘపరివార్‌కు అత్యంత విధేయంగా ఉంటుంది. కనుక సంఘ్ పరివార్‌లో ఎవరూ దీనికి ఆశ్చర్యపోవడం లేదు కానీ బయట ప్రపంచానికి అలాంటి భావం కలిగించేందుకు చాలా ప్రయత్నం జరిగింది. కానీ ఆంతరంగిక వర్గాలు మటుకు మోడీ షాలకు ఎదురు లేకుండా ఉండేందుకే నవీన్‌ను ఎంపిక చేశారని బాహాటంగానే చెబుతున్నారు. ఆయన నియామకం కూడా పార్టీ కార్యదర్శి ఒకరు సాదాసీదాగా ప్రకటించారు. ఆ వెంటనే మోడీ ట్విట్టర్లో తనను అభినందిస్తూ ప్రకటనలు చేశారు. బాధ్యతల స్వీకారం కోసం ఢిల్లీ వచ్చిన నవీన్‌ను నడ్డా, అమిత్ షాలు స్వాగతించారు. ఈ సందర్భంగా నడ్డా మాట్లాడుతూ యువకుడైన నవీన్ ప్రధానమంత్రి మోడీ మార్గదర్శకత్వంలో పని చేస్తూ ఆయన విధానాలను ప్రజలకు చేరువ చేస్తారని ప్రశంసించారు.

కుల సమీకరణలు కూడా...

హిందుత్వ జపం చేస్తున్నప్పటికీ బిజెపి కుల సమీకరణాలు కూడా తప్పక పాటిస్తుంది. కాయస్థ నేపథ్యం కలిగిన నవీన్ ఎంపిక బెంగాల్ శాసనసభ ఎన్నికల్లో ఉపయోగకరమని కూడా లెక్కలు వేస్తున్నట్టు సీనియర్ నాయకులు తెలియజేశారు. ఏప్రిల్ నాటికి నడ్డా పదవీకాలం ముగిస్తే నవీన్ పూర్తిస్థాయి అధ్యక్షుడు అవుతారు. మొదట అమిత్ షా తర్వాత ఇప్పుడు నవీన్ అధ్యక్షులు కావడం సంఘ్ కొత్త వ్యూహాన్ని సూచిస్తున్నది. ఇటీవల మధ్యప్రదేశ్, రాజస్థాన్, హర్యానా వంటి అన్ని చోట్ల బాగా చిన్నవారిని, కొత్తవారిని మాత్రమే ముఖ్యమంత్రులు చేశారు. 2029లో కూడా మోడీనే ప్రధానిగా ఉంటారని మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ వంటి వారు చెబుతున్నారు. ఆ ఎన్నికల్లో మోడీ నాయకత్వం వహించి తర్వాత అమిత్ షా వస్తారని మరో అంచనా. షా కు ఇబ్బంది లేకుండానే నవీన్ ఎంపిక జరిగిందని చెబుతున్నారు. సరిగ్గా ఈ సమయంలోనే ఉత్తరప్రదేశ్ బిజెపి అధ్యక్షుడిగా పంకజ్ చౌదరిని నియమించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి, ప్రధాని స్థానానికి ఒక పోటీదారు అయిన యోగి ఆదిత్యనాథ్‌ను తగ్గించడంలో ఇది ఒక వ్యూహమని కొన్ని కథనాలు ఉన్నాయి. 2023లో పంకజ్ సహాయ మంత్రిగా ఉన్నప్పుడే ప్రధాని హోదాలో మోడీ వారి ఇంటికి వెళ్లడం ద్వారా తన సంకేతాలు ఇచ్చారు. 2024 లోక్‌సభ ఎన్నికల్లో యు.పి లో బిజెపి ఆశించిన ఫలితాలు సాధించలేకపోయింది. వచ్చే ఎన్నికల్లో యు.పి, బీహార్ కీలకం అవుతాయని తెలుసు కనుకనే రాష్ట్ర పార్టీల అధ్యక్షులు ఎవరన్నది నిర్ణయించడానికి చాలా కసరత్తు జరిగింది. బీహార్ బిజెపి అధ్యక్షుడిగా కూడా సంజయ్ సరోగి నియమితులవ్వడం ఇలాంటి పరిణామమే.

మిత్రపక్షాల వంత

విశేషమేమంటే వీరందరూ ఉన్నత వర్గాలకు చెందినవారు. హిందుత్వ రాజకీయాలను కాపాడుకోవాలంటే సంప్రదాయకంగా పైవర్గాలతో ఉన్న పట్టును, అనుబంధాన్ని నిలబెట్టుకోవాలని సంఘపరివార్ ఇప్పుడు భావిస్తున్నది. మోడీ బి.సి నేతగా ప్రచారం అందుకుంటున్నా కొత్త సోషల్ ఇంజనీరింగ్ చేస్తారని తొలుత చెప్పుకున్నారు. అయితే మొన్నటి ఎన్నికల్లో అది ఎదురుదెబ్బ తిన్న తర్వాత మళ్లీ మూలాలకు వెళ్లడం ఇక్కడ గమనించదగింది. సంఘ పరివార్‌ను సంతృప్తి పరచడానికి మోడీ నాగపూర్ పర్యటన దీన్నే ప్రతిబింబించింది. అయోధ్య రామమందిరంపై ధ్వజాన్ని ప్రతిష్టించే కార్యక్రమానికి కూడా భగవత్‌ను ఆహ్వానించారు. మోడీ స్వయంగా ఆర్‌ఎస్‌ఎస్ స్వయం సేవకుడని, తను కూడా అక్కడి నుంచే వచ్చానని అమిత్ షా పార్లమెంట్‌లో విధేయత చాటుకున్నారు. ఆర్‌ఎస్‌ఎస్ అయితే పదవులు తీసుకోరాదని ఎక్కడైనా ఆంక్షలు ఉన్నాయా అని ఎదురుదాడి చేశారు. మరో విశేషం ఏమంటే కొత్త నేతను బిజెపితో పాటు ఎన్డీఏ భాగస్వాములు కూడా వెనువెంటనే కలుసుకుంటున్నారు. ఎ.పి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఢిల్లీలో ఆయనను కలుసుకోవటమేకాక దేశ అభివృద్ధి కోసం మోడీని, బిజెపి ని బలపరుస్తామని ప్రకటించారు. మరో పదిహేనేళ్ల పాటు ఈ కూటమి కొనసాగుతుందని అటు పవన్, ఇటు చంద్రబాబు, లోకేష్ ప్రతిసారీ ప్రకటిస్తున్నారు. ప్రస్తుత పాలక వ్యవస్థ మొత్తం ఏ విధంగా ఆర్‌ఎస్‌ఎస్ వలయంలో చిక్కుకున్నదీ దీన్నిబట్టి తేలిగ్గా అర్థమవుతుంది. పవన్ కల్యాణ్ వంటి వారు నిరంతరం సనాతన జపం చేయడంలోనూ ఇదే గోచరిస్తుంది. బీహార్ ముఖ్యమంత్రి నితీష్ కుమార్ నియామక ఉత్తర్వుల కోసం వచ్చిన ఒక ముస్లిం యువతి ముఖంపై బురఖా లాగడం కూడా ఇలాంటిదే. ఆయన క్షమాపణలు చెప్పాలని ప్రజాస్వామ్యవాదులు కోరుతుంటే...ఆయనేమీ తప్పు చేయలేదని, కావాలంటే ఉద్యోగం మానేయవచ్చునని కేంద్రమంత్రి గిరిరాజ్ సింగ్ బెదిరిస్తున్నారు!

అవార్డులకు అవమానం

రెండవ పరిణామానికి వస్తే కేంద్ర సాహిత్య అకాడమీ 2025 సంవత్సరానికి గాను అవార్డులు ప్రకటించడానికి మీడియాను ఆహ్వానించి వెనక్కు తగ్గింది. కేంద్ర సాంస్కృతిక మంత్రిత్వ శాఖ బహిరంగంగానే అడ్డుపడింది. సాహిత్య, సంగీత, లలిత, కళ అకాడమీలు, నేషనల్ స్కూల్ ఆఫ్ డ్రామాలు తమ శాఖతో ఒప్పందం కుదుర్చుకున్నాయని మొత్తం పునర్వ్యవస్థీకరణ జరిగే వరకు అవార్డులు ప్రకటించరాదని వెల్లడించింది. ఆ వెంటనే అకాడమీ మీడియా సమావేశం కూడా రద్దు చేసుకుంది. అంతర్గతంగా చర్చించుకోవచ్చు. లేదంటే మరేదైనా చెప్పి మీడియా గోష్టి ముగించవచ్చు. కానీ ఈ సందర్భంలో బుద్ధిజీవులు సృజనశీలులు అయిన రచయితలు, కవులకు రాజకీయ సంకేతం అందాలని కేంద్రం వ్యూహం. గతంలో మతోన్మాదులు కొన్ని హత్యలు, దాడులకు పాల్పడిన తర్వాత అనేకమంది అవార్డు గ్రహీతలు వెనక్కు ఇచ్చేశారు. దాన్ని అవార్డు వాపసి అన్నారు. అలా చేయడం ఆ పురస్కారాలను అవమానించడమేనని అప్పట్లో కేంద్రం, బిజెపి దాడి చేశాయి. కానీ ఇప్పుడు తామే బహిరంగంగా అకాడమీలను అవమానించాయి. ఇంత బాహాటంగా కేంద్రం పెత్తనానికి అకాడమీలు లోబడి పోవడం గతంలో ఎప్పుడూ జరగలేదు. రాజకీయ ఆధిపత్యంతో పాటు సాంస్కృతిక పరంగా ఆధిపత్యం, మత ఛాందసం రుద్దడానికి బరితెగించి చేసిన దాడి ఇది. అందుకే ఆలోచనాపరులు ఈ పరిణామాల పట్ల అప్రమత్తత వహించాల్సి ఉంటుంది. వీటి వెనక ఉన్న నిరంకుశత్వాన్ని నిరసించాల్సి ఉంటుంది. రాబోయే శాసనసభ ఎన్నికల కోసం ఆర్‌ఎస్‌ఎస్, బిజెపిలు మరెన్ని విపరీతాలకు పాల్పడతాయో, వాటిపై స్వారీ చేస్తున్న కార్పొరేట్ వ్యక్తులు మరెంత పట్టు బిగిస్తాయో ఊహించుకోవాల్సిందే.

★

వారిపై సంపద పన్ను, వారసత్వ పన్ను

మన దేశంలో ఆర్థిక సంస్కరణలు ప్రవేశ పెట్టిన సమయంలో, నష్టాల పాలైన ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేట్ సంస్థలకు అప్పగించ టంతో మొదలైంది 'ప్రైవేటు' ప్రయాణం. క్రమంగా నేడు లాభాలార్జించే సంస్థలను సైతం ఆశ్రిత కార్పొరేట్ సంస్థలకి అన్ని రాయితీలను నామమాత్రపు ధరలకే అప్పగిస్తున్నారు. దాంతో వారు ప్రభుత్వ, ప్రకృతి సంపదలను అతి చౌకగా దక్కించుకుంటూ, అయాచితంగా భారీ లాభాలు పొందుతున్నారు. ఈ సంస్కరణల ఫలాలు మాత్రం సామాన్య ప్రజానీకానికి దక్కటం లేదు. ఫలితంగా సమాజంలో ఆర్థిక అసమానతలు విపరీతంగా పెరిగి పోతున్నాయి. కనుక అయాచితంగా కుప్పలుతెప్పలుగా వచ్చి పడుతున్న ఆ ధన ప్రవాహంపై తక్షణమే సోషలిస్టు దేశాల్లోనేగాక అమెరికా, బ్రిటన్ వంటి దేశాల్లో కూడా మిలియనీర్లు, బిలియనీర్లపై సంపద, వారసత్వ పన్నులను విధిస్తున్నారు. ఈ విధంగా మన దేశంలో కూడ విధించాలి. పైగా సామాన్య ప్రజానీకంపై చీటికి మాటికి విధిస్తున్న పన్నుల భారం తగ్గించాలి. విండ్ ఫాల్ టాక్స్ వంటి ఈ సంపద, వారసత్వ పన్నుల విధింపుతో దేశంలో అవినీతి, అక్రమ సంపద, సామాజిక ఆర్థిక అసమానతలు తగ్గుతాయి. కొందరు మేధావులు ఆ పన్నులు మన దేశంలో కూడా విధిస్తే పారిశ్రామికవేత్తలు మన దేశం వీడిపోతారని భయపెట్టడానికి చూస్తున్నారు. వాస్తవానికి, ఈ పారిశ్రామికవేత్తలు మన ప్రభుత్వాల నుండి ఎన్నో రాయితీలు పొందుతున్నారు, ఎక్కడికీ వెళ్ళరు. అభివృద్ధి చెందిన పాశ్చాత్య దేశాల్లో సంపన్నులపై మన దేశంలో కంటే ఇంకా ఎక్కువ పన్నులే వసూలు చేస్తారు. అయినా కొద్దిమంది దేశం వదిలిపోతే మన దేశానికి వచ్చేనష్టం లేదు. ఇంకా మన స్వదేశీ సంస్థలు బాగా వృద్ధి చెందుతాయి!

- తిరుమలశెట్టి సాంబశివరావు, గుంటూరు.

వేలంపాట కూలీలు!

- 'నల్లి' కుట్టు

"ఒకప్పుడు ఏడాదికింత ధాన్యం.. రెండు పూటల తిండి.. పండుగలకో, పబ్బాలకో కొత్త బట్టలు..వరి కోతలప్పుడు మోసుకున్నంత మోపు.. ఇలాగుండేది. పాలేర్ల కష్టానికి తగినట్టు సూసుకునే ఇధానం."

లంక పొగాకు చుట్టని బాగా లాగిపెట్టి పీల్చి, గుండెల్లోకి కొంత పొగ పంపించి.. కొంత బయటకు ఊదాడు దశమంతు నాయుడు. అది, పాత సినిమా ఫ్లాష్ బ్యాక్ వంపుల్లాగా.. రౌండ్లు కొడుతూ గాలిలో తేలిపోతోంది.

పడకుర్చీలో నడుం చేరవేసిన నాయుడుకి ఒకనాటి వ్యవసాయం గుర్తుకొచ్చింది. 30 ఎకరాల పల్లం.. ముగ్గురు పాలేర్లు..ఎద్దులు, పోతులు, ఆవులు, గేదెలు, లేగ దూడలు..మేపడానికి ఒక గుంటడు..వీళ్లందరితో పని చేయించడానికి ఒక ముసలి పాలేరు!

"ఇప్పుడు పాలేర్లేటి బాబు! కూలోళ్ళు కూడా దొరకడం లేదు.. దుక్కికీ.. ఉడుపుకి.. కోతకీ.. నూర్పుకీ.. ఎగర బోతకీ మిషన్లొచ్చేసినాయి!' కాళ్లు నొక్కుతూ, నిర్వేదంతో అన్నాడు పరదేశి.

"తల్చుకుంటేనే నాకు గొప్ప హాశ్చర్యంగా ఉందిరా! మనిషి కన్నా మిషను గొప్పదైపోయింది. సెమట కన్నా ఆయిలు ఇలువైనదయిపోయింది. బురదా, బుగ్గి తెలియనోళు ,, ఎక్కడో కూకోని ఎవసాయం సేయించేస్తున్నారు."

చుట్ట పొగతో పాటు బరువైన ఊపిరిని కూడా విడిచి పెట్టాడు నాయుడు.

"కాలానికి తగినట్టు మనమూ మారాలా!..తప్పదు బాబు.. మీరు కూడా సుట్ట మానేస్తే మంచిది."


పరదేశి హితవు చెప్పాడనుకున్నాడు నాయుడు. వంగి కూర్చున్న వాడు ఒక్కసారి ఆశ్చర్యంతో ముందుకు లేచి

"అలవాటుని ఒక్కసారి ఎలాగా ఒదిలేయగలంరా?" అన్నాడు.

"ఎందుకొదిలెయ్యాల! కాలంతో పాటు మారాలి అన్నానంతే! ప్రభుత్వ సారాను బేను సేసిస్తే, బ్రాందీ, ఇస్కీ తాగడం మొదలెట్టాం కదా! ఇది అలాగే!"

"ఏటి! ఈ ఒయసులో సుట్టని ఒదిలీసి, సిగరెట్లు తాగమంతా వేటి?" చిరాకుపడ్డాడు నాయుడు.

"అలాగ కాదు.. హుక్కా అనేది ఒకటుందట! పూర్వం నవాబులు తాగేవారట.. ఈ మధ్యన గంజాయి కూడా పొట్లాలు, సాక్లెట్లు రూపంలో దొరుకుతుందట!"



పరదేశి చేతుల్లో నుంచి కాలు విదిలించి-

"నీకేటి మైండు దొబ్బిందా? మనం నవాబులం కాదు హుక్కా తాగడానికి! సాధులూ, సన్నాసులం కాదు గంజాయి తాగడానికి! ఎదవా!!"

సగం కాలిన చుట్టని, నేలకేసి కొట్టి, కాండ్రించి ఉమ్మాడు నాయుడు. కోపాన్ని తమాయించుకుని, కుర్చీలో మళ్లీ వెనక్కి చేరబడి.

"ఎవసాయమే బెటరు..పల్లెటూరు బతుకే బెటరు గానీ, కంపెనీ ఓల్లతో పోటీ పడలేకపోతున్నాం" -నిట్టూర్చాడు నాయుడు.

"మరి, అలాంటోళ్లు ఎక్కడ దొరుకుతారు?"
"ఎందుకు దొరకరు!? కిరికెట్టు ఆట కంపినీలకి, ప్రెపంచమంతా దొరుకుతున్నారు...ఏలం పాటలో! ఎవుడు మనకు పనికొత్తాడని మన మనుసుకు అనుకుంటే.. పది రూపాయలు ఎక్కువ ఇచ్చీసి, కొనీడమే!"
"అంతేనంటావా!" "అంతే! మా తాత జమీందారూ.. మా తండ్రి భూస్వామీ.. అనుకుంటే కుదరదు..ఎవసాయం..ఏపారమైపోవాలా! ఏలం పాటలో పరిమినెంటు పనోళ్ళు ఉండకూడదు.. ఏడాదికి ఏడాది పనిసెయ్యడానికి కొనుక్కున్నట్టు ఉండాలా!"
"నాకన్నా తెలివైనోడివిరా.. పరదేశీ!" ఆనందంగా వెనక్కి చేరబడి కళ్లుమూసుకున్నాడు నాయుడు.
వేలం పాటలో కొనుకున్నోళ్లంతా, పొలంలో గొప్ప కష్టపడి, పనులు చేస్తున్న దృశ్యం దశమంతు నాయుడి ఊహల్లో కదిలింది.

"మరి ఎలాగా! మిషన్లకైనా డ్రైవర్లు, క్లీనర్లు, పనోళ్లు ఉండాలి కదా! కంపెనీలు ఇచ్చినంత జీతాలు మనం ఇవ్వగలమేటి!?" అలిగినట్టు మాట్లాడాడు పరదేశి.

"మరేటి సేద్దాం రా!" అలకను గ్రహించాడు నాయుడు.

"మనమూ ఒక కంపినీ రిజిస్ట్రు సేసిద్దాము.. మన పనులు బాగా సేసి, దిగుబడులు సాధించి, లాభాలు వచ్చే విధంగా కష్టపడినోళ్లని పనోళ్ళుగా పెట్టుకుందాం"

మంచి సలహా అనిపించింది నాయుడికి.

"మరి, అలాంటోళ్లు ఎక్కడ దొరుకుతారు?"

"ఎందుకు దొరకరు!? కిరికెట్టు ఆట కంపినీలకి, ప్రెపంచమంతా దొరుకుతున్నారు...ఏలం పాటలో! ఎవుడు మనకు పనికొత్తాడని మన మనుసుకు అనుకుంటే.. పది రూపాయలు ఎక్కువ ఇచ్చీసి, కొనీడమే!"

"అంతేనంటావా!"

"అంతే! మా తాత జమీందారూ.. మా తండ్రి భూస్వామీ.. అనుకుంటే కుదరదు.. ఎవసాయం.. ఏపారమైపోవాలా! ఏలం పాటలో పరిమినెంటు పనోళ్ళు ఉండకూడదు.. ఏడాదికి ఏడాది పనిసెయ్యడానికి కొనుక్కున్నట్టు ఉండాలా!"

"నాకన్నా తెలివైనోడివిరా.. పరదేశీ!" ఆనందంగా వెనక్కి చేరబడి కళ్లుమూసుకున్నాడు నాయుడు.

వేలం పాటలో కొనుకున్నోళ్లంతా, పొలంలో గొప్ప కష్టపడి, పనులు చేస్తున్న దృశ్యం దశమంతు నాయుడి ఊహల్లో కదిలింది.

కా॥ పెంచలయ్య స్మృతి గీతం

పల్లవి: లక్ష్యం ముందు ప్రాణం-ఎప్పుడూ చిన్నదే
మనుషుల కోసం కలబడితే-లక్ష్యం ఎపుడు పెద్దదే
పెంచలయ్య చనిపోయాడంటే
కాలం కన్నీరెట్టింది
చిర్రా చిటిక దోస్తేడంటూ
డప్పుతో మారాం చేశాయి.
అనుపల్లవి: ప్రజల తోటి చెలగాటమాడితే
మూగబోదు మా గొంతు
పెంచలయ్య సందేశంతో
అందుకుంటాము మా వంతు "ప్రజల తోటి"
చరణం 1: ఊహ తెలిసిన నాటి నుండి-నడిచాడు ప్రజల బాట
అందుకోసమే ఎంచుకున్నాడు-కళాకారుడై ఆటపాట
జనం మధ్యకే ప్రయాణము
నగరవీధులే రంగస్థలము
ప్రజల కష్టాలు-కళారూపము
చైతన్యమే-వాటి సారము "ప్రజల తోటి"
చరణం 2: చెడు వ్యసనాలకు బలియైపోతే-యువతకు బతుకే లేదంటూ
గంజాయిని తరిమేయాలంటూ-రణం చేశాడు సై యంటూ
మాఫియా దండు పగబట్టింది
ప్రాణం తీయగ-తెగబడింది.
మాటు కాసింది-వేటు వేసింది
మనిషిని మింగితే-గెలుపనుకుంది "ప్రజల తోటి"
చరణం 3: సింహపురి చైతన్యాన్ని-ఆపలేదుగా ఏ హత్యలు
అంతకు అంతై వర్ధిల్లాయి-తిరుగుబాటుగా ప్రజా పోరులు
ఏ పోరైనా తొలి నెల్లూరు
ఆ తరువాతే ప్రతి ఊరు
దడవని గుండె దాని పేరు
దెబ్బకు దెబ్బ తయ్యారు "ప్రజల తోటి"
చరణం 4. పుట్టుక చావు మనకేం ఎరుక-సాగాలింక తడబడక
ప్రజల కోసమే బ్రతకాలంటూ-సమరంలోకి దూకాక
ఏదైనా సరే-ఎప్పుడైనా సరే
పోరుకు మనము-బరాబరే
మడమ తిప్పము-వెన్ను చూపము
దేనికైనా-సరికి సరే "ప్రజల తోటి"

- దేవేంద్ర

మీ వ్యాసాలను పంపాల్సిన మెయిల్ : editpageps @ gmail.com

చిరుత సంచారంపై అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి- సీలేరు (అల్లూరి జిల్లా)

చిరుత పులి సంచారంపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జికె వీధి మండలం ఆర్వీ నగర్ అటవీ రేంజ్ సప్పర్ల బీట్ ఆఫీసర్ రాజకుమార్ సిబ్బంది విస్తృతంగా శనివారం ప్రచారం చేశారు. మూడు రోజుల క్రితం సప్పర్ల రెయిన్ గేజ్ సమీపంలో చిరుత పులి సంచరించింది. ఈ క్రమంలోనే సప్పర్ల బీట్ ఆఫీసర్ రాజకుమార్ బేస్ క్యాంప్ సిబ్బంది సప్పర్ల ఘాట్ రోడ్డు పరిధిలో ఐదు కిలోమీటర్ల మేర చిరుత ఆహారం కోసం శనివారం ఉదయం నుంచి గస్తీ ముమ్మరం చేశారు. అయినా, దీని జాడ కనిపించలేదు. అనంతరం గాలికొండ పంచాయతి పరిధి నిమ్మలగొంది, పనసల బంద, నుతిబంద, సప్పర్ల ఎరికొన్ని గ్రామాలతోపాటు వారపు సంతలో ప్రజలను అప్రమత్తం చేశారు. చిరుతను గుర్తించినట్లయితే వెంటనే అటవీ శాఖ సిబ్బందికి సమాచారం అందజేయాలని ఆయన కోరారు.

మియామిలో ఉక్రెయిన్ శాంతి చర్చలు

- యుద్ధ విరమణకు సంకేతాలిచ్చిన పుతిన్



మియామి : రష్యా, అమెరికా అధికారులు ఉక్రెయిన్ శాంతి చర్చలు మరో రౌండ్ చర్చల కోసం మియామిలో శనివారం సమావేశం కానున్నారు. ఈ నేపధ్యంలో రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ కీలక వ్యాఖ్యలు చేశారు. పశ్చిమ దేశాలు మాస్కోను గౌరవంగా చూసుకుంటే ఉక్రెయిన్ తరువాత యుద్ధాలుండవని ప్రకటించారు. శనివారం జరిగే మియామి చర్చల్లో రష్యా సావరిన్ వెల్త్ ఫండ్ అధిపతి కిరిల్ డిమిత్రివ్ , అమెరికా రాయబారి స్టీవ్ విట్‌కోఫ్, ట్రంప్ అల్లుడు జారెడ్ కుష్నర్‌లు సమావేశం కానున్నారని సమాచారం. అయితే బెర్లిన్‌లో జరిగిన శాంతి చర్చల తర్వాత ఈ సమావేశం జరుగుతుంది. ఇందులో ఉక్రెయిన్‌కు భద్రతా హామీలు, ప్రాదేశిక రాయితీలు, అమెరికా ప్రతిపాదిత ప్రణాళికలోని ఇతర అంశాలను చర్చించనున్నారు. మరోవైపు రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ ఉక్రెయిన్ డిమాండ్లపై స్థిరంగా ఉన్నట్లు సంకేతాలు ఇచ్చారు. పశ్చిమ దేశాలు రష్యాను గౌరవంగా చూసుకుంటే, ఉక్రెయిన్ తర్వాత ఇక యుద్ధాలు ఉండవని ప్రకటించారు. అయితే నాటో చీఫ్ మార్క్ రుట్టే ఇటీవల చేసిన వాదనలను "అర్థరహితం" అని ఆయన తోసిపుచ్చారు. ట్రంప్ శాంతి ప్రయత్నాలను పుతిన్ కూడా ప్రశంసించారు, వివాదానికి "మూల కారణాలను" పరిష్కరించే శాంతియుత పరిష్కారానికి మాస్కో సిద్ధంగా ఉందని పునరుద్ఘాటించారు. ఆగస్టులో ట్రంప్‌తో జరిగిన అలాస్కా శిఖరాగ్ర సమావేశం గురించి కూడా ఆయన ప్రస్తావించారు.అయితే ఐరోపా యూరోపియన్ యూనియన్ (ఇయు) 87 వేల కోట్ల రూపాయలను ఉక్రెయిన్‌కు వడ్డీలేని రుణంగా ఇవ్వడం, యుద్ధానికి సహాయం అందిస్తామనడం గమనార్హం.

గుడ్లు సురక్షితం...
అపోహలు వద్దు : ఎఫ్ఎస్ఎస్ఎఐ

న్యూఢిల్లీ : దేశంలో లభ్యమవుతున్న గుడ్లు సురక్షితమని ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఎఫ్ఎస్ఎస్ఎఐ) స్పష్టం చేసింది. గుడ్లు వినియోగిస్తే క్యాన్సర్ ముప్పు ఏర్పడుతుందంటూ సోషల్ మీడియాలో వస్తున్న పోస్టులపై ఎఫ్ఎస్ఎస్ఎఐ శనివారం స్పందించింది. అవన్నీ తప్పుదోవపట్టించే వార్తలని ఒక ప్రకటనలో పేర్కొంది. గుడ్లలో క్యాన్సర్ కారక పదార్థాలు ఉన్నాయని చెప్పేందుకు ఎలాంటి శాస్త్రీయ ఆధారాలు లేవని పేర్కొంది.

భారత్‌లో విక్రయించే గుడ్లలో నైట్రోఫ్యూరాన్ మెటబాలైట్స్‌ను గుర్తించినట్లు కొన్నిరోజులుగా సోషల్ మీడియాలో ప్రచారం జరుగుతోంది. 2011లో తీసుకొచ్చిన ఆహార భద్రత నిబంధనల ప్రకారం.. పౌల్ట్రీ, ఎగ్ ప్రొడక్షన్ జరిగే అన్ని దశల్లో నైట్రోఫ్యూరాన్ల వాడకాన్ని పూర్తిగా నిషేధించినట్లు ఎఫ్ఎస్ఎస్ఎఐ అధికారులు వెల్లడించారు. భారతదేశంలో నియంత్రణా ప్రమాణాలు అంతర్జాతీయ చట్టాలకు అనుగుణంగా ఉన్నాయని పేర్కొన్నారు.

క్రీడాకారులకు ప్రపంచ గుర్తింపు

- ఘనంగా రాష్ట్రస్థాయి షూటింగ్ బాల్ పోటీలు ప్రారంభం
- 17 జిల్లాల నుంచి 500 మంది క్రీడాకారులు హాజరు

ప్రజాశక్తి - కర్నూలు జిల్లాపరిషత్

ప్రతిభ చూపిన క్రీడాకారులకే ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపు ఉందని కర్నూలు నగర కార్పొరేటర్లు నారాయణరెడ్డి, దండు లక్ష్మీకాంత్ రెడ్డి, నాగలక్ష్మిరెడ్డి అన్నారు. కర్నూలు జిల్లా షూటింగ్ బాల్ సంఘం ఆధ్వర్యంలో శనివారం కర్నూలు అవుట్డోర్ స్టేడియం నందు 44వ రాష్ట్రస్థాయి సీనియర్ స్త్రీ, పురుషుల షూటింగ్ బాల్ పోటీలను రాష్ట్ర షూటింగ్ బాల్ సంఘం కార్యదర్శి జోసఫ్, కర్నూలు జిల్లా ఒలంపిక్స్ సంఘం సిఇఒ విజయ్ కుమార్, సెపక్తక్రా ఫెడరేషన్ ఆఫ్ ఇండియా అధ్యక్షులు శ్రీనివాసులు, జిల్లా ఒలంపిక్స్ సంఘం కార్యనిర్వాహక కార్యదర్శి సునీల్ కుమార్, కెవి సుబ్బారెడ్డి విద్యా సంస్థల అధినేత డాక్టర్ కెవి సుబ్బారెడ్డి, కెడిసిసి మాజీ డైరెక్టర్ రమణారెడ్డి, యువ నాయకుడు హనుమంతు రెడ్డి ముఖ్య అతిథిలుగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా నారాయణరెడ్డి మాట్లాడుతూ క్రీడాకారులు క్రమశిక్షణతో తమకు నచ్చిన క్రీడలో అంకితభావంతో సాధన చేస్తే మెరుగైన ఫలితాలు సాధిస్తారని అన్నారు. లక్ష్మీకాంత్‌రెడ్డి మాట్లాడుతూ క్రీడాకారులను ప్రోత్సహించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైన ఉందన్నారు. వివిధ పోటీల్లో పాల్గొనడం ద్వారా క్రీడాకారులలో స్నేహభావం పెంపొందింటుందన్నారు. క్రీడాకారులను తీర్చిదిద్దడం తోపాటు పతకాలు సాధించేందుకు వ్యాయామ ఉపాధ్యాయులు చేస్తున్న కృషి వెలకట్టలేనిది అన్నారు. రాష్ట్ర కార్యదర్శి జోసెఫ్ మాట్లాడుతూ 17 జిల్లాల నుంచి సుమారు 400 మంది క్రీడాకారులు పోటీలకు హాజరైనట్లు తెలిపారు.

రాష్ట్రస్థాయి షూటింగ్ బాల్ పోటీల్లో ఉత్తమ ప్రతిభను కనబరిచిన క్రీడాకారులు షూటింగ్ బాల్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో జనవరి మొదటి వారంలో మహారాష్ట్రలో జరగబోయే జాతీయ స్థాయి పోటీలకు ప్రాతినిధ్యం వహిస్తారన్నారు. అంతకుముందు అతిథులకు క్రీడాకారులు కవాతు నిర్వహించి గౌరవ వందనాన్ని సమర్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా షూటింగ్ బాల్ సంఘం కార్యదర్శి ఈశ్వర్ నాయుడు, రాష్ట్ర షూటింగ్ బాల్ సంఘం ప్రతినిధులు రత్నం, సురేంద్ర పాల్గొన్నారు.

సచివాలయం సమీపంలో మురుగునీటి గుంటలు

- స్పందించని అధికారులు, పాలకవర్గం

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

కర్నూలు నగరం నడిబొడ్డులో ఉన్న కృష్ణారెడ్డి నగర్ సచివాలయం సమీపంలో మురుగు నీరు నిలిచి చెరువులాగా తయారై దుర్వాసన, దోమల బెడదతో అనారోగ్యాలకు గురవుతున్నామని స్థానిక వాహన యజమానులు ఆవేదన వ్యక్తం చేశారు.

శనివారం పట్టణ పౌర సంక్షేమ సంఘం బృందం స్థానికులతో కలిసి ఆ ప్రాంతంలో పర్యటించింది. ఈ సందర్భంగా మెకానికల రంగం ప్రతినిధి ఎం.రత్నం, పి.కన్నా దేశాయ్,పట్టణ పౌర సంక్షేమ సంఘం నాయకులు ఎం.నాగరాజు, ఇరిగినేని.

పుల్లారెడ్డి, కాజాబాష, ఎ. రవీంద్ర వరకుమార్ మాట్లాడుతూ.. 50 ఏళ్లుగా లేని మురుగు నీటి గుంతలు ఇప్పుడే ఏర్పడ్డాయని స్థానికులు తెలిపారన్నారు. మురుగునీరు వెళ్లేందుకు దారితో పాటు రోడ్లు ఉన్నాయా? లేదా అనేటువంటి ఆలోచించకుండా అవగాహన లేకుండా భవన నిర్మాణాలకు అధికారులు అనుమతి ఇవ్వడం, బిల్డర్లు నామ్‌కె వస్తే అనే చందంగా మురుగు కాలువలు నిర్మించి చేతులు దులుపుకోవడంతో మురుగు నీటి చెరువు ఏర్పడిందని తెలిపారు. గ్రామీణ ప్రాంతం కంటే హీనంగా మురుగునీరు చేరి చెరువుల తయారై ప్రజలు నరకం అనుభవిస్తున్నా.. అధికారులు, పాలకవర్గం స్పందించడం లేదని విమర్శించారు. ఇంటి పన్నులు పెంచడంపై ఉన్న శ్రద్ధ ప్రజల సమస్యల పరిష్కారం పై అధికారులకు లేదని అన్నారు. ఉన్నతాధికారులు స్పందించి మురుగునీటి కాలువలు నిర్మించాలని కోరారు.

ఫ్యాషన్ టెక్నాలజీ కోర్సుల్లో అడ్మిషన్లు ప్రారంభం

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్

నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫ్యాషన్ టెక్నాలజీ సంస్థలో అడ్మిషన్లు ప్రారంభించినట్లు ఆ సంస్థ ప్రతినిధులు తెలిపారు. శనివారం విజెఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వారు మాట్లాడుతూ తమ సంస్థకు దేశ వ్యాప్తంగా 19 నెట్‌వర్క్ కేంద్రాలు ఉన్నాయని చెప్పారు. గ్రాడ్యుయేషన్, పోస్ట్ గ్రాడ్యుయేషన్, డాక్టోరల్ స్థాయి ప్రోగ్రాముల్లో వివిధ కోర్సులను అందిస్తున్నామని తెలిపారు. రానున్న విద్యా సంవత్సరానికి అడ్మిషన్లకు రిజిస్ట్రేషన్లు ప్రారంభించామని, జనవరి 6 వరకు అడ్మిషన్లు జరుగుతాయని చెప్పారు. రాతపరీక్ష ఫిబ్రవరి 8న ఉంటుందన్నారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలనుకునే వారు https://exams.nta.nic.in/niftee వెబ్‌సైట్ లేదా www.nift.ac.in వెబ్‌సైట్ ఫాలో కావాలని కోరారు.

లారీ బోల్తా

ప్రజాశక్తి- గాజువాక (విశాఖ జిల్లా)

షీలానగర్ గొడౌన్ నుండి గాజువాక ఆటో నగర్‌కు 150 టన్నులు బరువు ఉన్న కెమికల్ పౌడర్ బస్తాలను తీసుకెళ్తున్న ట్రయిలర్ లారీ ఆటో నగర్ జాతీయ రహదారి జంక్షన్ వద్ద యూటర్న్ చేస్తుండగా బోల్తా పడింది. ట్రయిలర్‌పై ఉన్న కెమికల్ పౌడర్ బస్తాలు రోడ్డు మీద పడిపోయాయి. దీంతో, ట్రాఫిక్‌కు అంతరాయం కలిగింది. గాజువాక ట్రాఫిక్ పోలీసులు ట్రాఫిక్‌ను మళ్లించారు.

బుక్కపట్నం చెరువుకు 'హంద్రీనీవా' నీరు

ప్రజాశక్తి-బుక్కపట్నం

బుక్కపట్నం చెరువులోకి హంద్రీనీవా కాలువ ద్వారా కొత్త నీరు చేరుతోందని, తద్వారా నీటి మట్టం పెరుగుతుందని, కావున చిన్నారులు, మహిళలు, ఈతరానివారు, ఎవరైనా అటువైపు వెళ్లకుండా అధికారులు జాగ్రత్తలు తీసుకోవాలని ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి సూచించారు. చెరువు మరువ పారుతున్న నీటిలో ఎవరూ దిగవద్దని ప్రజలకు సూచించారు. చెరువులో బోటింగ్ నడుస్తోందని, అక్కడ ఎవరూ చెరువులో దిగవద్దని ఇరిగేషన్, పంచాయతీ శాఖల ఆధ్వర్యంలో తక్షణం హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు.

మల్లన్న సన్నిధిలో ప్రధాన ఎన్నికల కమిషనర్ దంపతులు

ప్రజాశక్తి - శ్రీశైలం ప్రాజెక్ట్

శ్రీశైలం క్షేత్రంలోని భ్రమరాంబ మల్లికార్జున స్వామి అమ్మవార్లను భారత ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ దంపతులు శనివారం దర్శించుకున్నారు. తెల్లవారుజామున శ్రీశైల దేవాలయ ప్రాంగణంలోని గంగాధర మండపం వద్ద వేద పండితులు ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ దంపతులకు అర్చకులు సంప్రదాయబద్ధంగా స్వాగతం పలికారు. మొదటగా ధ్వజస్తంభానికి నమస్కరించి శివ సంకల్పం చేశారు. అనంతరం రత్నగర్భ గణపతికి పూజ చేశారు. ఆ తరువాత మల్లికార్జున స్వామి జ్యోతిర్లింగానికి విశేష పూజలు నిర్వహించి దర్శించుకున్నారు. అనంతరం నందీశ్వర దర్శనం చేసి, అర్చకుల చేత స్వామివారి తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. అనంతరం అమ్మవారి ముఖ మండపంలో శ్రీ చక్రానికి ఖడ్గమాలతో కుంకుమార్చన నిర్వహించారు. తరువాత వేదాశీర్వచన మండపంలో వేద పండితులు ఆశీర్వచనం, తీర్థ ప్రసాదాలు, చిత్రపటాలు, శేష వస్త్రాలను ఆలయ కార్యనిర్వహణ అధికారి ఎం.శ్రీనివాసరావు అందజేశారు. వారి వెంట రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వివేక్ యాదవ్, జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి, ఎస్పీ సునీల్ షోరాణ్, జాయింట్ కలెక్టర్ కె.కార్తిక్ తదితరులు ఉన్నారు.

పర్యావరణ పరిరక్షణ ప్రతిఒక్కరి బాధ్యత

- డిప్యూటీ స్పీకర్ కనుమూరి రఘురామకృష్ణరాజు

ప్రజాశక్తి - భీమవరం టౌన్

పశ్చిమను స్వచ్ఛ జిల్లాగా నిలిపేందుకు ప్రజలు, యువత భాగస్వామ్యం ఎంతో ముఖ్యమని డిప్యూటీ స్పీకర్ కనుమూరి రఘురామకృష్ణరాజు తెలిపారు. మూడో శనివారం స్వచ్ఛ ఆంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా పర్యావరణంలో అవకాశాలు అనే థీమ్ తో మున్సిపల్, పంచాయతీరాజ్ శాఖల ఆధ్వర్యంలో భీమవరం విష్ణు కాలేజీ ఆడిటోరియంలో నిర్వహించిన కార్యక్రమానికి డిప్యూటీ స్పీకర్‌తోపాటు కలెక్టర్ చదలవాడ నాగరాణి ముఖ్య అతిథిగా విచ్చేశారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ టి.రాహుల్‌కుమార్‌రెడ్డి, ఆర్‌డిఒ కె.ప్రవీణ్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా రఘురామకృష్ణరాజు మాట్లాడుతూ... మితిమీరిన కాలుష్యం కారణంగా సుప్రీంకోర్టు ఢిల్లీని నివాసయోగ్యం కాదని ప్రకటించిందని గుర్తు చేశారు. జిల్లా యంత్రాంగం ఎంత చేసినా, ప్రజల్లో మార్పు వస్తేగాని ఫలితం ఉండదు అన్నారు. నీరు కలుషితం కాకుండా ప్రతిఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలన్నారు. ఎక్కడ ఖాళీ ప్రదేశం ఉన్నా, అక్కడ పచ్చదనాన్ని పెంపొందించేందుకు ప్రతిఒక్కరూ కృషి చేయాలన్నారు. కలెక్టర్ చదలవాడ నాగరాణి మాట్లాడుతూ.. చెత్త నిర్వహణ సక్రమంగా చేపట్టకపోతే మన జిల్లానే కాదు, ప్రపంచం మొత్తం పెద్ద ప్రమాదంలో పడుతుందన్నారు. ప్రజల భాగస్వామ్యం కూడా చాలా ముఖ్యమన్నారు. తొలుత డిప్యూటీ స్పీకర్, కలెక్టర్ స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ ద్వారా జిల్లాకు కేటాయించిన ఎనిమిది చెత్త సేకరణ ట్రక్ ఆటోలను జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం పలువురు విద్యార్థులు ప్రదర్శించిన పర్యావరణహిత ఆవిష్కరణలను స్వయంగా పరిశీలించి, వివరాలు అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులను అభినందించారు.

9వ ఎలైట్ ఉమెన్ రాష్ట్ర స్థాయి బాక్సింగ్ పోటీలు ప్రారంభం

ప్రజాశక్తి - పిఠాపురం

స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 9వ ఎలైట్ ఉమెన్ రాష్ట్ర స్థాయి బాక్సింగ్ ఛాంపియన్‌షిప్స్ పోటీలు శనివారం ప్రారంభమయ్యాయి. ఈ పోటీలను జనసేన నాయకులు సురవరపు సురేష్, జిల్లా బాక్సింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు ఇమ్మిడిశెట్టి నాగేంద్ర కుమార్, కళాశాల ప్రిన్సిపల్ వి.కేశవరావు, ఎపి బాక్సింగ్ అసోసియేషన్ అధ్యక్షులు ఐ.వెంకటేశ్వరరావు, సెక్రెటరీ పి.మధుసూదన్‌రావు ప్రారంభించారు. ఈ సందర్భంగా పోటీల నిర్వహణ కార్యదర్శి పి.లక్ష్మణరావు మాట్లాడుతూ ..జిల్లా బాక్సింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో తొలిసారిగా రాష్ట్ర స్థాయి మహిళ బాక్సింగ్ పోటీలు పిఠాపురంలో నిర్వహిస్తున్నామన్నారు. రాష్ట్ర నలుమూలల నుంచి సుమారు 150 మంది క్రీడాకారులు వచ్చారన్నారు. వారికి రెండు రోజులపాటు వసతి, భోజన సౌకర్యం కల్పిస్తున్నామన్నారు. ఈ పోటీల్లో ప్రతిభను చాటుకున్న క్రీడాకారులు జాతీయస్థాయి బాక్సింగ్ పోటీలకు ఎంపిక అవుతారన్నారు. ఈ కార్యక్రమంలో ఎపి ఒలింపిక్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు కె.పద్మనాభం, కె.చిన్నబ్బాయి, జె ప్రసాదరావు, లోవరాజు, రంగబాబు పాల్గొన్నారు.

లైంగిక వేధింపుల కేసులో యువకుడికి పదేళ్లు జైలు

ప్రజాశక్తి - పాలకొల్లు

ఇంట్లోకి చొరబడి ఓ యువతిని లైంగికంగా వేధించిన ఘటనలో నేరం రుజువు కావడంతో ఆ యువకుడికి న్యాయస్థానం పది సంవత్సరాల కఠిన కారాగార శిక్ష విధించింది. వివరాలు ఇలా ఉన్నాయి. పాలకొల్లు మండలంలోని అరటికట్లలో 2022 జూన్ 16న యువతి ఇంట్లోకి చొరబడిన అదే గ్రామానికి చెందిన యువకుడు మామిడి శెట్టి రమేష్‌బాబు ఆమెను లైంగిక వేధింపులకు గురిచేయడంతో నేరం రుజువు కావడంతో అతనికి పది సంవత్సరాల కారాగార శిక్ష, వెయ్యి రూపాయలు జరిమానా విధించినట్లు రూరల్ సిఐ గుత్తుల శ్రీనివాస్ తెలిపారు. యువతి తండ్రి రెండవ వివాహం చేసుకోవడంతో అమ్మమ్మ ఇంటి వద్ద ఉండి చదువుకుంటోంది. ఆ రోజు ఆమె పడుకొని ఉండగా రమేష్ ఇంట్లోకి చొరబడి ఆమెను లైంగికంగా వేధించాడు. ఆమె కేకలు వేయడంతో రమేష్ పారిపోయాడు. దీనిపై అప్పట్లో ఫిర్యాదు చేయడంపై కేసు నమోదైంది.

నేడు అమరవీరుల సంస్మరణ సభ

- సిపిఎం పొలిట్ బ్యూరో సభ్యులు బివి రాఘవులు,
- రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు రాక
- చింతూరుకు తరలిరానున్న ప్రజానీకం

ప్రజాశక్తి- చింతూరు (అల్లూరి జిల్లా)

సిపిఎం అమరవీరుల సంస్మరణ సభకు ఉద్యమాల గడ్డ చింతూరు సిద్ధమైంది. ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు స్మారక సభ, ర్యాలీని ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు. యర్రంపేటలోని రచ్చబండ వద్ద ఎర్రజెండాలు కట్టారు. చుట్టుపక్కల మండలాలు, గ్రామాల నుంచి ప్రజలు ఎర్రంపేట గ్రామంలోని కల్లేరు జంక్షన్ వద్దకు ఆదివారం ఉదయం 11 గంటలకు చేరుకుని అక్కడ నుండి ర్యాలీగా ప్రారంభమై చింతూరు ప్రధాన కూడలి వద్దకు చేరుకోనున్నారు. అనంతరం పాత ప్రభుత్వాస్పత్రి ఆవరణలో సంస్మరణ సభ జరగనుంది. ముఖ్య అతిథిగా సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బివి.రాఘవులు, రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, కేంద్ర కమిటీ సభ్యులు కె.లోకనాథం హాజరు కానున్నారు. వారితోపాటు తెలంగాణ రాష్ట్ర నాయకులు బండారు రవికుమార్, ఐద్వా సీనియర్ నాయకులు బి.హైమావతి పాల్గొననున్నారు.

స్మారక స్తూపాలకు రంగులు

మన్య ప్రాంత ఆదివాసీలకు అండగా నిలిచిన అమర వీరుల సంస్మరణ సభకు చింతూరు మండల కేంద్రంతోపాటు చుట్టు పక్కల ప్రాంతాల వారూ భారీగా తరలిరానున్నారు. ఈ ప్రాంతంలో అమరులైన పలువురు నాయకుల స్మారక స్తూపాలకు ఇప్పటికే రంగులద్దిన ప్రజలు పల్లెపల్లెనా ఎర్రజెండాలు కట్టారు. అమరవీరుల చిత్రపటాలను ఏర్పాటు చేశారు. ఆదివారం జరిగే సభకు సిపిఎం జిల్లా కార్యదర్శి బొప్పెన కిరణ్ అధ్యక్షత వహించనున్నారు.


పార్టీ జెండా ఎగురవేస్తున్న స్థానిక నాయకులు

ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిన అమరవీరులు

పల్లె పల్లె నుండి కదులుదాం.. అమరవీరుల ఆశయ సాధనకై కదం తొక్కుదాం.. అమరవీరుల సంస్మరణ సభను జయప్రదం చేద్దాం అని సిపిఎం చింతూరు మండల కమిటీ పిలుపునిచ్చింది. ఇక్కడి ప్రజలకు దోపిడీదారుల నుంచి నాటి సిపిఎం నేతలు విముక్తి కల్పించారు. ప్రాణాలు అర్పించి ప్రజల పక్షాన నిలబడ్డారు. తునికాకు సేకరణ మొదలు.. అటవీ ఉత్పత్తులపై ఆంక్షలు, కాంట్రాక్టర్ల దోపిడీ, లూటీలపై ఈ ప్రాంతంలో ఎర్రజెండా ఉద్యమించింది. ఆనాటి కాంగ్రెస్ పార్టీ, పీపుల్స్ వార్ నక్సల్స్ హత్యాకాండకు తెరతీయడంతో సిపిఎం నేతలు ప్రాణాలు కోల్పోయారు. మరోవైపు పోలీసులు, ఫారెస్ట్ అధికారులు కలిసి నాయకులపై తప్పుడు కేసులు బనాయించారు. అడవిలో పశువులు మేస్తే గిరిజనులకు కఠిన శిక్షలు విధించారు. ఈ క్రమంలో ప్రజల కోసం సిపిఎం నాయకులు అలుపెరగని పోరాటాలు చేశారు. బత్తుల భీష్మారావు, చందర్రావు అమరులై చాలా సంవత్సరాలైంది.

అయినప్పటికీ వారిరువురూ ప్రజల గుండెల్లో నేటికీ చిరస్థాయిగా ఉన్నారు. ఎర్రజెండా ముద్దుబిడ్డలైన కుంజా బొజ్జి, సున్నం రాజయ్య అసెంబ్లీ వేదికగా ప్రజల, గిరిజనుల గళం వినిపించారు. వారు అమరులైనప్పటికీ వారు చేసిన ఎన్నో మంచి పనులు ప్రజలను ఎర్రజెండాకు చేరువచేశాయి. ఆ ఎర్రజెండా ముద్దుబిడ్డల ఆశయ సాధనలో, వారి త్యాగాలను స్మరించుకుంటూ ఆదివారం అమరవీరుల సంస్మరణ సభను సిపిఎం ఆధ్వర్యాన చింతూరులో నిర్వహిస్తున్నారు.

గిరిజన సంస్కృతిని భావితరాలకు అందించాలి

- ఘనంగా ప్రారంభమైన గిరిజన సాంస్కృతికోత్సవాలు

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): గిరిజన సంస్కృతి, సాంప్రదాయ కళా సంపదను పరిరక్షించి భావితరాలకు అందించాలని పలువురు వక్తలు పిలుపు నిచ్చారు. శనివారం తిరుపతి నగర పరిధిలోని గిరిజన భవన్ వేదికగా బంజారా జన్ సంఘ్ 8వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని గిరిజన జాతీయ సాంస్కృతిక ఉత్సవాలను ఘనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డిఎం అండ్ హెచ్ ఓ బాలకృష్ణ నాయక్, మాజీ మంత్రి పరసారత్నం, సుప్రీంకోర్టు న్యాయవాది నాగపట్ల రాజగోపాల్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... గిరిజన సంక్షేమం కోసం నిరంతరం శ్రమించే బంజారా జన్ సంఘ్ హరి చౌహాన్ నాయక్ గత 8 ఏళ్లుగా జాతీయ స్థాయిలో గిరిజన సాంస్కృతిక ఉత్సవాలను నిర్వహించడం అభినందనీయమన్నారు. గిరిజనులు ఉన్నత లక్ష్యంతో చదువుకుని సమాజంలో రాణించాలని, అలానే గిరిజన సంస్కృతి సాంప్రదాయాలను పరిరక్షించడంలో భాగస్వామ్యులు కావాలని పిలుపునిచ్చారు. అనంతరం విద్యలో రాణిస్తున్న గిరిజన ప్రతిభావిద్యార్థులు 40 మందికి మెడల్స్, సర్టిఫికెట్లతో పాటు నగదు బహుమతులు అందజేశారు. కళాకారులను జ్ఞాపికలతో ఘనంగా సత్కరించి అభినందించారు. ఈ సందర్భంగా ప్రదర్శించిన దింసా, కూచిపూడి, భరతనాట్యం, కథాకళి, కోలాటం, శ్రీపద్మావతి కల్యాణం నృత్య రూపకాలు సభికులను ఆకట్టుకున్నారు. ఈ కార్యక్రమంలో గిరిజన భవన్ చైర్మన్ వెంకటరమణ నాయక్, శివానాయక్, వెంకటేష్ నాయక్, వినోద్ రాథోడ్, ప్రియాంక, యతేష్ రాజ్, రమేష్ బాబు కళాకారులు, కవులు, గిరిజన నేతలు పాల్గొన్నారు.

రహదారిలో వరినాట్లు



ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: శ్రీకాళ హస్తి రూరల్ మండలంలోని వేడాం రోడ్డు మార్గంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు శనివారం వరినాట్లు వేశారు. కొందరు రైతులు తూములను ఆక్రమించి పూడ్చి వేయడం వల్ల నీరు రోడ్డుపైకి చేరడంతో కాంగ్రెస్ పార్టీ నాయకులు ఈ విధంగా నిరసన తెలిపారు. వెంటనే అధికారులు చొరవ తీసుకొని సమస్యను పరిష్కరించాలని కోరారు. ఈ మార్గంలో పలు దేవాలయాలు, గ్రామాలు ఉండడంతో ప్రజలు, యాత్రికులు ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. డిసిసి అధ్యక్షులు బాలగురవం బాబు, నియోజవర్గ సమన్వయకర్త తలపా దామోదర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పాడి రైతుకు ఎంత కష్టం..!


- సౌకర్యాల లేమితో పశువైద్య ఆసుపత్రులు
- ఏడాదిగా అందుబాటులో లేని మందులు
- పశు పోషకులపై ఆర్థిక భారం

ప్రజాశక్తి - కాకినాడ ప్రతినిధి

గ్రామీణ ప్రాంతాలలో వ్యవసాయం చేసుకునే రైతులు పాడి పరిశ్రమను అనుబంధంగా నడిపేవారు. ఒకప్పుడు వ్యవసాయ భూమి కలిగిన ప్రతీ ఒక్కరికీ పాడి పరిశ్రమ ఉండేది. ప్రస్తుతం క్రమం గా పశుపోషకులు తగ్గిపోతున్నారు. ఇందుకు కారణం ప్రభుత్వం నుంచి పశు సంవర్ధక శాఖ ద్వారా సంక్షేమ కార్యక్రమాలను పూర్తి స్థాయిలో అమలు చేయడం లేదు. దీనిలోభాగంగానే పశు వైద్య ఆసుపత్రులకు గత కొన్ని నెలలుగా మందులను ప్రభుత్వం సరఫరా చేయడం లేదు. నిధుల కొరత వలన ఆసుపత్రులకు పూర్తి స్థాయిలో మందులను అందివ్వకపోవడంతో పాడి రైతులపై అదనపు భారం పడుతోంది. కాకినాడ జిల్లాలో 76,502 ఆవులు, 2,82,274 గేదెలు, 1,01,870 గొర్రెలు, 1,41,229 మేకలు ఉన్నాయి. 92,48,636 కోళ్లు ఉన్నాయి. 2024-25 ఆర్థిక సంవత్సరంలో 6,22,550 మెట్రిక్ టన్నుల పాల ఉత్పత్తి జరిగింది. 62,481 మెట్రిక్ టన్నుల మాంసం ఉత్పత్తి, 30,553 లక్షల గుడ్లు ఉత్పత్తి జరుగుతోంది. ప్రస్తుతం శీతాకాలం కావడంతో పాడి పశువులకు అనేక వ్యాధులు సక్రమిస్తున్నాఇయ. సకాలంలో వైద్యం చేయించుకోవాలంటే దగ్గరలో ఉన్న పశు ఆసుపత్రలకు వెళ్లాల్సి వస్తుంది.

10 నెలలుగా మందులు లేవు

ప్రస్తుతం అన్ని రకాల పశువులకు నట్టల నివారణకు మందుల అవసరం ఉంటుంది. గర్భకోశ వ్యాధులకు, పోషకాలు మందులు, ఇతర సీజనల్ రోగాలకు మందులు



నిత్యం అవసరం ఉంటుంది. ప్రతీ మండల కేంద్రంలో ఒక ఆసుపత్రి, రెండు మండలాలకు ఒకటి చొప్పున ఏరియా ఆసుపత్రులు అందుబాటులో ఉన్నాయి. ఒక్క ఆసుపత్రికి రూ.45 వేల నుంచి రూ.1.20 లక్షల వరకూ విలువైన మందులను ప్రతీ మూడు నెలలకోకసారి అవసరం ఉంటాయి. అయితే గత 10 నెలలుగా ఈ మందులు పూర్తి స్థాయిలో అందుబాటులో ఉండటం లేదు. దీంతో పశువులకు ఏదైనా వ్యాధి సోకి ఆసుపత్రులకు వెళుతుంటే అక్కడి వైద్యులు మందులు లేవని బదులిస్తున్నారు. దీంతో చేసేదిలేక పాడి రైతులు ప్రయివేటు దుకాణాల్లో మందులు కొనుగోలు చేయాల్సివస్తుంది. నెలకు ఒక్కో పశువుపై మందుల కోసం రూ.వెయ్యి నుంచి రూ.2 వేల వరకూ ఖర్చు చేయాల్సి వస్తుందని పలువురు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం మందులను సరఫరా చేయకపోవడంతో అదనపు భారం తప్పడం లేదని రైతులు వాపోతున్నారు. మరోవైపు అరకొరగానే సంచార పశు వైద్య సేవలు అందుతున్నాయి. రైతు సేవా కేంద్రాల్లో సైతం మందులు అందుబాటులో లేక అవస్థలు తప్పడం లేదు. ప్రయివేటులో కొనుగోలు చేయలేక అనేక మంది తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

రూ.89 లక్షల విలువైన మందులకు ఇండెంట్

ప్రస్తుతం ఈ సీజన్లో జీర్ణ సంబంధిత నొప్పులు, గర్భ సంబంధ సమస్యలు అనేక పశువుల్లో కనిపిస్తున్నాయి. అజీర్తి, ఆమ్లు, జలగ వ్యాధులు, బికోలై ఇన్ఫెక్షన్, ఫెర్టిలిటీ, బ్యాక్టీరియా, వైరల్ సమస్యలతో పశువులు బాధపడుతున్నాయి. అయితే ప్రభుత్వం ఆయా ఆసుపత్రులకు ప్రతి మూడు నెలలకోసారి మందులు సరఫరా చేయాల్సివుంది. కానీ 10 నెలలుగా మందులు రావడం లేదని వైద్యులు చెబుతున్నారు. జిల్లాలో వివిధ ఆసుపత్రులకు సంబంధించి జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారులు సుమారు రూ.89 లక్షల విలువైన వివిధ రకాల మందులకు ఇటీవల ఇండెంట్ పెట్టారు. వీటిలో యాంటీబయాటిక్స్, యాంటీ పైరెటిక్, యాంటీ ఇన్ఫమేటరీ ద్రవాలు, కాలేయ టానిక్స్, ఖనిజ మిశ్రమం మందులు, నురుగు నివారణకు, ప్రాణాలను రక్షించే మందులు ఇలా అవసరమైన మందుల కోసం ఇండెంట్ పెట్టారు. ఈ నెల చివరికల్లా మందులు అందుబాటులో ఉంటాయని సంబంధిత శాఖ ఉన్నతాధికారులు చెబుతున్నారు.

గువహతి ఎయిర్‌పోర్టు కొత్త టెర్మినల్‌ను ప్రారంభించిన ప్రధాని మోడీ

గువహతి : భారత ప్రధాని మోడీ.. అసోం రాజధాని గువహతిలో గల లోకప్రియ గోపినాథ్ బర్దోలయ్ అంతర్జాతీయ విమానాశ్రయంలో కొత్త టెర్మినల్‌ను శనివారం మధ్యాహ్నం ప్రారంభించారు. ఈ టెర్మినల్‌ను ఏడాదికి 1.31 కోట్ల మంది ప్రయాణికులు రాకపోకలు సాగించగల సామర్థ్యంలో నిర్మించారు. ఈ టెర్మినల్ నిర్మాణానికి మొత్తం రూ.4వేల కోట్లు ఖర్చు చేశారు. అసోం మాజీ ముఖ్యమంత్రి గోపినాథ్ బర్దోలోయ్ పేరు గువహతి విమానాశ్రయానికి పెట్టారు. విమానాశ్రయం వెలుపల గోపినాథ్ బర్దోలోయ్‌కు చెందిన 80 అడుగుల విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. ఆ విగ్రహాన్ని గతంలో ప్రధాని మోడీ చేతుల మీదుగా ఆవిష్కరించారు. నూతన టెర్మినల్ నిర్మాణ ప్రాజెక్టు మొత్తం విలువ రూ.5 వేల కోట్లు కాగా... రూ. 4 వేల కోట్లు ఖర్చయ్యింది. మరో రూ.1000 కోట్లను మెయింటెనెన్స్, రిపేర్లు, ఇతర సౌకర్యాలు సమకూర్చుకోవడం కోసం పక్కన పెట్టారు. ఆగ్నేయాసియాకు గేట్‌వేగా, ఈశాన్య భారతానికి కీలక ఏవియేషన్ హబ్‌గా ఉండాలనే లక్ష్యంతో ఈ ఎయిర్‌పోర్టు నిర్మాణం జరిగింది.

పోలవరం జిల్లాలో 'పోలవరం'ను కలపాలి

- 22న మన్యం బంద్‌కు సిపిఎం మద్దతు

ప్రజాశక్తి- ఏలూరు అర్బన్

పోలవరం జిల్లాలో పోలవరం ఆదివాసీ ప్రాంతాలను చేర్చాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 22న జరగనున్న మన్యం బంద్‌కు సిపిఎం సంపూర్ణ మద్దతు ప్రకటించింది. ఈ మేరకు ఆ పార్టీ జిల్లా కార్యదర్శి ఎ.రవి ఒక ప్రకటనలో తెలిపారు. రంపచోడవరం కేంద్రంగా పోలవరం జిల్లాను ప్రకటించి, పోలవరం ఆదివాసీ ప్రాంతాలను చేర్చకపోవడం నేతిబీరలో నెయ్యి లేనట్టుగానే ఉందని పేర్కొన్నారు. ఈ ప్రభుత్వ చర్య హాస్యాస్పదంగా ఉందని తెలిపారు. పోలవరం నిర్వాసితుల పునరావాసం కోసం ప్రత్యేక జిల్లా అని ప్రకటించినప్పుడు ప్రాజెక్టు నిర్మాణం అయ్యేదే పోలవరంలో అని, ఫలితంగా పోలవరం, కుక్కునూరు, వేలేరుపాడు మండలాల ప్రజలు నిర్వాసితులవుతున్నారని, వీరికి బుట్టాయగూడెం, జీలుగుమిల్లి, కొయ్యలగూడెం, జంగారెడ్డిగూడెం మండలాల్లో పునరావాసం కల్పిస్తున్నారని పేర్కొన్నారు. చివరికి చింతూరు రెవెన్యూ డివిజన్ వారికీ ఇక్కడే పునరావాసం కల్పిస్తున్నారని తెలిపారు. అలాంటప్పుడు రంపచోడవరం మాత్రమే జిల్లాగా ప్రకటిస్తే సగం మంది నిర్వాసితులను వదిలేసినట్లే కదా? అని ప్రశ్నించారు.

రంపచోడవరం, పోలవరం ఎస్‌టి నియోజకవర్గాలు, షెడ్యూల్డ్ ప్రాంతాలు, 1/70 పీసా చట్టాలు అమలవుతున్న ప్రాంతం అని, రెండూ కలిపి ఒక జిల్లా ఏర్పాటు చేయడం ద్వారా గిరిజన చట్టాల అమలుకు ప్రభుత్వ యంత్రాంగం దృష్టి పెట్టడానికి వీలవుతుందని తెలిపారు. రెండూ వెనుకబడిన ప్రాంతాలే అయినందున ఈ ప్రాంత అభివృద్ధిపై దృష్టి సారించడానికి కార్యాచరణకు సాధ్యమవుతుందని పేర్కొన్నారు. పోలవరం ఆదివాసీ, ప్రజాసంఘాల ఆందోళన న్యాయమైందని, దీనిలో భాగంగా ఈ నెల 22న మన్యం బంద్‌కు సిపిఎం సంపూర్ణ మద్దతు ప్రకటిస్తుందని తెలిపారు. ఈ బంద్‌కు అందరూ సహకరించి జయప్రదం చేయాలని కోరారు. ప్రభుత్వం జిల్లాల పునర్విభజనలో పోలవరం ఆదివాసీ ప్రాంతాన్ని చేర్చాలని రవి డిమాండ్ చేశారు.

డబ్బుల కోసమే 'పైరసీ'

- పోలీసుల విచారణలో ఐబొమ్మ రవి
- టెలిగ్రామ్ ఐడిలపై దృష్టి సారించిన పోలీసులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఐబొమ్మ వెబ్‌సైట్ నిర్వాహకుడు రవి కేసు విచారణలో సంచలన విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. అన్ని విషయాలపై పోలీసులు కూపీలాగి పలు విషయాలు రాబట్టినట్టు తెలిసింది. పోలీసుల విచారణలో అతడు సినిమా పైరసీకి పాల్పడిన విధానాన్ని వివరించినట్టు సమాచారం. పైరసీ సినిమా వెబ్‌పోర్టల్స్‌కు సేవలు మాత్రమే అందించానని, అన్ని ఉద్యోగాల మాదిరిగానే దీన్ని ఎంపిక చేసుకున్నానని విచారణలో రవి చెప్పినట్టు తెలిసింది. ముందు తాను చేసిన ఐటీ ఉద్యోగంలో సంపాదించిన దానికంటే అధిక మొత్తంలో డబ్బులు వస్తుండటంతో పైరసీని ఎంచుకున్నానని తెలిపినట్టు సమాచారం. మూడు వేర్వేరు కేసుల్లో విచారణ నిమిత్తం నాంపల్లి కోర్టు ఇమ్మడి రవికి 12 రోజుల పోలీస్ కస్టడీకి అనుమతించిన విషయం తెలిసిందే. కోర్టు ఆదేశాల మేరకు సైబర్ క్రైమ్ పోలీసులు గత గురువారం చంచల్‌గూడ జైలు నుంచి రవిని అదుపులోకి తీసుకుని విచారణ కొనసాగిస్తున్నారు. అయితే ఈ మూర్రోజుల విచారణలో పైరసీకి సంబంధించిన కీలక వివరాలను రవి వెల్లడించినట్టు సమాచారం. టెలిగ్రామ్ ఛానల్ ద్వారా కొత్త సినిమాల పైరసీ ప్రింట్లతో వ్యాపారం చేసినట్టు ఒప్పుకున్నాడు. కేవలం సాధారణ ప్రింట్లే కాకుండా, ఏకంగా క్యూబ్ నెట్‌వర్క్‌ను, శాటిలైట్ లింక్‌ను హ్యాక్ చేసి సినిమాలను హెచ్‌డీ ఫార్మాట్‌లో రికార్డు చేసినట్టు తెలిపాడు. ఈ విధంగా పైరసీ చేసిన సినిమాలను అమ్మేందుకు 'హెచ్‌డీ హబ్' పేరుతో ప్రత్యేకంగా ఒక టెలిగ్రామ్ ఛానల్ ఏర్పాటు చేసినట్టు చెప్పాడని తెలిసింది. దాంతో అధికారులు టెలిగ్రామ్ ఐడిలపై దృష్టి సారించారు. పోలీసులకు చిక్కకుండా ముందుస్తుగానే జాగ్రత్తపడిన విధానాన్ని రవి చెప్పినట్టు తెలిసింది. ప్రహ్లాద్‌కుమార్ అనే వ్యక్తిని సృష్టించి, దానిపై పాన్‌కార్డు, వెబ్‌పోర్టల్స్ కొనుగోలు చేసినట్టు తెలిపినట్టు తెలిసింది. మిత్రుడు ప్రసాద్ డిజిటల్ సంతకంతో ఆర్థిక లావాదేవీలు కొనసాగించాడని సమాచారం. పోలీసులకు చిక్కితే ఎలా బయటపడవచ్చో ముందుగానే సాక్ష్యాధారాలను సిద్ధం చేసుకున్నాడని తెలిసింది. కరేబియన్ దీవుల్లోనే శాశ్వతంగా ఉండిపోవాలని నిర్ణయించుకున్న రవి, కూకట్‌పల్లిలోని ఇంటిని అమ్మేద్దామనుకుని రాగా.. ఆ సమయంలో పోలీసులకు చిక్కాడు. రవి నుంచి మరిన్ని విషయాలు రాబట్టేందుకు పోలీసులు ముందుగానే ప్రశ్నలను సిద్ధం చేసుకున్నారని తెలిసింది. ఇప్పటి వరకు సేకరించిన సాంకేతిక ఆధారలతో కీలక విషయాలు రాబట్టాలని పోలీసులు ప్రయత్నిస్తున్నారు.

4.960 కిలోల గంజాయి స్వాధీనం

- డీఎస్పీ వెంకట్రామయ్య

ప్రజాశక్తి-ఆలూరు

చిప్పగిరి మండలం దేగులపాడు గ్రామ పరిధిలోని పంట పొలాల్లో సాగు చేసిన గంజాయి మొక్కలను (4.960 కిలోలు) స్వాధీనం చేసుకున్నట్లు పత్తికొండ డిఎస్‌పి వెంకటరామయ్య తెలిపారు. శనివారం ఆలూరు సర్కిల్ పోలీసు స్టేషన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. దేగులపాడు గ్రామానికి చెందిన రైతు ఉనేబాద్ శివయ్య అదే గ్రామానికి చెందిన సర్వే నెంబరు 176 ఆంజనేయ స్వామి మాన్యంలో, సర్వే నెంబరు 173 ముల్లా మహాజిత్ ఇనామ్ భూమిలో కంది, మిరప పంటలో 300 గంజాయి మొక్కలను పెంచి సాగు చేసుకుంటున్నట్లు తెలిపారు. సమాచారం మేరకు ఆలూరు సిఐ రవి శంకర్ రెడ్డి ఆధ్వర్యంలో చిప్పగిరి ఎస్ఐ సతీష్ కుమార్, ఎడిఎ చెంగల్ రాయుడు, తహశీల్దార్ ఇజాజ్ అహ్మద్ వెళ్లి పంట పొలాలను పరిశీలించారని చెప్పారు. గంజాయి మొక్కలను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. నిందితుడు పరారీలో ఉన్నాడని, త్వరలోనే పట్టుకొంటామని తెలిపారు.

ఇంగ్లండ్ లక్ష్యం 435.. ప్రస్తుతం 207/6


- యాషెస్ సిరీస్ మూడో టెస్ట్



ఆడిలైడ్: యాషెస్ సిరీస్ మూడో టెస్ట్‌లోనూ ఇంగ్లండ్ జట్టు ఓటమి దిశగా పయనిస్తోంది. రెండో ఇన్నింగ్స్‌లో ఆతిథ్య ఆస్ట్రేలియాను 349పరుగులకు ఆలౌట్ కావడంతో ఇంగ్లండ్ జట్టు భారీ లక్ష్యాన్ని ఛేదించాల్సి వచ్చింది. ఓవర్‌నైట్ స్కోర్ 4వికెట్ల నష్టానికి 271 పరుగులతో శనివారం రెండో ఇన్నింగ్స్ కొనసాగించిన ఆస్ట్రేలియాను ఇంగ్లండ్ బౌలర్లు కట్టడి చేశారు. టంగ్ నాలుగు, కర్సే మూడు వికెట్లకి తోడు ఆర్చర్, జాక్స్, స్టోక్స్ ఒక్కో వికెట్ పడగొట్టారు. ఆసీస్ ఓపెనర్ హెడ్(170) భారీ శతకానికి తోడు వికెట్ కీపర్ క్యారీ(72) అర్ధసెంచరీతో రాణించాడు. దీంతో ఇంగ్లండ్ ముందు 435 పరుగుల లక్ష్యాన్ని భారీ లక్ష్యాన్ని ఉంచింది. అనంతరం రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన ఇంగ్లండ్ నాల్గోరోజు ఆట ముగిసేసరికి 6వికెట్లు నష్టపోయి 207పరుగులు చేసింది. ఓపెనర్ క్రాలే(85) రాణించినా.. డకెట్(4), పోప్(19), బెన్ స్టోక్స్(5) నిరాశపరిచారు. రూట్(39), బ్రూక్(30) ఫర్వాలేదనిపించారు. క్రీజ్‌లో స్మిత్(2), విల్ జాక్స్(11) ఉన్నారు. నేటితో ముగియనున్న మూడోటెస్ట్‌లో మరో నాలుగు వికెట్లు కూల్చితే యాషెస్ సిరీస్‌ను మరో రెండు టెస్ట్ మ్యాచ్‌లు మిగిలి ఉండగానే ఆసీస్ జట్టు 3-0తో చేజిక్కించుకోవడం ఖాయం.

బెంగాల్ జట్టులో షమీకి చోటు

- విజయ్ హజారే ట్రోఫీ వన్డే టోర్నీ



కోల్‌కతా: విజయ్ హజారే ట్రోఫీ వన్డే టోర్నీ కోసం ప్రకటించిన బెంగాల్ జట్టులో టీమిండియా మాజీ పేసర్ మహ్మద్ షమీ చోటు దక్కించుకున్నాడు. జాతీయ జట్టుకు దూరమైన షమీ బెంగాల్ జట్టులో తన స్థానాన్ని పదిలం చేసుకున్నాడు. గాయం నుంచి కోలుకుతున్న తర్వాత బెంగాల్ తరపున దేశవాళీ క్రికెట్‌లో అద్భుతంగా రాణిస్తున్నాడు. ప్రస్తుత దేశవాళీ సీజన్‌లో అన్ని ఫార్మాట్లలో కలిపి 36 వికెట్లు పడగొట్టాడు. దీంతో విజయ్ హజారే ట్రోఫీలో బెంగాల్ పేస్ బౌలింగ్ భారాన్ని మోయనున్నాడు. రంజీ ట్రోఫీ నాలుగు మ్యాచ్‌లలో 18.60 సగటుతో 20 వికెట్లు తీసిన షమీ.. సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీ టీ20 టోర్నమెంట్‌లో 7 మ్యాచుల్లో 14.93 సగటుతో 16 వికెట్లు పడగొట్టాడు. బెంగాల్ క్రికెట్ అసోసియేషన్(బిసిఎ) ప్రకటించిన జట్టుకు అభిమన్యు ఈశ్వరన్ కెప్టెన్‌గా ఎంపికయ్యాడు. బెంగాల్ జట్టు ఎలైట్ గ్రూప్-బిలో ఉండగా.. డిసెంబర్ 24న రాజ్‌కోట్‌లో విదర్భతో తొలి మ్యాచ్ ఆడనుంది. ఇదే గ్రూప్‌లో అస్సాం, బరోడా, జమ్మూ-కాశ్మీర్, హైదరాబాద్, చండీగఢ్, ఉత్తరప్రదేశ్ జట్లు ఉన్నాయి.

జట్టు: అభిమన్యు ఈశ్వరన్(కెప్టెన్), మజుందార్, సుమిత్ నాగ్, అభిషేక్ పోరెల్(వికెట్ కీపర్లు), సుదీప్ ఘరామి, సుమంత్ గుప్తా, చంద్రహాస్ దాష్, షాబాజ్ అహ్మద్, కరణ్ లాల్, మహ్మద్ షమీ, ఆకాశ్ దీప్, ముఖేష్ కుమార్, సయన్ ఘోష్, రవి కుమార్, అమీర్ ఘనీ, విశాల్ భాటి, అంకిత్ మిశ్రా.


హోప్స్ అజేయ సెంచరీ

- వెస్టిండీస్ 381/6

ఓవల్: న్యూజిలాండ్‌తో జరుగుతున్న మూడో, చివరి టెస్ట్‌లో పర్యాటక వెస్టిండీస్ జట్టు ధాటిగా ఆడుతోంది. వెస్టిండీస్ బ్యాటర్ హోప్జ్(109నాటౌట్) సెంచరీకి తోడు కింగ్(63) అర్ధసెంచరీతో రాణించారు. ఆ తర్వాత అథాంజే(45), గ్రీవ్స్(43) కూడా రాణించడంతో మూడోరోజు ఆట నిలిచే సమయానికి వెస్టిండీస్ జట్టు 6 వికెట్ల నష్టానికి 381 పరుగులు చేసింది. క్రీజ్‌లో హోప్జ్‌కి తోడు ఫిలిప్(12) ఉన్నారు. ఓవర్‌నైట్ స్కోర్ 110పరుగులతో తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన వెస్టిండీస్.. మరొక్క పరుగు జతచేసి క్యాంప్‌బెల్(45) వికెట్ కోల్పోయింది. ఆ తర్వాత కింగ్(65) కూడా అర్ధసెంచరీ తర్వాత ఔటవ్వడంతో విండీస్ 140 పరుగులకే ఓపెనర్లు పెవీలియన్‌కు చేరారు. ఈ క్రమంలో హోప్జ్ మెరుపు సెంచరీతో ఆదుకున్నాడు. మూడోరోజంతా క్రీజ్‌లో నిలిచి వెస్టిండీస్ వికెట్ల పతనాన్ని అడ్డుకున్నాడు. న్యూజిలాండ్ బౌలర్లు డఫీ, అజాజ్ పటేల్‌కు రెండేసి, మిచెల్ రే, డారీ మిచెల్‌కు ఒక్కో వికెట్ దక్కాయి. తొలి ఇన్నింగ్స్‌లో న్యూజిలాండ్ జట్టు 8వికెట్ల నష్టానికి 578పరుగుల వద్ద తొలిన్నింగ్స్‌ను డిక్లేర్డ్ చేయగా.. మూడు టెస్ట్ మ్యాచ్‌ల సిరీస్‌లో ఆతిథ్య న్యూజిలాండ్ జట్టు 1-0 ఆధిక్యతలో ఉంది.

గ్రామీణ సంక్షోభం తీవ్రమవుతుంది

- పేదలపై మరింత ప్రభావం
- 'విబి - జి ఆర్ఎఎం జి'తో కేంద్రానికి విస్తృత అధికారాలు
- గాంధీ పేరును తొలగించొద్దు : కేరళ, తమిళనాడు, కర్ణాటక, హిమాచల్ సిఎంలు



స్టాలిన్ పినరయి విజయన్ సిద్ధరామయ్య

న్యూఢిల్లీ : మోడీ సర్కారు తీసుకొచ్చిన వికసిత్ భారత్ గ్యారంటీ ఫర్ రోజ్‌గార్ అండ్ అజీవికా మిషన్ (గ్రామీణ) బిల్లు (విబి - జి ఆర్ఎఎం జి)పై అన్ని పక్షాల నుంచి తీవ్ర వ్యతిరేకత వస్తోంది. ఈ బిల్లుపై నాలుగు ప్రతిపక్ష రాష్ట్రాల ముఖ్యమంత్రులు అభ్యంతరం వ్యక్తం చేశారు. ఇది గ్రామీణ పేదల పరిస్థితిని మరింత దారుణం చేస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఆకలి, వలసల నుంచి రక్షించే చివరి కవచాన్ని బలహీనపరుస్తుందని కేరళ, కర్ణాటక, తమిళనాడు, హిమాచల్‌ప్రదేశ్ రాష్ట్రాల సిఎంలు హెచ్చరిస్తున్నారు. ఈ బిల్లు గత రెండు దశాబ్దాలుగా అమలులో వున్న మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం (ఎంజిఎన్ఆర్ఇజిఎ)ను రద్దు చేస్తుందనీ, నిధుల కేటాయింపు, అమలు ప్రాంతాలు, కేంద్ర - రాష్ట్రాల మధ్య నిధుల భాగస్వామ్య విధానంలో మార్పులపై కేంద్రానికి విస్తృత అధికారాలు ఇస్తుందని వారు పేర్కొన్నారు.

గాంధీ పట్ల, శ్రమ పట్ల సంఘ్‌పరివార్ శత్రుత్వం : విజయన్

చట్టాన్ని నీరుగార్చడాన్ని, గాంధీ పేరును తొలగించడాన్ని కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ తీవ్రంగా వ్యతిరేకించారు. "గాంధీజీ పేరును తీసివేయడం, ఎంజిఎన్ఆర్ఇజిఎ స్వభావాన్ని బలహీనపర్చడం ద్వారా గాంధీ వారసత్వం పట్ల, శ్రమ ద్వారా గౌరవం అనే ఆలోచన పట్ల సంఘ్ పరివార్‌కు ఉన్న శత్రుత్వం అర్థమవుతోంది" అని ఎక్స్‌లో పేర్కొన్నారు. పంటకాలంలో తప్పనిసరిగా 60 రోజుల విరామం నిబంధన గ్రామీణ సంక్షోభాన్ని పెంచి, ఉపాధి అస్థిరతకు దారితీస్తుందని ఆయన హెచ్చరించారు.

కార్మికుల పొట్టకొట్టొద్దు : స్టాలిన్

తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకె స్టాలిన్.. ప్రధాని మోడీకి రాసిన లేఖలో కొత్త చట్టాన్ని అమలు చేయొద్దని కోరారు. ఇది రాష్ట్ర ఆర్థిక వ్యవస్థపై భారాన్ని మోపి, లక్షలాది మంది పేద గ్రామీణ కార్మికుల జీవనాధారాన్ని దెబ్బ తీస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. కేంద్రం నిర్దేశించే ప్రమాణాల ఆధారంగా రాష్ట్రాలవారీగా నిధుల పరిమితులను నిర్ణయించే అధికారాలను కేంద్రానికి ఇవ్వడాన్ని ఆయన తీవ్రంగా వ్యతిరేకించారు. తమిళనాడులో వాతావరణ, భౌగోళిక పరిస్థితుల కారణంగా డిమాండ్ ఎక్కువగా ఉంటుందనీ, జనాభా వంటి అంశాల ఆధారంగా ఖర్చులకు పరిమితి విధిస్తే పని దినాలు, వేతనాలు తగ్గి కార్మికులు ఇబ్బందులు పడతారని వివరించారు. కొత్తగా ప్రతిపాదించిన 60:40 నిధుల విధానం రాష్ట్రాలకు అదనపు భారంగా మారుతుందని స్టాలిన్ పేర్కొన్నారు.

గ్రామీణ పేదలకు, ప్రజాస్వామ్యానికి ముప్పు : సిద్ధరామయ్య

ఈ బిల్లు గ్రామీణ పేదలకు, ప్రజాస్వామ్యానికి ఆందోళన కలిగించే పరిణామమని కర్ణాటక సిఎం సిద్ధరామయ్య ఎక్స్‌లో పేర్కొన్నారు. "దాదాపు రెండు దశాబ్దాల పాటు కోట్లాది గ్రామీణ కుటుంబాలకు పని హక్కును కాపాడిన చట్టాన్ని సరైన చర్చ లేకుండా, రాష్ట్ర ప్రభుత్వాలతో సంప్రదింపులు జరపకుండా, స్టాండింగ్ కమిటీకి పంపాలన్న ప్రతిపక్షాల డిమాండ్లను పట్టించుకోకుండా బలవంతంగా ఆమోదించారు. ప్రజల జీవనాధారాలపై ఇంత పెద్ద మార్పును ఇలా అమలు చేయకూడదు" అని వివరించారు. ఉపాధి చట్టం కార్మికులకు గౌరవం, సంక్షోభ సమయాల్లో ఆదాయ భద్రత కల్పించిందని పేర్కొన్నారు. ఇకపై ఢిల్లీ నుంచి కేటాయింపులు, నోటిఫికేషన్లు, కేంద్రం వినియోగించే స్వేచ్ఛా అధికారాలపై పేదల ఉపాధి ఆధారపడి ఉంటుందని తెలిపారు.

ప్రజల హక్కులను హరించే ప్రయత్నం : హిమాచల్ సిఎం

ఈ వివాదాస్పద బిల్లును హిమాచల్‌ప్రదేశ్ ముఖ్యమంత్రి సుఖ్వీందర్ సింగ్ సుఖూ వ్యతిరేకించారు. ఇది కష్టపడి పని చేసే ప్రజల హక్కులను హరించే ప్రయత్నమని వ్యాఖ్యానించారు.

కొత్త చట్టానికి ముందే 'ఉపాధి' నుంచి 16 లక్షల మంది తొలగింపు

రాష్ట్రంలోనే 11 లక్షల మందికి మొండిచేయి

న్యూఢిల్లీ : మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం (ఎంజిఎన్ఆర్ఇజిఎ) సవరించి, కొత్త పథకాన్ని తీసుకురావడానికి కొన్ని రోజుల ముందే దాదాపు 16.3 లక్షల మంది కార్మికుల పేర్లను కేంద్ర ప్రభుత్వం తొలగించింది. అందులో 11 లక్షల మంది రాష్ట్రానికి చెందిన వారే కావడం గమనార్హం. ది న్యూ ఇండియన్ ఎక్స్‌ప్రెస్‌లో వచ్చిన కథనం ప్రకారం ఈ నెల 16న లోక్‌సభలో సవరణ బిల్లుకు ప్రవేశపెట్టడానికి 36 రోజుల ముందే ఈ తొలగింపు జరిగింది. ఈ ఏడాది అక్టోబర్ 10 నుంచి నవంబర్ 14 వరకూ ఈ తొలగింపు జరిగిందని అధికారిక సమాచారం వెల్లడించింది. ఇలా పేర్లు తొలగించడంపై గ్రామీణ కార్మికులు, నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సమాజ్‌వాదీ పార్టీ ఎంపిలు లాల్జీ వర్మ, ఆనంద్ భదౌరియా లోక్‌సభలో అడిగిన ప్రశ్నలకు గ్రామీణాభివృద్ధి శాఖ సహాయ మంత్రి కమలేష్ పాశ్వాన్ ఇచ్చిన లిఖిత పూర్వక సమాధానంలో ఈ తొలగింపు వివరాలున్నాయి. జాబ్ కార్డుల తొలగింపు ఎంజిఎన్ఆర్ఇజిఎస్ నిబంధనల ప్రకారం రాష్ట్ర ప్రభుత్వాలు నిర్వహించే ఒక సాధారణ ప్రక్రియ అని మంత్రి తెలిపారు. ఎలక్ట్రానిక్ నో- యువర్- కస్టమర్ (ఇ-కెవైసి) వంటి డిజిటల్ ధ్రువీకరణ అవసరాలు వంటి అంశాలు తొలగింపులకు కారణం కాదన్నారు. సవరణ బిల్లుపై ఇప్పటికే ఆందోళన చేస్తున్న ప్రతిపక్ష పార్టీలు ఈ తొలగింపులకు ఇ-కెవైసి ధ్రువీకరణల కూడా సమాన కారణంగా ఉన్నాయని విమర్శిస్తున్నాయి. దాదాపు 27 లక్షల మంది కారిక్మలను పథకం నుంచి తొలగించడానికి ఇ-కెవైసి నిబంధనలు కఠినతరం చేయడమే కారణమని చెబుతున్నాయి. ఈ పథకంలో ఇప్పటి వరకూ దాదాపు 99.7 శాతం కార్మికుల రికార్డులను ఆధార్ సీడింగ్ ద్వారా ఇ-కెవైసి పూర్తయిందని మంత్రి సమాధానంలో తెలిపారు.

రాష్ట్రంలోనే అత్యధికుల తొలగింపు

దేశంలో తొలగించిన ఉపాధి హామీ కార్మికుల్లో రాష్ట్ర కార్మికులే అత్యధికం. ఆంధ్రప్రదేశ్‌లో 11,07,339 మంది, తెలంగాణలో 95,084 మంది, ఒడిశాలో 80,896 మంది, జమ్మూకాశ్మీర్‌లో 79,070, చత్తీస్‌గఢ్‌లో 65,619 మంది, తమిళనాడులో 33,090 మంది, కర్ణాటకలో 27,004 మంది, కేరళలో 20,124 మంది, ఉత్తరప్రదేశ్‌లో 17,236 మంది, పంజాబ్‌లో 16,898 మంది, మహారాష్ట్రలో 15,061 మంది, రాజస్థాన్‌లో 13,701 మంది ఉపాధిహామీ కార్మికుల్ని తొలగించారు. కేంద్రంలోని మోడీ ప్రభుత్వానికి ఆక్సిజన్ అందిస్తున్న టిడిపి నేతృత్వంలోని కూటమి పాలనలో రాష్ట్రంలో ఉపాధి హామీ కార్మికుల పొట్టకొట్టడం గమనార్హం. విబి-జి ఆర్ఎఎం జి అమల్లోకి రాకముందే కేంద్రం ఈ పథకాన్ని నిర్వీర్యం చేయడానికి లక్షలాది మందిని ఉపాధికి దూరం చేయడాన్ని పలువురు విమర్శిస్తున్నారు.

ఎస్‌హెచ్ఎఎన్‌టిఐ చట్టాన్ని ట్రంప్ చట్టం అని పిలవొచ్చు : జైరామ్ రమేష్

న్యూఢిల్లీ : అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌తో సంబంధాలను పునరుద్ధరించే లక్ష్యంతో అణు నష్టానికి పౌర బాధ్యత చట్టం 2010లోని కీలక నిబంధనలను కేంద్రం తొలగించిందని కాంగ్రెస్ ఎంపి జైరామ్ రమేష్ విమర్శించారు. అందువల్ల ఎస్‌హెచ్ఎఎన్‌టిఐ చట్టాన్ని ట్రంప్ చట్టంగా పిలవవచ్చునని అన్నారు. 'అమెరికా ఆర్థిక సంవత్సరం 2026 కోసం జాతీయ రక్షణ అధికార చట్టంపై అధ్యక్షుడు ట్రంప్ ఇప్పుడే సంతకం చేశారు. ఈ చట్టం 3,100 పేజీలు ఉంది. 1912వ పేజీలో అణు బాధ్యత నియమాలపై అమెరికా, భారత్‌ల మధ్య ఉమ్మడి అంచనాకు సంబంధించిన ప్రస్తావన ఉంది' అని రమేష్ శుక్రవారం పేర్కొన్నారు. ఈ వారం ప్రారంభంలో ప్రధాన మోడీ పౌర అణు నష్ట పౌర బాధ్యత చట్టం 2010లోని కీలక నిబంధనలను తొలగిస్తూ, ఎస్‌హెచ్ఎఎన్‌టిఐ బిల్లును పార్లమెంటులో ఎందుకు ప్రవేశపెట్టారో ఇప్పుడు తెలుస్తుందన్నారు.

మహా జంగిల్ రాజ్ నుంచి విముక్తి అవసరం : మోడీ

కోల్‌కతా : పశ్చిమ బెంగాల్ ప్రజలకు మమతా బెనర్జీ పాలన (మహా జంగిల్‌రాజ్) నుండి విముక్తి అవసరమని ప్రధాని మోడీ వ్యాఖ్యానించారు. గత నెలలో బీహార్ ప్రజలు ఎన్‌డిఎకు భారీ విజయాన్ని అందించారని అన్నారు. ఇప్పుడు పశ్చిమ బెంగాల్ ప్రజలకు మమతాబెనర్జీ మహా ఆటవిక పాలన నుండి విముక్తి అవసరమని చెప్పారు. శనివారం తాహెర్పూర్ బహిరంగ సభలో మోడీ పాల్గొనాల్సి ఉంది. దట్టమైన పొగ మంచు కారణంగా ఆయన హెలికాప్టర్ వేదిక వద్దకు చేరుకోలేకపోయింది. దీంతో ఆయన జనాన్ని ఉద్దేశించి వర్చువల్‌గా ప్రసంగించారు. ఎస్ఐఆర్‌ను వ్యతిరేకిస్తూ తృణమూల్ కాంగ్రెస్ అక్రమ చొరబాటుదారులను రక్షిస్తోందని, 'గో బ్యాక్ మోడీ' అని నినాదాలు చేస్తుందని అన్నారు.

ఏ దేశం ఇతరులపై పెత్తనం చేయకూడదు : ఎస్ జైశంకర్

పూణే : ఒక దేశం శక్తిమంతమైన దేశమైనంత మాత్రాన అది తన ఇష్టాలను ఇతరులపై రుద్దడం, పెత్తనం చేయడం సరికాదని భారత విదేశాంగశాఖ మంత్రి ఎస్ జైశంకర్ అన్నారు. ప్రపంచీకరణ మన ఆలోచన, పని విధానాల్లో ఎన్నో మార్పులు తీసుకువచ్చిందని అన్నారు. శనివారం మహారాష్ట్రలోని పూణేలో గల సింబయోసిస్ ఇంటర్నేషనల్‌లో జరిగిన స్నాతకోత్సవంలో కేంద్రమంత్రి మాట్లాడారు. ప్రపంచవాప్తంగా ఆర్థిక, రాజకీయ వ్యవస్థలో గణనీయమైన మార్పులు చోటుచేసుకుంటున్నాయని, అనేక అధికార కేంద్రాలు ఉద్భవించాయని అన్నారు. అధికారం అనేదానికి ఎన్నో అర్థాలుంటాయనీ, వాణిజ్యం, మిలటరీ, ఇంధనం, సాంకేతికత, ప్రతిభ ఆధారంగా అవి మారుతుంటాయని వివరించారు. ఈ అధికారం ఏ ఒక్క దేశానికీ పరిమితం కాదని, ఈ విషయాన్ని గ్లోబల్ పవర్స్ గుర్తించాల్సిన అవసరం ఉందని అన్నారు. ఎంత శక్తిమంతమైన దేశమైనా సరే అది తన ఇష్టాలను ఇతరులపై రుద్దలేదని, ప్రపంచ దేశాల మధ్య సహజమైన పోటీ ఉందని కేంద్ర మంత్రి చెప్పారు. ఇరుపక్షాల మధ్య చర్చలు జరుగుతుండగానే ట్రంప్ భారత్ వస్తువులపై టారిఫ్‌ను రెట్టింపు చేసి 50 శాతానికి పెంచి, వాటిని ఆయుధంగా వాడుకుంటున్నారని అన్నారు.

ప్రయాణికుడిపై ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్ పైలట్ దాడి

ఢిల్లీ : ప్రయాణికుడిపై ఎయిరిండియా ఎక్స్‌ప్రెస్ పైలట్ దాడికి పాల్పడిన ఘటన ఢిల్లీలోని ఇందిరాగాంధీ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టులో శుక్రవారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. ప్రయాణికుడు అంకిత్ దేవాన్ స్పైస్‌జెట్ ఫ్లైట్‌లో తన భార్య, ఏడేళ్ల కుమార్తె, 4 నెలల పసిబిడ్డతో స్త్రోలర్‌లో వెళ్లేందుకు సెక్యూరిటీ చెక్ లైన్ వద్దకు చేరుకున్నాడు. అప్పుడే డ్యూటీ నుంచి దిగిన ఎయిరిండియా కెప్టెన్ వీరేందర్ సేజ్వాల్ వారిని దాటి ముందుకు వెళుండగా అంకిత్ తీవ్ర అభ్యంతరం చెప్పడంత వివాదం చెలరేగింది. సేజ్వాల్ సహనం కోల్పోయి అంకిత్‌పై దాడికి పాల్పడ్డాడు. అంకిత్ రక్తం కారుతుండగానే ఎక్స్ వేదికగా షేర్ చేశాడు. ఎయిరిండియా పైలట్ సేజ్వాల్‌ను విధుల నుంచి సస్పెండ్ చేస్తూ.. ఘటనపై విచారణకు ఆదేశించింది.

గగన్‌యాన్ దిశగా కీలక అడుగు

- డ్రోగూ పారాచూట్ పరీక్షలు విజయవంతం : ఇస్రో

బెంగళూరు : గగన్‌యాన్ మిషన్‌కు ఉపయోగించే డ్రోగూ పారాచూట్ విస్తరణ (డిప్లాయ్‌మెంట్) పరీక్షలు విజయవంతమయ్యాయని ఇస్రో శనివారం ప్రకటించింది. గగన్‌యాన్ సిబ్బంది ప్రయాణించే మాడ్యూల్‌కు వేగాన్ని తగ్గించే వ్యవస్థను అభివృద్ధిపరచడం కోసం డ్రోగూ పారాచూట్‌లకు వరుసగా క్వాలిఫికేషన్ పరీక్షలు నిర్వహించారు. అవన్నీ విజయవంతంగా పూర్తయ్యాయని ఇస్రో ఒక ప్రకటనలో పేర్కొంది. చండీఘడ్‌లోని టెర్మినల్ బాలిస్టిక్ రీసెర్చ్ లేబరేటరీ (టిబిఆర్ఎల్)లో ఈ నెల 18, 19 తేదీల్లో రైల్ ట్రాక్ రాకెట్ స్లెడ్ (ఆర్‌టిఆర్ఎస్) కేంద్రంలో ఈ పరీక్షలన్నీ పూర్తి చేసినట్లు తెలిపింది. వేగాన్ని తగ్గించే వ్యవస్థలో నాలుగు తరహాలకు చెందిన మొత్తం పది పారాచూట్లు వుంటాయని తెలిపింది. అపెక్స్ కవర్ సెపరేషన్ పారాచూట్స్‌తో వేగం తగ్గింపు ప్రక్రియ మొదలవుతుంది. పారాచూట్ కంపార్ట్‌మెంట్‌కు రక్షణగా వుండే కవర్‌ను తొలుత తొలగిస్తారు. ఆ తర్వాత రెండు డ్రోగూ పారాచూట్‌లు విస్తరిస్తూ మాడ్యూల్ వేగాన్ని తగ్గించి, సుస్థిరంగా నిలుపుతాయని ఇస్రో ప్రకటన పేర్కొంది. ఈ మొత్తం వ్యవస్థలో కీలకమైన అంశం డ్రోగూ పారాచూట్‌లు విస్తరించడమని తెలిపింది. దీంతో, మానవ రోదసీ ప్రయాణానికి అర్హమైన పారాచూట్ వ్యవస్థ దిశగా గణనీయమైన అడుగుపడిందని ఆ ప్రకటన పేర్కొంది.

ఉపాధి హామీపై 'మోడీ' బుల్డోజర్

- కాంగ్రెస్ నేత సోనియా గాంధీ
- నల్లచట్టానికి వ్యతిరేకంగా దేశవ్యాప్త పోరాటం



ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

గ్రామీణ పేదలు, వ్యవసాయ కార్మికులకు జీవనోపాధిగా ఉన్న ఉపాధి హామీ చట్టంపై మోడీ సర్కార్ బుల్డోజర్ నడిపిందని కాంగ్రెస్ అగ్రనేత సోనియా గాంధీ విమర్శించారు. మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం (ఎంజిఎన్ఆర్ఈజిఎ) పేరు మార్పుపై ఆమె తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం కొత్తగా తీసుకొచ్చిన వికసిత్ భారత్ గ్యారెంటీ ఫర్ రోజ్‌గార్ అండ్ జీవికా మిషన్ (గ్రామీణ్) (విబి-జి ఆర్ఎఎం జి) బిల్లుపై శనివారం ఆమె వీడియో విడుదల చేశారు. మహాత్మాగాంధీ పేరును ఉద్దేశపూర్వకంగానే కేంద్రం తొలగించిందని, ఉపాధి హామీ చట్టం రూపురేఖలను కుట్రపూరితకంగా మార్చేసిందని అన్నారు. ఎలాంటి సంప్రదింపులు, చర్చలు లేకుండా, భాగస్వాములతో సంప్రదింపులు జరపకుండా, ప్రతిపక్షాలను పరిగణనలోకి తీసుకోకుండా కేంద్రం కుట్రపూరితంగా ఈ మార్పులు చేసిందని విమర్శించారు. పార్లమెం టులో ఏకాభిప్రాయంతో ఆమోదించిన ఉపాధి హామీ చట్టం విప్లవాత్మకమైన అడుగు అని, అత్యంత పేదలు, అణగారిన వర్గాల ఉపాధికి చట్టపరమైన హక్కు లభించిందని, మహాత్మాగాంధీ కలల సాకారానికి దోహదపడిందని పేర్కొన్నారు.

నల్ల చట్టానికి వ్యతిరేకంగా పోరాటం

ప్రభుత్వం తీసుకువచ్చిన నల్లచట్టానికి వ్యతిరేకంగా పోరాడేందుకు తనతోపాటు దేశవ్యాప్తంగా ఉన్న లక్షలాది మంది పార్టీ కార్యకర్తలు సిద్ధంగా ఉన్నారని సోనియాగాంధీ అన్నారు.

భారీ భద్రత మధ్య ఉస్మాన్ హాదీ అంత్యక్రియలు

- అత్యవసరమైతే తప్ప బయటకు రావద్దు : భారత్



ఢాకా : బంగ్లాదేశ్ యువ నేత, ఇంక్విలాబ్ మంచో సంస్థ కన్వీనర్ షరీఫ్ ఉస్మాన్ హాదీ అంత్యక్రియలు శనివారం కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్ల మధ్య జరిగాయి. ఈ పరిస్థితుల్లో ఢాకాలో ఎలాంటి సంఘటనలు జరగకుండా భద్రతా సిబ్బంది అలర్ట్ అయ్యారు. ఆయన మృతదేహాన్ని ఊరేగింపుగా తీసుకెళుతున్న మార్గంలో పోలీసులు కట్టుదిట్టమైన చర్యలు తీసుకున్నారు. అంత్యక్రియలకు ముందుగా పార్లమెంటు భవనంలో హాదీ మృతదేహాన్ని వుంచి ప్రార్థనలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బంగ్లాదేశ్ తాత్కాలిక ప్రధాన సలహాదారు మహమ్మద్ యూనస్, ఆర్మీ చీఫ్ వాకర్ ఉజ్ జమన్‌లతో పాటు సలహా మండలి సభ్యులు హాజరయ్యారు. ప్రార్థనలకు ముందు యూనస్ కొద్దిసేపు ప్రసంగించారు. బిఎన్‌పి, ఎన్‌సిపిల తరపున కూడా కొందరు నేతలు హాజరయ్యారు. ప్రభుత్వం చేసిన ప్రకటనకు అనుగుణంగా ప్రజల సందర్శనార్థం భౌతికకాయాన్ని వుంచలేదని, కొద్దిమందిని మాత్రమే చూసేందుకు అనుమతించామని పోలీసు ఉన్నతాధికారి ఒకరు తెలిపారు. ప్రార్థనా సమావేశాల్లో వేలాదిమంది ప్రజలు పాల్గొన్నారు.

భారత హైకమిషన్ సూచన


ప్రస్తుతం దేశంలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్న నేపథ్యంలో అత్యవసరమైతే తప్ప బయటకు రావద్దని అక్కడి భారతీయులకు భారత హై కమిషన్ సూచించింది. ప్రస్తుత పరిస్థితులపై భారత్, బంగ్లాదేశ్ ఆర్మీ చీఫ్‌లు ఫోన్లో మాట్లాడుకున్నారని సంబంధిత వర్గాలు తెలిపాయి.

విదేశీ వలసల బిల్లును తక్షణమే రద్దు చేయాలి : సిడబ్ల్యుఎఫ్ఐ

న్యూఢిల్లీ : విదేశీ వలసల (సులభతరం, సంక్షేమం) బిల్లు 2025ను భారత నిర్మాణ రంగ కార్మిక సమాఖ్య (సిడబ్ల్యుఎఫ్ఐ) తీవ్రంగా వ్యతిరేకించింది. మొత్తంగా భారత కార్మికులను ముఖ్యంగా వలస నిర్మాణ కార్మికులను ఒక సరుకుగా మార్చడాన్ని వ్యవస్థీకృతం చేసే ఈ బిల్లు తిరోగమన చర్య అని విమర్శించింది. తక్షణమే ఈ బిల్లును రద్దు చేయాలని డిమాండ్ చేసింది. ఈ బిల్లు కార్మికులను రక్షించాల్సిన బాధ్యతల నుండి ప్రభుత్వం వెనక్కి మళ్లడంగా సిడబ్ల్యుఎఫ్ఐ పరిగణిస్తోందని సమాఖ్య ప్రధాన కార్యదర్శి యు.పి.జోసెఫ్ పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. గతంలో కన్నా ఎక్కువగా భారత వలస కార్మికులు ఆర్థిక వ్యవస్థకు మరింత కీలకంగా మారిన తరుణంలో ఈ బిల్లు వచ్చిందన్నారు. 2025 ఆర్థిక సంవత్సరంలో రికార్డు స్థాయిలో 135.4 బిలియన్ల డాలర్ల మొత్తాలు భారత్‌కు పంపుతారని భావిస్తున్నారంటే ఈ విషయం స్పష్టమవుతోందన్నారు. అంటే దేశ వాణిజ్య లోటులో దాదాపు 47శాతాన్ని ఇది భర్తీ చేస్తోందన్నారు. ఇంత పెద్దఎత్తున దేశ ఆర్థిక వ్యవస్థకు దోహదపడుతున్న వారిని కనీసం హక్కులు గల పౌరులుగా గుర్తించడానికి బదులుగా కేవలం 'డిస్పోజబుల్ అసెట్స్‌'గా వ్యవహరించడం విచారకరమని ఆ ప్రకటన పేర్కొంది. ప్రస్తుత రూపంలో ఈ బిల్లును పార్లమెంట్ సమావేశాల్లో ప్రభుత్వం ప్రవేశపెట్టరాదని సిడబ్ల్యుఎఫ్ఐ కోరింది. తక్షణమే ఈ బిల్లును ఉపసంహరించుకోవాలని విజ్ఞప్తి చేసింది.

సిరియాపై అమెరికా భారీ వైమానిక దాడులు

- ఇది యుద్ధం కాదు ప్రతీకారం : ట్రంప్



ఈశాన్య సిరియాలో అమెరికన్ బ్రాడ్లీ యుద్ధ వాహనాలు

వాషింగ్టన్ : సిరియాపై అమెరికా వైమానిక దాడులు చేసింది. ఎఫ్15, ఎఫ్ 16, ఎ10 వంటి యుద్ధ విమానాలతో విధ్వంసం సృష్టించింది. ఈ దాడులను అమెరికా అధ్యక్షులు ట్రంప్ నిర్ధారించారు. ఇటీవల సిరియాలోని పామిరా నగరంలో ఇద్దరు అమెరికన్ సైనికులను ఐసిస్ హతమార్చింది. అనంతరం సిరియాలోని ఐసిస్ (ఐఎస్ఐఎస్) కు చెందిన 70కు పైగా కార్యాలయాలు, ఆయుధ డంప్‌లపై భారీ దాడులు చేసింది. "సిరియాలో ధైర్యవంతులైన అమెరికన్ దేశభక్తులను ఐసిస్ దారుణంగా హత్య చేసినందున.. దానికి కారణమైన హంతక ఉగ్రవాదులపై నేను వాగ్దానం చేసినట్లుగానే అమెరికా చాలా తీవ్రమైన ప్రతీకారం తీర్చుకుంటుందని నేను ప్రకటిస్తున్నాను' అని ట్రంప్ శుక్రవారం తన ట్రూత్ సోషల్‌లో తెలిపారు. ఈ దాడులను సిరియా విదేశాంగ మంత్రిత్వశాఖ కూడా ధృవీకరించింది. అంతకుముందు, అమెరికా రక్షణ కార్యదర్శి పీట్ హెగ్సేత్ 'ఐసిస్ మౌలిక సదుపాయాలు, ఆయుధ ప్రదేశాలను' లక్ష్యంగా చేసుకుని దాడులు జరిగాయని ప్రకటించారు. 'ఇది యుద్ధం కాదు - ఇది ప్రతీకారం' అని ఆయన సోషల్ మీడియాలో పేర్కొన్నారు. అయితే ఐసిస్ ఉగ్రవాద కార్యకలాపాలను విస్తరించుకుంది. దాని పేరుతో సిరియాలో అనేక సంవత్సరాల నుండి వేలాది మంది సైనికులను అమెరికా మోహరించింది. తన సైనిక స్థావరాలను ఏర్పాటు చేసుకుని సమాంతర ప్రభుత్వాన్ని నడుపుతూ అక్కడి చమురు, నిక్షేపాలపై ఆధిపత్యం చేస్తుందని పలువురు భావిస్తున్నారు.

గ్రామీణ ఉపాధి హామీతో కూలీల కొరత వచ్చిందా?

(మొదటిపేజి తరువాయి)

తీరప్రాంతాల్లో లేదా సముద్రాల్లో చేపల వేట.

మిగిలిన 13 వ్యవసాయేతర వృత్తులు - ప్లంబర్, ఎలక్ట్రీషియన్, తాపీ మేస్త్రి, నేత కార్మికుడు, బంగారు పని, కార్పెంటర్, ట్రాక్టర్ / తేలికపాటి మోటార్ వాహన డ్రైవర్, బీడీ తయారీ కార్మికుడు, వెదురుబుట్టలు అల్లేవారు, చేతివృత్తుల పనులు, పోర్టర్, నిర్మాణ కార్మికుడు, స్వీపర్. పైన దాన్ని బట్టి చూసినట్లైతే మొత్తమ్మీద గ్రామీణ వేతనాల కంటే వ్యవసాయ వేతనాలు బాగా పెరిగాయి. ఇందులో కూడా, ఆ నామమాత్రపు వేతనాల పెరుగుదల, ద్రవ్యోల్బణంతో సమానంగా వుంది. వేతనాల్లో గణనీయంగా పెరుగుదల ఈ డేటాలో ఎక్కడా కనిపించడం లేదు. కనీసం మోడీ ప్రభుత్వ హయామైన గత పదేళ్లలో కూడా అటువంటి పెరుగుదలేమీ లేదు. ఎంజిఎన్ఆర్ఇజిఎ అమల్లో వున్నప్పటికీ ఇదే పరిస్థితి నెలకొంది.

గ్రామీణ వేతన వృద్ధి మందకొడిగా ఎందుకు వుంది?

గ్రామీణ భారతంలో మహిళల కార్మిక శక్తి ప్రాతినిధ్యం రేటు (ఎల్ఎఫ్‌పిఆర్) పెరగడం ఒక కారణం కావచ్చు. 15 ఏళ్ల అంతకు పైబడిన వారి జనాభాలో నిర్దిష్టంగా ఒక సంవత్సరంలో సాపేక్షంగా దీర్ఘకాలం పాటు పనిచేస్తున్న లేదా పని కోసం ఎదురుచూస్తున్న వారి శాతాన్ని ఎల్ఎఫ్‌పిఆర్ తెలియజేస్తుంది. అధికారిక పీరియాడిక్ లేబర్ ఫోర్స్ సర్వే (జులై - జూన్ కాలానికి) ప్రకారం, 2017-18లో అఖిల భారత గ్రామీణ మహిళా ఎల్ఎఫ్‌పిఆర్ కేవలం 24.6శాతంగా వుంది. 2018-19లో ఇది 26.4 శాతానికి పెరిగింది. 2019-20లో 33 శాతానికి, 2020-21లో 36.5 శాతం, 2021-22లో 36.6శాతం, 2022-23లో 41.5శాతం, 2023-24లో 47.6 శాతానికి పెరిగింది. గ్రామీణ మహిళా ఎల్ఎఫ్‌పిఆర్ బాగా పెరగడానికి ప్రధాన కారణం మోడీ ప్రభుత్వం తీసుకొచ్చిన ఉజ్వల, హర్ ఘర్ జల్, సౌభాగ్య, స్వచ్ఛ భారత్ వంటి పథకాలని 2023-24 సంవత్సరానికి ఆర్థిక మంత్రిత్వ శాఖ చేసిన ఆర్థిక సర్వే పేర్కొంటోంది. పరిశుద్ధమైన వంట ఇంధనం, విద్యుత్, పైపుల ద్వారా తాగునీరు, టాయిలెట్లు వంటివి గ్రామీణ ప్రాంతాల్లో మహిళలకు విస్తృతంగా అందుబాటులోకి వచ్చాయని, అందువల్ల వారు కట్టెలను, పేడను సేకరించడం లేదా నీళ్లకు వెళ్లడం వంటి పనులకు వెళ్లాల్సిన అవసరం లేకుండా పోవడంతో, కొంత సమయం దొరికిందని ఆ సర్వే చెప్పుకుంది. ఇంటి పనుల్లో సమయం, శ్రమ ఆదా కావడంతో ఆ శక్తిని వారు ఉపాధి, మరింత ఉత్పాదక పనులకు ఉపయోగించుకున్నారని పేర్కొం ది. ఫలితంగా గ్రామీణ కార్మిక శక్తి పెరగడానికి దారి తీసిందని, ఫలితంగా మరింతమంది అదే వేతనానికి లేదా అంతకంటే తక్కువ రేట్లకే పనులు చేయడానికి ముందుకు రావడం వల్ల గ్రామీణ వేతనాలపై ఒత్తిడి తగ్గిందని ఆర్థికవేత్తలు పేర్కొంటున్నారు. ఒక్క మాటలో చెప్పాలంటే ఎంజిఎన్ఆర్ఇజిఎ, పొలాల్లో కార్మికుల కొరతను సృష్టించిందనడానికి ఎటువంటి ఆధారాలేవీ లేవు.

బిఎస్ఎఫ్ నియామకాల్లో అగ్నివీరులకు కోటా పెంపు

న్యూఢిల్లీ : సరిహద్దు భద్రతా దళం నియామకాల్లో అగ్నివీరులకు సంబంధించిన నిబంధనలను సవరిస్తూ కేంద్ర హోంమంత్రిత్వ శాఖ నోటిఫికేషన్ జారీచేసింది. బిఎస్ఎఫ్ కానిస్టేబుళ్ల నియామకాల్లో ఇప్పటివరకు 10 శాతంగా అగ్నివీరుల రిజర్వేషన్ కోటాను 50 శాతానికి పెంచినట్టు పేర్కొన్నది. మొదటి దశలో మాజీ అగ్నివీరులకు కేటాయించిన 50 శాతం ఖాళీలకు, రెండో దశలో మాజీ అగ్నివీరులు కాకుండా మిగిలిన (పది శాతం మాజీ సైనికులతో సహా) ఖాళీలకు నియామకాలు నిర్వహిస్తామని నోటిఫికేషన్‌లో స్పష్టం చేసింది. మొదటిదశలోని ఒక నిర్దిష్ట విభాగంలో మాజీ అగ్నివీరులతో కాకుండా స్టాఫ్ సెలక్షన్ కమిషన్ ద్వారా నియామకాలు చేపట్టినట్టు తెలిపింది. త్రివిధ దళాల్లో నియామకాలకు సంబంధించి 2022 జూన్‌లో కేంద్ర ప్రభుత్వం అగ్నిపథ్ పథకాన్ని ప్రవేశపెట్టిన విషయం విదితమే. అగ్నివీరులుగా వారి నాలుగేళ్ల సర్వీస్ ముగిసిన అనంతరం రిజర్వేషన్ ద్వారా కేంద్ర పారామిలటరీ బలగాల్లో వారిని నియమించుకుంటున్నారు.

'ఉపాధి హామీ' కోసం దేశవ్యాప్త ఉద్యమం

(మొదటిపేజి తరువాయి)

ఏర్పాటు చేస్తే ఆ ప్రాంతం అభివృద్ధి చెందుతుందని, వలసలు తగ్గుతాయని తెలిపారు. ఇండస్ట్రియల్ పాలసీలో రాయలసీమ ప్రాంతానికి ప్రాధాన్యత ఇవ్వాలని పేర్కొన్నారు. ఇప్పటి వరకూ ఉన్న ముఖ్యమంత్రుల్లో ఎక్కువమంది ఆ ప్రాంతం వారేనని, రాష్ట్రం విడిపోయిన తరువాత ఉన్న ముఖ్యమంత్రులిద్దరూ ఆ ప్రాంతంవారేనని, కానీ అక్కడ అభివృద్ధిపై దృష్టి సారించడం లేదని తెలిపారు.

వైద్యకళాశాలల పూర్తి ప్రైవేటీకరణ

మెడికల్ కళాశాలల విషయంలో ప్రభుత్వం అనుసరిస్తున్న విధానం మరింత ప్రమాదకరమని రాఘవులు తెలిపారు. ఖర్చంతా ప్రభుత్వం వెచ్చించి ప్రైవేటు వ్యక్తులకు అప్పగిస్తున్నారని, నిర్వహణ కూడా ప్రభుత్వమే చేపడుతుందని చెప్పడం మరింత నష్టమని తెలిపారు. సిఎం, మంత్రులు వైద్యకళాశాలలు ప్రభుత్వమే నిర్వహిస్తుందని పదేపదే చెబుతున్నారని, అలాంటప్పుడు ప్రైవేటు వ్యక్తులకు ఎందుకు అప్పగిస్తున్నారని ప్రశ్నించారు. వైద్యం, విద్య ప్రజల హక్కుగా ఉండాలని, పిపిపి వల్ల అటువంటి హక్కులు కోల్పోతారని తెలిపారు. ప్రభుత్వం అనుసరిస్తున్న పద్ధతి వైద్యకళాశాలల పూర్తి ప్రైవేటీకరణకు మొదటి మెట్టని దీన్ని తాము వ్యతిరేకిస్తున్నామని అన్నారు.

జీరాంజీతో దళితులు, బలహీనవర్గాలకు తీవ్రనష్టం

ఉపాధిహామీ చట్టం స్థానంలో జీరాంజీ పథకం తీసుకురావడం సరికాదని, దీనిపై రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి లేఖ రాయాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు సూచించారు. రాష్ట్రంలో వ్యవసాయ కార్మికులు, పేదలు, గ్రామీణ కూలీలు ఎక్కువమంది ఉన్నారని, కొత్త పథకం వల్ల వారందరికీ ఉపాధి పోతుందని తెలిపారు. రాయలసీమలోనూ, ఏజెన్సీ ప్రాంతాల్లోనూ గతంలో ఆకలిచావులు ఉండేవని, ఉపాధిహామీ వల్ల తగ్గాయని తెలిపారు. ప్రస్తుతం 50 రోజులు దొరుకుతున్న పనికి గ్యారంటీ లేకుండా పోతుందని పేర్కొన్నారు. నూతన నిబంధనల వల్ల రాష్ట్రంపై రూ.3000 కోట్ల భారం పడుతుందని వివరించారు. అయినా టిడిపి, వైసిపి నాయకులు నోరెత్తడం లేదని విమర్శిం చారు. దీనిపై కేంద్రానికి లేఖ రాయడంతోపాటు, రాష్ట్రం నుండి అఖిలపక్షాన్ని తీసుకెళ్లాలని కోరారు. దీనికి వ్యతిరేకంగా వామపక్షాలు 22వ తేదీన ఆందోళనకు పిలుపునిచ్చాయని, దీనిలో అన్ని సంఘాలూ కలిసి రావాలని కోరారు.

రెండోదశ భూసమీకరణ అనవసరం

అమరావతిలో గతంలో భూములిచ్చిన రైతులకు ఇప్పటికీ న్యాయం జరగలేదని, వారి ప్లాట్లు ఎక్కడ ఉన్నాయో కూడా చూపించలేదని, ఇటువంటి సమయంలో రెండోదశ భూ సమీకరణ అనవసరమని శ్రీనివాసరావు తెలిపారు. టిడిపి కూటమి అధికారంలోకి వచ్చిన తరువాత ఎక్కువ ఆనందపడింది అమరావతి రైతులని, ఇప్పుడు వారే ఎక్కువ బాధపడుతున్నారని, ప్రస్తుతం వారి పరిస్థితి త్రిశంకుస్వర్గంలో ఉందని పేర్కొన్నారు. తాము 30 ఏళ్లు అధికారంలో ఉంటామని పదేపదే సిఎం చెబుతున్నారని, ఈ ఐదేళ్లలోనే అమరావతిలో అభివృద్ధి చేసి, రైతులకు నమ్మకం కలిగించాలని తెలిపారు. పైగా నిర్మాణాల పేరుతో అప్పులు తెచ్చి ప్రజలనెత్తిన రుద్దుతున్నారని విమర్శించారు. ప్రభుత్వాలు ఇప్పటికైనా స్పందించి అమరావతి రాజధానిలో ప్రస్తుతం ఉన్న భూమిని అభివృద్ధి చేయాలని, రెండోదశ సమీకరణ నిర్ణయాన్ని వెనక్కు తీసుకోవాలని సూచించారు.

జనవరి26 నాటికి రోడ్డుపై చెత్త కనిపించకూడదు

(మొదటిపేజి తరువాయి)

కావాలని పిలుపునిచ్చారు. స్వచ్ఛ రథాలు తీసుకొచ్చామని తెలిపారు. ప్లాస్టిక్, ప్లాస్టిక్ బాటిళ్లు వంటివి తీసుకుని వాటి విలువకు సరిపడా సరుకులు అందిస్తున్నారని, వ్యర్థాల నుంచి సంపద సృష్టించడం చాలా సంతోషమని అన్నారు. చెత్తను కంపోస్ట్‌గా తయారు చేసి రైతులకు విక్రయిస్తున్నామని తెలిపారు. గతంలో ఎక్కువ రసాయనాలు వాడే రైతులు నేడు కంపోస్ట్ ఎరువులు వాడి అధిక ఉత్పత్తులు సాధిస్తున్నారన్నారు. ప్రస్తుతం 25 ప్రాంతాల్లో స్వచ్ఛ రథాలు పని చేస్తున్నాయని, వీటి ద్వారా పొడిచెత్తను సేకరిస్తున్నామని, వీటి సంఖ్య త్వరలో వందకు చేరుతుందని తెలిపారు. సూపర్ సిక్స్ పథకాలు అమలు చేసి ప్రజల రుణం తీర్చుకున్నామన్నారు. అనకాపల్లి బెల్లాన్ని సేంద్రియ బెల్లంగా మార్చడం, అరకు కాఫీకి ప్రపంచ స్థాయిలో మంచి గుర్తింపు తీసుకురావడం తమ ముందున్న లక్ష్యమని తెలిపారు. పోలవరం ఎడమ కాలువ నీటిని అనకాపల్లి ప్రజలకు అందిస్తామన్నారు. కార్యక్రమంలో భాగంగా గ్రీన్ అంబాసిడర్లను ముఖ్యమంత్రి సత్కరించారు. మంత్రులు కొల్లు రవీంద్ర, నారాయణ, స్వర్ణాంధ్ర స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్మన్ పట్టాభిరామ్, ఎంపీ సిఎం రమేష్, ఎంఎల్ఎ కొణతాల రామకృష్ణ, కలెక్టర్ విజయకృష్ణన్ పాల్గొన్నారు.

ముస్తాబు కార్యక్రమం ప్రారంభం

తాళ్లపాలెంలోని సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ పాఠశాలలో ముస్తాబు కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రారంభించారు. విద్యార్థులు వ్యక్తిగత శుభ్రత పాటించే విధానాలను తెలుసుకున్నారు. పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్ ఆలోచనతో రూపుదిద్దుకున్న ఈ మస్తాబు కార్యక్రమాన్ని రాష్ట్ర వ్యాప్తంగా అమలు చేస్తామని ప్రకటించారు. విద్యార్థులకు వ్యక్తిగత శుభ్రత, మంచి అలవాట్లు, ఆత్మవిశ్వాసం, క్రమశిక్షణ పెంచేలా ముస్తాబు కార్యక్రమాన్ని రూపకల్పన చేసినట్టు తెలిపారు. సిఎం తన పర్యటనలో భాగంగా పారిశుధ్య కార్మికులతో కలిసి సంపద సృష్టి కేంద్రాలను పరిశీలించారు. స్వచ్ఛ రథాలను జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం స్వచ్ఛ భారత్ మిషన్ 2.0 అభివృద్ధి పనుల్లో భాగంగా రూ.68.25 కోట్లతో తలపెట్టిన ప్లాస్టిక్ వ్యర్థాల నిర్వహణ యూనిట్లు, ఫీకల్ స్లెడ్జ్ శుద్ధి ప్లాంట్లు, గోబర్ దన్ ప్లాంట్లు, గ్రే వాటర్ నిర్మాణాల పనులకు శంకుస్థాపన చేశారు. వివిధ శాఖలు ఏర్పాటు చేసిన స్టాళ్లను సందర్శించారు.

ప్రభుత్వ ఉద్యోగుల పోరాటాలు

కార్మికోద్యమంలో భాగంగానే ప్రభుత్వ ఉద్యోగుల పోరాటాలను పరిశీలించాల్సిఉంది. ప్రభుత్వ ఉద్యోగులు, పారిశ్రామిక కార్మికుల మధ్య ప్రధానమైన తేడాలున్నాయి.. పారిశ్రామిక కార్మికులు ట్రేడ్ యూనియన్లను స్థాపించుకుని, అమానుషమైప పెట్టుబడిదారీ దోపిడికి వ్యతిరేకంగా నిర్విరామంగా పోరాటం సాగించి ట్రేడ్ యూనియన్ హక్కులను సాధించుకున్నారు. కాని ప్రభుత్వ ఉద్యోగులలో ఉద్యమాభివృద్ధి భిన్నంగా జరిగింది. ప్రభుత్వోద్యోగులు ప్రారంభం నుండే బ్రిటిష్ ప్రభుత్వం సృష్టించిన అనేక అవరోధాలను ఎదుర్కోవాల్సివచ్చింది.

బ్రిటన్ వలస ప్రభుత్వం 1904లో ప్రభుత్వ సేవకుల ప్రవర్తనా నియమావళిని (కాండాక్ట్ రూల్స్) రూపొందించింది. ఈ నిబంధనలు 1904లో అధికారికంగా ప్రకటించినప్పటికీ మన దేశంలో బ్రిటిష్ పాలన ప్రారంభమైనప్పటినుండే ఈ ఆంక్షల పర్వం కూడా మొదలైంది. ఈస్టిండియా (తూర్పు ఇండియా) కంపెనీ పరిపాలన ప్రారంభమైన నాటినుండి కంపెనీ ఉద్యోగుల ప్రవర్తనను, సర్వీసులను క్రమబద్దం చేస్తూ అనేక ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఈ ఉత్తర్వులలో ఉద్యోగులు రాజకీయాలలో పాల్గొనడాన్ని నిషేధించచలేదు. ఆ సమయంలో (అంటే ఈస్టిండియా కంపెనీ పాలన మన దేశంలో ప్రారంభమైనప్పుడు) అసలు రాజకీయ కార్యకలాపాలే లేకపోవడం దీనికి ప్రధాన కారణం. 1885లో భారత జాతీయ కాంగ్రెసు ఆవిర్భవించిన తరువాత రాజకీయాల్లో ప్రభుత్వ ఉద్యోగుల పాత్రను బ్రిటిష్ ప్రభుత్వం పసిగట్టింది. ఫలితంగా 1904లో 'ప్రభుత్వోద్యోగుల ప్రవర్తనా నియామావళి' జారీ అయ్యింది. ఈ నిబంధనావళిని కేంద్ర ప్రభుత్వోద్యోగులకు ప్రాంతీయ (ప్రొవెన్షియల్) ప్రభుత్వ ఉద్యోగులకు కూడ వర్తింపచేసింది. కాండాక్ట్ రూల్స్‌లో ఉద్యోగుల రాజకీయ కార్యకలాపాలపై పరిమితులు విధించడానికుద్దేశించిన 20వ క్లాజును 1905లో సవరించి మరింత కఠినతరం చేశారు. 'రాజకీయ ఉద్యమాలలో పాల్గొనడంగాని, వాటికి సహాయపడడంగాని ప్రభుత్వ ఉద్యోగులు చేయకూడదు. ' అని వీటిలో పేర్కొన్నారు.


స్వతంత్ర దేశంలో....

అప్పటి నుండి ఈ "కాండక్ట్ రూల్సు"ను లెక్కలేనన్నిసార్లు సవరించారు. ప్రభుత్వోద్యోగుల బహిరంగ సమావేశాలు, ఊరేగింపులు, సమ్మెలు తదితర కార్యకలాపాలను నిషేధిస్తూ చేసిన సవరణలతో, ఈ "కాండక్టు రూల్స్" మరింతగా పచ్చి అభివృద్ధి నిరోధక స్వభావాన్ని సంతరించుకున్నాయి. 1947లో వలసవాదులకు నూకలు చెల్లి 'స్వతంత్ర భారతదేశం' అవతరించిన తరువాత కూడా ఈ ప్రజాస్వామ్య వ్యతిరేక స్వభావం కల్గిన కాండక్ట్ రూల్స్ రద్దుకాలేదు. మన పాలకులు మరింత నీచమైన, అభివృద్ధి నిరోధకమైన సవరణలు తీసుకువచ్చారు. ఫలితంగా ప్రభుత్వ ఉద్యోగులకు రాజకీయ హక్కులు, ట్రేడ్ యూనియన్ హక్కులు లేకుండా చేశారు. ఆశ్చర్యకరమైప విషయం ఏమిటంటే సామ్రాజ్యవాదుల స్వంత దేశమైన బ్రిటన్‌లో పరిస్థితి ఇలా లేదు. అక్కడ ప్రభుత్వోద్యోగులు రాజకీయ, ట్రేడ్ యూనియన్ హక్కులు చాలా మేరకు ఉన్నాయి.

ప్రభుత్వ ఉద్యోగుల సమ్మె

1919లోనే బ్రిటనులో ప్రభుత్వ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి సంప్రదింపులు జరపడానికొక ప్రత్యేక యంత్రాంగాన్ని ఏర్పాటు చేశారు. మన దేశంలో అటువంటి ఏర్పాటేమి జరగలేదు స్వతంత్ర్యం వచ్చిన తరువాత 19 సంవత్సరాల పాటు పభుత్వోద్యోగులు అనేక పోరాటాలు, ఆందోళనలు సాగించాల్పివచ్చింది. 1960వ సంవత్సరంలో ప్రభుత్వ ఉద్యోగుల దేశ వ్యాప్త సమ్మె తరువాత మాత్రమే 1966లో కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులతో సంప్రదింపులు జరపడానికి ప్రభుత్వం జాయింట్ కన్సల్టేటివ్ మెషినరీ (జెసిఎం)ను ఏర్పాటు చేసింది. అయినా వేతనాల సమస్య పరిష్కారం కాకపోవడంతో 19.09.1968న కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు దేశ వ్యాప్తంగా ఒక్కరోజు టోకెన్ స్ట్రైక్‌ను నిర్వహించారు. దీనిపై అప్పటి కేంద్ర ప్రభుత్వం పెద్ద ఎత్తున ఉక్కు పాదం మోపింది. ఎస్మా ప్రయోగించి వేలాది మందిని జైళ్లపాలు చేసింది. అయితే, నంబూద్రిపాద్ నేతృత్వంలోని కేరళ వామపక్ష ప్రభుత్వం సమ్మె చేస్తున్న ఉద్యోగులను అరెస్ట్ చేసేది లేదని ప్రకటించింది. ఆదేశాలు అమలు చేయకపోతే ప్రభుత్వాన్ని రద్దు చేస్తామంటూ కేంద్రం హెచ్చరించినా కేరళ ప్రభుత్వం ఖాతరు చేయలేదు. 16.10.68న ఢిల్లీలోని హోంమంత్రి కార్యాలయం ముందు సెంట్రల్ గవర్నమెంట్ క్లర్క్స్ యూనియన్ వేలాదిమందితో నిర్వహించిన 'భోజన విరామ సమయ నిరసన' కార్యక్రమం దేశ వ్యాప్తంగా కలకలం రేపింది. కొన్ని ఆంగ్ల పత్రికలు 'పులి గుహ ముందు' (ఎట్ ది టైగర్స్ డెన్) అంటూ ఈ కార్యక్రమానికి సంబంధించిన నిరసన వార్తలను ప్రచురించాయి. ప్రారంభంలో రైల్వేలు ప్రైవేటు యాజమాన్యం కింద ఉండటంతో రైల్వే కార్మికులు యూనియన్లను ఏర్పాటు చేసుకున్నారు. రైల్వేలను జాతీయం తరువాత కూడా రైల్వే కార్మికులు గతంలో సాధించుకున్న హక్కులు, సదుపాయాలను ప్రభుత్వం పూర్తిగా హరించ లేకపోయింది. ఇదే విధంగా దేశంలోని ఇతర ప్రాంతాలలో ప్రాంతీయ ప్రభుత్వోద్యోగుల సంఘాలు అభివద్ధి చెందసాగాయి. కాని ఈ సంఘాలు ట్రేడ్ యూనియన్ స్వభావాన్ని సంతరించుకోలేక పోయాయి. ఈ సంఘాలు కేంద్ర కార్మికసంఘానికి అనుబంధం చేయలేదు. ప్రభుత్వ నిబంధనలే దీనికి కారణం. అనేక పోరాటాల ఫలితంగా ప్రస్తుతం పరిస్థితి చాలా మారింది. వివిధ యూనియన్లు, సమాఖ్యల ద్వారా సంఘటితమ్మైన ఆఫీసు ఉద్యోగులు కేంద్ర కార్మిక సంఘాలలోని పారిశ్రామిక కార్మికులతో కలిసి దేశ వ్యాప్తంగా ఐక్య పోరాటాలలో పాల్గొంటున్నారు.

- ఫీచర్స్ అండ్ పాలిటిక్స్



16.10.68న కేంద్ర హోంమంత్రి కార్యాలయం ముందు జరిగిన భారీ నిరసన. 'ఎట్ ది టైగర్స్ డెన్' అన్న శీర్షికతో ఒక ఆంగ్ల పత్రికలో ప్రచురుణ

లేబర్‌కోడ్‌లు
అసత్య ప్రచారాలు ...వాస్తవాలు

ప్రచారం

లేబర్ కోడ్‌లతో మహిళా కార్మికులకు సమాన అవకాశాలు

వాస్తవం

- పనిచేసే స్థలంలో భద్రతను నిర్ధారించడానికి ఎటువంటి చట్టం లేదు. దీంతో రక్షణలేని పరిస్థితుల్లో మహిళలు పనిచేయాల్సివస్తుంది
- అనమాన ఒప్పందాలు,సమాన పని చేస్తున్నా తక్కువ వేతనాలు ఇవ్వడం, ప్రసూతి ప్రయోజనాలు కల్పించకపోవడం వంటి సమస్యల పరిష్కారానికి ఎటువంటి ఏర్పాటు లేదు.
- ఆర్ఎస్ఎస్, బిజెపిల మహిళా వ్యతిరేక భావజాలం లింగ సమానత్వాన్ని ఒక నినాదం స్థాయికి మార్చేసింది.


కార్మికోద్యమ యోధులు



జేష్ట సత్తిరాజు

వివిధ దోరణుల వల్ల విశాఖపట్నంలో ట్రేడ్ యూనియన్ ఉద్యమం బాగా దెబ్బతింది. ఆ విచ్ఛినాన్ని ప్రతిఘటించి సిఐటియును అచంచల దీక్షతో ముందుకు తీసుకుపోవడంలో జేష్ట సత్తిరాజు కీలకపాత్ర పోషించారు. ఆయన 1983లో మరణించారు.

కమ్యూనిస్టుల చొరవతో
కదిలిన పారిశుద్ధ్య కార్మికులు



కనీస వేతనాలు, హక్కుల పరిరక్షణ కోసం పారిశుధ్య కార్మికులు చేస్తున్న పోరాటాలు, వారిపైన అమలవుతున్న అణచివేత విధానాలను ప్రస్తుతంచూస్తున్నాం. ఇప్పుడే కాదు. వారిపై నిర్లక్ష్య ధోరణి మొదటి నుండి కొనసాగుతోంది. 1936లో కమ్యూనిస్టులు ఈ అంశంపై దృష్టి సారించేంతవరకు వీరి సమస్యలు ప్రస్తావనకే రాలేదు. కార్మిక ఐక్యత, కార్మిక సంఘాల నిర్మాణానికి కృషి చేస్తున్న కమ్యూనిస్టు కార్యకర్తలు1936 నుండి వివధ పట్టణాల్లో పనిచేసే పారిశుధ్య కార్మికులను సంఘటితం చేసే ప్రయత్నాలు ప్రారంభించారు. వారు చేసే ఆందోళనలకు, సమ్మెలకు ఇతర రంగాల్లో పనిచేసే కార్మికుల సహాయ,సహానుభూతులను కూడగట్టే ప్రయత్నం చేశారు. అలాగే, ఇతర రంగాల కార్మికులు పోరాటాలు చేసినప్పుడు పారిశుధ్య కార్మికులను సంఘీబావంగా నిలిపారు. ఈ ఐక్యత ఫలితంగా ప్రభుత్వాలపై ఒత్తిడి పెరిగి పారిశుధ్య కార్మికుల సమస్యల పరిష్కారానికి దోహద పడింది.

కర్నూలులో తొలి కదలిక

1936 నుండి చేసిన కృషి ఫలితంగా రాష్ట్రంలో మున్సిపల్ కార్మికుల తొలి ఆందోళన కర్నూలులో జరిగింది. వేతనాలతో పాటు, జీవన పరిస్థితుల మెరుగుదల కోసం కమ్యూనిస్టుల సహకారంతో ఇక్కడి కార్మికులు 1938వ సంవత్సరంలో సభలు పెట్టి నిరసనలు తెలిపారు. అప్పట్లో 80 పాయిఖానాలను రెండు పూటల శుభ్రం చేస్తే నెలకు 9 రూపాయలు ఇచ్చేవారు. ఈ మొత్తాన్ని పెంచాలని వారు డిమాండ్ చేశారు. అదే ఏడాది జూన్ 30న మున్సిపల్ స్వీపర్స్ అండ్ స్కావెంజర్స్ యూనియన్ సమావేశం నంద్యాలలో జరిగింది. ఈ సమావేశంలో దినభత్యం నాలుగణాల నుండి ఐదణాలకుపెంచాలని, పాయిఖానాలు శుభ్రం చేసేవారికి మాస్కులు పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. 1939లో కాకినాడలో పీచుకార్మికుల సమ్మెకు సంఘీబావంగా మున్సిపల్ కార్మికులు ఒక్క రోజు సమ్మె చేశారు. దీనికి ప్రతిగా యాజమాన్యం కక్షసాధింపు చర్యలు దిగింది. దీనినిపారిశుధ్య కార్మికులు ప్రతిఘటించారు. అదే ఏడాది తెనాలిలో చెత్త బళ్లు తోలేవారి జీతాలను తగ్గించారు. దీంతో వారు సమ్మెకు దిగారు. తప్పనిసరి పరిస్థితుల్లో యాజమాన్యం జీతాల పెంపునకు అంగీకరించింది. అప్పట్లో చెత్త బళ్లను ఎడ్లతో కాకుండా పారిశుధ్య కార్మికులతో లాగించే విధానాన్ని మునిసిపల్ యాజమాన్యాలు అమలులోకి తీసుకువచ్చాయి. దీనిని నిరసిస్తూ అనేక చోట్ల సమ్మెలు ఆందోళనలు జరిగాయి. దీనితో పాటు వేతనాల పెంపు, ఇతర సమస్యల పరిష్కారం కోసం గుడివాడలో ఏప్రియల్ ఒకటి, 1939లో నుండి సమ్మె ప్రారంభమైంది. ఈ డిమాండ్లలో మున్సిపల్ ఉద్యోగుల్ని తిట్టడం, కొట్టడం మానుకోవాలని అని కూడా ఉండటం గమనార్హం. సమ్మె జయప్రదంగా సాగడంతో , మున్సిపల్ అధికారులు సమస్యల పరిష్కరించడానికి అంగీకరించారు. నెల్లూరులో అప్పటి మద్రాసు రాష్ట్ర ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా 1938 జులై ఒకటవ తేదిన పది డిమాండ్లతోకూడిన వినతిపత్రాన్ని మున్సిపల్ స్కావెంజర్ల సంఘం అధికారులకు అందచేసింది. దీంతో ఆ సమస్యలు పరిష్కరించడానికి అధికారులు అంగీకరించారు. మున్సిపల్ వర్కర్లు నివసించే ప్రాంతాలు చాలా ఘోరంగా ఉన్నాయని, అక్కడి రోడ్లు, లైట్లు, నీటి వసతి వంటి కనీస సౌకర్యాలు ఏర్పాటు చేయాలని ఈ వినతిపత్రంలో పేర్కొన్నారు. ఇప్పటికీ, రాష్ట్రంలోని అనేక చోట్ల పారిశుధ్య కార్మికులు నివసించే ప్రాంతాలు ఇటువంటి దుస్థితిలోనే ఉండటం గమనార్హం.

- ఫీచర్స్ అండ్ పాలిటిక్స్

పాలకుల తీరు

తాతలిచ్చిన ఆస్తులు
తగలేసే ట్రాష్టులు
ప్రభుత్వ సంస్థలను
అమ్మితినే పాలకులు
అడవులు, కొండలు
పొలాలు కార్పొరేట్లకు
అప్పులు బాధలు,
కాలుష్యం సామాన్యులకు



కార్పొరేట్ నైవేద్యం

ప్రజల సంపదలన్నీ
కార్పొరేట్ నైవేద్యం
పనులు లేక అల్లాడే
పేదయువత దైన్యం
ఎదుగుతున్న బిలియనీర్ల
చందమామనే చూపి
కాళ్లకింద నేల కూడా
కబళించే మోసం

'శంబాల' నుండి 'పదే పదే..' పాట విడుదల



ఆది సాయి కుమార్ హీరోగా రాజశేఖర్ అన్నభిమోజు, మహీధర్ రెడ్డి నిర్మించిన చిత్రం 'శంబాల'. యగంధర్ ముని దర్శకత్వంలో తెరకెక్కిన ఈ చిత్రంలో అర్చన అయ్యర్, స్వసిక, రవివర్మ, మధునందన్, శివ కార్తీక్ తదితరులు కీలక పాత్రల్ని పోషించారు. ఈ మూవీని డిసెంబర్ 25న భారీ ఎత్తున రిలీజ్ చేయబోతోన్నారు. ఈ క్రమంలో ప్రమోషన్స్‌లో భాగంగా తాజాగా ఈ చిత్రం నుండి 'పదే పదే' అంటూ సాగే పాటను రిలీజ్ చేశారు. ఈ పాటకు కిట్టు విస్సాప్రగడ సాహిత్యం అందించారు. యామిని ఘంటసాల ఆలపించారు. శ్రీచరణ్ పాకాల సంగీతం అందించారు.



25 నుంచి ఓటీటీలో 'ఆంధ్రకింగ్ తాలుకా'

రామ్ పోతినేని, ఉపేంద్ర కలిసి నటించిన మూవీ 'ఆంధ్రకింగ్ తాలుకా'.. నవంబర్ 27న విడుదలైన ఈ చిత్రం నెట్‌ఫ్లిక్స్‌లో ఓటీటీలో ఈనెల 25 నుంచి క్రిస్మస్ సందర్భంగా స్ట్రీమింగ్ కానుంది. మైత్రీమూవీ మేకర్స్ సంస్థ ఈ సినిమాను నిర్మించింది. దర్శకుడు పి.మహేష్‌బాబు తెరకెక్కించారు. ఇందులో భాగ్యశ్రీ బోర్సే, రావు రమేష్, రాహుల్ రామకృష్ణ, సత్య తదితరులు నటించారు. తెలుగుతో పాటు హిందీ, కన్నడ,మలయాళం, తమిళ్‌లో విడుదల అవుతుందని ఒక పోస్టర్‌ను చిత్ర యూనిట్ షేర్ చేసింది.

సందేశాత్మకంగా 'దండోరా'



గ్రామీణ నేపథ్యంలో సాగే సందేశాత్మక చిత్రంగా 'దండోరా' తెరకెక్కింది. తెలంగాణ సంస్కృతి, సామాజిక అంశాల మేళవింపుగా రానుంది. మురళీకాంత్ దర్శకత్వంలో రవీంద్ర బెనర్జీ ముప్పానేని నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 25న విడుదల కానుంది. మైత్రీ మూవీ మేకర్స్ ఈ చిత్రాన్ని నిర్మించారు. ఇప్పటికే చిత్ర యూనిట్ విడుదల చేసిన ట్రీజర్, పోస్టర్లు బాగా ఆకట్టుకుంటున్నాయి. గ్రామాల్లో ఇంకా కులం అడ్డుగోడలు తొలగిపోలేదని ఈ ట్రైలర్ చూస్తుంటే అర్థమవుతుంది. శివాజీ, నవదీప్, నందు, రవికృష్ణ, మానికా చిక్కాల, మౌనికా రెడ్డి, బిందుమాధవి, రాధ్య, అదితి భావరాజు కీలక పాత్రలు పోషించారు. మార్క్ కె.రాబిన్ సంగీతం.

మలయాళ దర్శకుడు శ్రీనివాసన్ కన్నుమూత




మలయాళ చిత్ర పరిశ్రమలో ప్రముఖ నటుడు, స్క్రీన్ రైటర్, దర్శకుడు, నిర్మాత అయిన శ్రీనివాసన్(69) కన్నుమూశారు.. అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శనివారం ఉదయం తుదిశ్వాస విడిచారు.

శ్రీనివాసన్ ఆకస్మిక మరణంతో ఆయన కుటుంబం, అభిమానులు, ప్రముఖులు తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యారు. శ్రీనివాసన్ 48 సంవత్సరాల సినీ కెరీర్‌లో 200కి పైగా సినిమాల్లో నటించారు. నేటికీ ప్రజాదరణ పొందిన కొన్ని చిరస్మరణీయ మలయాళ చిత్రాలను ఆయన రచించి దర్శకత్వం వహించారు.

'ది ప్యారడైజ్' బిర్యానిగా సంపూర్ణేష్ బాబు

నాని, శ్రీకాంత్ ఓదెల కాంబినేషన్‌లో వస్తున్న చిత్రం 'ది ప్యారడైజ్'. తాజాగా ఈ చిత్రం నుండి ఒక అప్డేట్ వచ్చింది. ఈ సినిమాలో సంపూర్ణేష్ బాబును మాస్ అవతారంలో శ్రీకాంత్ ఓదెల చూపించబోతున్నారు. ఇందులో ఆయన 'బిర్యానీ' అనే మాస్ పాత్రను పోషిస్తున్నారు. ఈ చిత్రంలో హీరో నాని (జడల్) కి అత్యంత సన్నిహితుడైన స్నేహితుడిగా, ప్రాణమిచ్చే నమ్మకస్థుడిగా 'బిర్యానీ' పాత్ర ఉండబోతోంది. ఈ పాత్ర కోసం సంపూర్ణేష్ బాబు చాలా బరువు తగ్గి, తన బాడీ లాంగ్వేజ్‌ను కూడా పూర్తిగా మార్చుకున్నట్లు చిత్ర బృందం తెలిపింది. ఈ చిత్రంలో మోహన్ బాబు, రాఘవ్ జుయల్, సోనాలి కులకర్ణి కీలక పాత్రల్లో నటిస్తున్నారు. అనిరుధ్ రవిచందర్ సంగీతం అందిస్తుండగా.. 2026 మార్చి 26న ప్రపంచవ్యాప్తంగా 8 భాషల్లో (తెలుగు, హిందీ, తమిళం, కన్నడ, మలయాళం, బెంగాలీ, ఇంగ్లీష్, స్పానిష్) ఈ చిత్రం విడుదల కానుంది.



హారర్ జోనర్‌లో 'ఈషా'

బన్నీ వాస్, వంశీ నందిపాటి తెరకెక్కించిన సినిమా 'ఈషా' హారర్ జోనర్‌లో సాగుతుంది. ఇటీవల విడుదలైన 'లిటిల్ హార్ట్స్', 'రాజు వెడ్స్ రాంబాయి' సినిమా లతో వీరు హిట్‌ను అందుకున్న విషయం తెలిసిందే. హెచ్‌వీఆర్ ప్రొడక్షన్స్ పతాకంపై నిర్మాత కెఎల్ దామోదర ప్రసాద్ సమర్పణలో హేమ వెంకటేశ్వరరావు ఈ చిత్రాన్ని నిర్మించారు. ఇందులో త్రిగుణ్; అఖిల్‌రాజ్ కథానాయకులు. హెబ్బా పటేల్ కథానాయిక. సిరి హనుమంతు, బబ్లూ, పృథ్వీరాజ్ ఇతర కీలక పాత్రలు పోషించారు. ఈనెల 25న విడుదల కానున్న ఈ సినిమా నుంచి ఓ వీడియోను ప్రచారం నిమిత్తం చిత్ర యూనిట్ విడుదల చేసింది.



టైటిల్ కొట్టేదెవరో..?

నేడు ఆసియాకప్ అండర్-19 ఫైనల్లో భారత్ × పాకిస్తాన్ ఢీ
ఉదయం 10.30గం॥ల నుంచి



దుబాయ్: అండర్-19 ఆసియాకప్ క్రికెట్ టోర్నీ ఫైనల్ ఆదివారం జరగనుంది. భారత్, పాకిస్తాన్ జట్ల మధ్య జరిగే ఫైనల్లో భారత యువ జట్టు టైటిల్ సాధనే లక్ష్యంగా బరిలో దిగుతోంది. శుక్రవారం జరిగిన సెమీఫైనల్లో భారత్ 8వికెట్ల తేడాతో శ్రీలంకపై, పాకిస్తాన్ జట్టు కూడా 8వికెట్ల తేడాతోనే బంగ్లాదేశ్‌ను ఓడించి ఫైనల్‌కు చేరాయి. ఓపెనర్లు సూర్యవంశీ, కెప్టెన్ ఆయుష్ మాత్రే బ్యాటింగ్‌లో రాణిస్తే భారీస్కోర్ ఖాయం. శుక్రవారం జరిగిన సెమీస్‌లో శ్రీలంక అండర్-19 జట్టు నిర్దేశించిన 139 పరుగుల లక్ష్యాన్ని భారతజట్టు కేవలం 18 ఓవర్లలో 2వికెట్లు మాత్రమే కోల్పోయి సునాయాసంగా ఛేదించింది. తొలుత విహాన్ మల్హోత్రా(4/45), ఆరోన్ జార్జ్(4/29)కి తోడు వైభవ్ సూర్యవంశీ(2/9) బౌలింగ్‌లో మెరిసారు. ఛేదనలో ఆరోన్ జార్జ్(58; 49బంతుల్లో 4ఫోర్లు, సిక్సర్), విహాన్ మల్హోత్రా(61నాటౌట్; 45బంతుల్లో 4ఫోర్లు, 2సిక్సర్లు) బ్యాటింగ్‌లో రాణించడంతో భారతజట్టు 18ఓవర్లలోనే మ్యాచ్‌ను ముగించింది. ఇక బంగ్లాదేశ్ నిర్దేశించిన 122 పరుగుల లక్ష్యాన్ని పాకిస్తాన్ 16.3ఓవర్లలో కేవలం 2 వికెట్లు మాత్రమే కోల్పోయి సాధించింది. పాకిస్తాన్ ఓపెనర్ సమీర్ నిన్హాస్(69నాటౌట్) అర్ధసెంచరీకి తోడు ఉస్మాన్ ఖాన్(27) రాణించి మ్యాచ్‌ను ముగించారు. అంతకుముందు పాక్ బౌలర్లు అబ్దుల్ సుభాన్(4/20), హుజైఫా(2/10) కట్టడి చేశారు. గ్రూప్ దశలో భారతజట్టు 90పరుగుల తేడాతో పాకిస్తాన్‌ను ఓడించింది. అలాగే ఈ టోర్నీలో భారతజట్టు ఓటమి ఎరుగక ఫైనల్‌కు చేరింది.

జట్లు(అంచనా)...

భారత్: ఆయుష్ మాత్రే(కెప్టెన్), సూర్యవంశీ, ఆరోన్ జార్జి, విహాన్ మల్హోత్రా, వేదాంత్ త్రివేది, అభిజ్ఞాన్ కుందు(వికెట్ కీపర్), కనిష్క్ చౌహాన్, ఖిలాన్ పటేల్, హేనిల్ పటేల్, దీపేశ్ దేవేంద్ర, కిషన్ కుమార్.

పాకిస్తాన్: ఫర్హాన్(కెప్టెన్), సమీర్ మిన్హాస్, హంజా జహూర్(వికెట్ కీపర్), ఉస్మాన్ ఖాన్, అహ్మద్ హుసైన్, హుజైఫా అహసాన్, దానియల్ అలీ, మహ్మద్ షాన్, అబ్దుల్ సుభాన్, మహ్మద్ సయ్యామ్, అలీ రాజా.

ఇషాన్ కిషన్ ఇన్.. శుభ్‌మన్ ఔట్..

- జితేశ్ స్థానంలో రింకు సింగ్‌కు చోటు
- టి20 ప్రపంచప్‌కు జట్టును ప్రకటించిన బిసిసిఐ



ముంబయి: ఐసిసి టి20 ప్రపంచకప్‌కు భారత క్రికెట్ కంట్రోల్‌బోర్డు (బిసిసిఐ) 15మందితో కూడిన జట్టును ప్రకటించింది. వైస్ కెప్టెన్ శుభ్‌మన్ శుభ్‌మన్ గిల్‌కి తోడు వికెట్ కీపర్, బ్యాటర్ జితేశ్ శర్మ తమ స్థానాలు కోల్పోగా.. సయ్యద్ ముస్తాక్ అలీ టోర్నీ టైటిల్ విజేత, జార్ఖండ్ కెప్టెన్ ఇషాన్ కిషన్ రెండేళ్ల తర్వాత జాతీయ జట్టుకు ఎంపికయ్యాడు. ఇక జితేశ్ శర్మ స్థానంలో రింకు సింగ్‌లకు చోటు లభించింది. ముంబయిలోని బిసిసిఐ ప్రధాన కార్యాలయంలో సెలెక్షన్ కమిటీ ఛైర్మన్ అజిత్ అగార్కర్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో బిసిసిఐ కార్యదర్శి దేవజిత్ సైకియా, కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ టి20 ప్రపంచకప్ టోర్నీకి జట్టును ఎంపిక చేశారు. జట్టు కాంబినేషన్‌లో భాగంగానే శుభ్‌మన్‌ను ప్రక్కన పెట్టినట్లు, అక్షర్ పటేల్‌కు వైస్ కెప్టెన్సీ బాధ్యతలు అప్పగిస్తున్నట్లు అగార్కర్ తెలిపాడు. ఇషాన్ చివరిగా 2023 నవంబర్ 28న ఆస్ట్రేలియాపై భారత్ తరపున చివరి మ్యాచ్ ఆడాడు. 2026 ఫిబ్రవరి 7నుంచి మార్చి 8 వరకు టి20 ప్రపంచకప్ జరగనుంది.

జట్టు: సూర్యకుమార్ యాదవ్(కెప్టెన్), అభిషేక్, సంజూ, ఇషాన్(వికెట్ కీపర్లు), తిలక్ వర్మ, హార్దిక్, దూబే, అక్షర్(వైస్ కెప్టెన్), రింకూ సింగ్, బుమ్రా, హర్షిత్ రాణా, అర్ష్‌దీప్, సుందర్, కుల్దీప్, వరుణ్ చక్రవర్తి.

సెమీస్‌లో పోరాడి ఓడిన సాత్విక్-చిరాక్

- బిడబ్ల్యుఎఫ్ వరల్డ్ టూర్ ఫైనల్స్



హాంగ్జౌ: బిడబ్ల్యుఎఫ్ వరల్డ్ టూర్ ఫైనల్ సెమీఫైనల్లో భారత షట్లర్లు పోరాడి ఓడారు. మూడుసెట్లపాటు హోరాహోరీగా సాగిన సెమీస్‌లో సాత్విక్ సాయిరాజ్ రంకిరెడ్డి-చిరాగ్ శెట్టి జంట 21-10, 17-21, 13-21తో లింగ్-వుయ్-కెంగ్, వాంగ్-ఛాంగ్ చేతిలో పరాజయాన్ని చవిచూశారు. తొలి గేమ్‌ను సునాయాసంగా నెగ్గిన భారత షట్లర్ల ద్వయం ఆ తర్వాత గేమ్‌లలో ప్రదర్శించలేకపోయారు. ఈ మ్యాచ్ సుమారు గంటా 3నిమిషాలసేపు సాగింది. ఆదివారం జరిగే పురుషుల డబుల్స్ ఫైనల్లో చైనా జంట కొరియాకు చెందిన టాప్‌సీడ్ కిమ్ వాన్, సియో సెంగ్ జీలతో తలపడనున్నారు. ఇక మహిళల సింగిల్స్ ఫైనల్‌కు కొరియాకు చెందిన టాప్ సీడ్ అన్-సే యంగ్, 2వ సీడ్ చైనాకు చెందిన వాంగ్ ఝీ హీ మధ్య జరగనుంది. ఇక పురుషుల సింగిల్స్ ఫైనల్ క్రిస్టో పోపోవ్(ఫ్రాన్స్), షీ యు ఖీ(చైనా)ల మధ్య జరగనుంది.

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68